చైతన్యరథం
సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు




## పోలీసు ఉద్యోగార్థులకు శుభవార్త

17

- 2,050 పోస్టులకు నోటిఫికేషన్
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం



తిరుమలలో ఎలక్ట్రికల్ బస్సుల ప్రారంభం



పిలిగ్రిమ్ ఎక్స్‌పిరియన్స్ సెంటర్‌లో సీఎం చంద్రబాబు



ఎస్వీ మ్యూజియం ప్రారంభం

# ఆధ్యాత్మికతకు ప్రపంచ నమూనాగా తిరుమల

- ఆరు అంశాల్లో టీటీడీ కార్యకలాపాల పునర్వవస్థీకరణ
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం
- విద్య, వైద్యరంగాల్లో శ్రీవారి సేవకులకు కార్యాచరణ
- భక్తుల కోసం రూ.2 లక్షల బీమా అమలు చేస్తున్నాం
- తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి స్కైవాక్ ప్రాజెక్ట్
- తిరుమల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- భక్తుల అనుభూతి పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- శ్రీడీ నమూనాలో ఎస్వీ మ్యూజియం ఆధునీకరణ
- భక్తుల రాకపోకలకు 32 ఎలక్ట్రికల్ బస్సులు



- పూర్తి వివరాలు 2,3లో

తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రాన్ని ఆధ్యాత్మికతకు ప్రపంచస్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. బుధవారం తిరుమలలో పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్–భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రతి భక్తుడికి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయనున్నట్లు చెప్పారు. దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశాల్లోనూ శ్రీవారి ఆలయాలు నిర్మించేలా ఆలోచన చేస్తున్నామని తెలిపారు. విద్య, వైద్యరంగా ల్లోనూ శ్రీవారి సేవకులను వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని వివరించారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వ వస్థీకరిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ వరకూ లింక్ చేసేలా స్కైవాక్ ప్రాజెక్టును త్వరలోనే కేంద్ర సహకారంతో చేపడ తామని వివరించారు.

# కార్పొరేట్ హంగులతో ప్రభుత్వ పాఠశాలలు



- నెల్లూరులో సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి
- మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ప్రారంభం
- బ్రహ్మరథం పట్టిన సింహపురి వాసులు

8,11

కార్పొరేట్ హంగులతో నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. సీఎస్ఆర్ నిధులతో కార్పొరేట్ తరహాలో సకల సౌకర్యాలతో రూపుదిద్దుకుంటున్నాయి. నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలో వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను, మూలాపేటలో ఆధునిక వసతులతో పునర్నిర్మించిన డీఎస్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. నెల్లూరు పర్యటనకు వచ్చిన లోకేష్‌కు మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. కోవూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహాన్ని లోకేష్ ఆవిష్కరించారు.



# ధరలకు కళ్లెం వేయాలి

- మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో నియంత్రించాలి
- వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి
- రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా నిత్యావసరాలు
- హైరిస్క్ ఉద్యాన పంటల రక్షణకు రూ.190 కోట్లు
- వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు

6

నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా కట్టడి చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై బుధవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ధరలను నియంత్రణ చేసేలా చూడాలని స్పష్టం చేశారు. రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా దాదాపు 60 రకాల నిత్యావసర సరుకులు సరఫరా చేయాలి.. ఉల్లి, కంది పప్పు వంటి వాటిని త్వరలో రైతుబజార్లు, రేషన్ డిపోల ద్వారా అందించాలని ఆదేశించారు. పామాయిల్‌ను కూడా రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలని సూచించారు.



# స్థానిక ఎన్నికల్లో వన్‌సైడ్ విక్టరీ రావాలి

- గొడ్డలి పార్టీ కుట్రలను తిప్పికొట్టాలి
- వైసీపీ నాయకులు ఫస్ట్ గ్రేడ్ క్రిమినల్స్... కుల,మత విభేదాలు కూడా రెచ్చగొడతారు
- డీఎస్పీ అంటే జగన్‌రెడ్డికి డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి
- కోవూరు సమన్వయ సమావేశంలో లోకేష్

9





# అర్హులైన ప్రతిఒక్కరికీ రుణాలు

- అన్ని రంగాలు, వర్గాలకు బ్యాంకింగ్ సేవలు చేరాలి
- 236 ఎస్ఎల్‌బీసీ సమావేశంలో సీఎం చంద్రబాబు

4

# నేడు వారణాసికి సీఎం చంద్రబాబు


- 'సేవా సంకల్ప్ అభియాన్' యాత్రకు హాజరు
- మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థాన కార్యక్రమం

5

# ఆధ్యాత్మికత క్షేత్రంగా తిరుమల

- ఆరు అంశాల్లో టీటీడీ కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం
- భక్తుల కోసం రూ.2 లక్షల బీమా అమలు చేస్తున్నాం
- విద్య, వైద్యరంగాల్లో శ్రీవారి సేవకులకు కార్యాచరణ
- టీటీడీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలకు చర్యలు
- తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి స్కైవాక్ ప్రాజెక్ట్
- త్వరలో కేంద్ర సహకారంతో చేపడతాం
- తిరుమలలో నెట్‌జీరో కాన్సెప్ట్‌తో కార్యకలాపాలు
- తిరుమల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు





తిరుమల (చైతన్యరథం): సీఎం చంద్రబాబు తిరుమలలో రెండోరోజు బుధవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిం చారు. తర్వాత టీటీడీ అధికారులతో సమీక్షించారు. అనంతరం దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడుతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. పవిత్రమైన దివ్యక్షేత్రంగా తిరుమలను అభివృద్ధి చేయాలనే లక్ష్యం తో పనిచేస్తున్నామని తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన ఎస్వీ మ్యూజియాన్ని ఆధునికీకరించి పునః ప్రారంభించినట్లు చెప్పారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణ యం లాంటి అంశాలను ప్రదర్శించేలా మ్యూజియంలో ఏర్పాటు చేసినట్లు వివరించారు. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో ఈ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. వచ్చే ఐదేళ్ల పాటు ఈ మ్యూజి యం నిర్వహణను కూడా ఆ ట్రస్టుకే అప్పగించాలని నిర్ణయించి నట్లు చెప్పారు. ప్రతీ భక్తుడికీ ఎల్ఐసీతో కలిసి ఆధార్ బేస్డ్ ఆన్‌లైన్ బీమా చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఎవరైనా భక్తులు దురదృష్టవశాత్తూ ఇక్కడ మృతిచెందితే వారికి రూ.2 లక్షల ఆర్థిక సాయం అందించనున్నట్లు వివరించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ 1లో దుర్లభ్ దర్శన్ పేరిట ఓ హీలింగ్ ఎక్స్‌పీరి యన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం. శ్రీవారి వైభవం, ఆలయ చరిత్రను ఇతర అంశాలను వివరించేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంట ర్ ఏర్పాటు అయింది. సామాన్య భక్తులందరికీ స్వామి వారి వైభవాన్ని అందించేలా ఈ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ అందుబా టులోకి వస్తుంది. తిరుమలలో భక్తుల రాకపోకల కోసం 32 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వచ్చాయి. రిలయన్స్ ఫౌండేష న్ 25, భారత్ బయోటెక్ సంస్థ 7 ఈవీ బస్సులను విరాళంగా టీటీడీకి ఇచ్చాయి. మొత్తం 44 ఎలక్ట్రిక్ బస్సులు ఇప్పుడు తిరుమలలో భక్తుల రాకపోకలకు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

## ఆధ్యాత్మికతకు కేంద్రాలుగా దేవాలయాలు

ఆధ్యాత్మికతకు కేంద్రాలుగా దేవాలయాలు తయారు కావాలన్నది మా ఆలోచన. శ్రీవాణి కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో 5000 దేవాలయాలను నిర్మించాలన్నది ఆలోచన. శ్రీవారి సేవ కులను కూడా ఈ ఆలయాలకు అనుసంధానించేలా కార్యక్రమం చేపడతాం. రాష్ట్రవ్యాప్తంగా 65 దేవాలయాలు టీటీడీతో అను సంధానమై ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా హిందువులు ఎక్కువగా ఉన్న నగరాల్లో శ్రీవారి దేవాలయాలను ఏర్పాటు చేయాలన్నది ఆలోచన. అలాగే రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గ కేంద్రాలు, ఇతర ప్రాంతాల్లో శ్రీవారి ఆలయాలు ఏర్పాటు చేస్తాం. ప్రతీ వాడలోనూ దేవాలయాలను నిర్మించటం ద్వారా ఆధ్యాత్మికతను పెంపొందిం చాలని నిర్ణయించాం. భవిష్యత్ తరాలకు మన సంస్కృతీ సంప్ర దాయాలను అందించాలన్నది ఆలోచన అని వివరించారు.

## ఇంకా మెరుగ్గా అన్న ప్రసాదం

రూ.3,165 కోట్ల కార్పస్ అన్నదానం ట్రస్ట్ కింద ఉంది. అన్న ప్రసాదాన్ని ఇంకా మెరుగ్గా అందించేలా చర్యలు చేపడతాం. ప్రాణదాన ట్రస్ట్ కింద రూ.191 కోట్లు, బర్డ్‌లో రూ.240 కోట్లు కార్పస్ ట్రస్ట్ కింద ఉంది. స్విమ్స్ బర్డ్స్, రుయా, చిన్నపిల్లల ఆస్పత్రి ఇలా అన్నింటినీ అనుసంధానం చేస్తాం. వైద్యులను కూడా శ్రీవారి సేవకులుగా మారి ఈ ఆస్పత్రుల్లో సేవలు అందిం చేలా చర్యలు చేపడతాం. తిరుపతిలో ఉన్న ఆస్పత్రులను అను సంధానించి మెరుగైన వైద్యచికిత్సలు అందేలా ప్రణాళిక చేస్తాం. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 12 లక్షల మంది శ్రీవారి సేవకులుగా రిజిస్టర్ చేసుకున్నారు. టీటీడీ ద్వారా అందే విద్యావ్యవస్థను కూడా పునర్వ్యవస్థీకరణ చేయాలని నిర్ణయించాం. విద్యార్థులకు నైపుణ్యం కల్పించటంతో పాటు మంచి ఉద్యోగాలు వచ్చేలా ఈ కార్యక్రమం చేపడతాం. శ్రీవారి దేవాలయాల పేరుతో రాష్ట్రంలో 5 వేల దేవాలాయల నిర్మాణం చేస్తాం. ప్రస్తుతం ఉన్న పాత దేవాలయాలను కూడా పునరుద్ధరించేలా చర్యలు శ్రీవాణి కార్యక్ర మం కిందే చేపడతాం. వృక్ష గోవిందం కార్యక్రమం కింద మెడిసినల్ ప్లాంట్స్ సహా వివిధ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాం. ఏడుకొండల నుంచి జాలువారే నీటిని సంరక్షించే లా కార్యక్రమాలు కూడా చేపట్టి భూగర్భజలాలు పెరిగేలా చర్యలు తీసుకుంటాం. మొత్తం ఆరు కార్యక్రమాల ద్వారా తిరు మల అభివృద్ధిని భక్తుల భాగస్వామ్యంతో చేపడతామని వివరించారు.

## తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి స్కైవాక్ ప్రాజెక్ట్

తిరుపతి రైల్వేస్టేషన్ నుంచి బస్టాండ్ వరకూ లింక్ చేసేలా స్కైవాక్ ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. త్వరలోనే కేంద్ర సహకారంతో ఈ ప్రాజెక్టు చేపడతాం. ఇటీవల సేకరించిన 50 ఎకరాల్లో మల్టీస్టోరీడ్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని భావిస్తున్నాం. ఉద్యోగులకు ఇంటి జాగాలు ఇచ్చేందుకు రూ.230 కోట్లు వ్యయం అవుతుంది. 5,192 మంది ఉద్యోగులకు ఇంటి జాగాల కు చర్యలు చేపడుతున్నాం. త్వరలోనే తిరుపతిని వివిధ హైవేలకు కనెక్ట్ చేసేలా కార్యాచరణ చేపడతాం. దిగువ తిరుపతిలో కోర్టు కాంప్లెక్సు కోసం రూ.90 కోట్ల వ్యయం అవుతోంది. తిరుపతి కేంద్రంగా పెద్దఎత్తున ఎకనామిక్ యాక్టివిటీ జరగాలి. శ్రీవారిని దర్శించుకోడానికి వచ్చే వారితో తిరుమల తిరుపతి సర్వీస్ హబ్‌గా మారుతుంది. తిరుమలతో పాటు తిరుపతిలోనూ శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగాలి. ఆధ్యాత్మికంగా ప్రజల్ని కలిపేందుకు ఈ ఉత్సవాలు అత్యంత కీలకం. వెడ్డింగ్ డెస్టినేషన్‌గా తిరుపతిని మార్చాలన్నది మా ఆలోచన అని తెలిపారు.

## నెట్‌జీరో కాన్సెప్ట్ విధానంలోనే కార్యకలాపాలు


తిరుపతి, తిరుమల అంతా నెట్‌జీరో కాన్సెప్ట్ విధానంలోనే కార్యకలాపాలు నిర్వహించాలి. సౌర, పవన విద్యుత్ పాటు బ్యాట రీ స్టోరేజి ద్వారా విద్యుత్ ఉత్పత్తి జరగాలి. ప్రతీ టీటీడీ భవనంపైనా సౌరవిద్యుత్ ప్యానళ్లు ఏర్పాటు చేయాలని సూచిస్తు న్నాం. ప్రస్తుతం కోటి యూనిట్లు ఉత్పత్తి చేస్తుంటే 10 కోట్ల యూనిట్లు టీటీడీ వినియోగిస్తోంది. ఉత్పత్తి అయ్యే వ్యర్థాలు సర్క్యులర్ ఎకానమీకి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలి. పర్యావర ణాన్ని కాపాడుకునేలా జీరో వేస్ట్ విధానం అమలు కావాలి. ఓ మోడల్‌గా తిరుమల అభివృద్ధి కావాలి. దేశంలోని అన్ని దేవాల యాల కంటే తిరుమల తిరుపతి అత్యంత పరిశు భ్రంగా చక్కటి నిర్వహణలో ఉంది. 2300 ఏళ్ల నుంచి ఉన్న ఈ దేవాలయం ప్రపంచంలోనే అత్యుత్తమ దేవాలయంగా ఉండాలి. అత్యంత సేవాభావంతో నిర్వహిస్తున్నాం కాబట్టే దేశవ్యాప్తంగా, ప్రపంచ వ్యాప్తంగా భక్తులు ఇక్కడికి వస్తున్నారని పేర్కొన్నారు.

## ఇతర ప్రాంతాల్లోనూ శ్రీవారి ఆలయాలు

శ్రీవేంకటేశ్వర స్వామి వైభవాన్ని విశిష్టతను ప్రశ్నించిన వారు కాలగర్భంలో కలిసిపోయారు. శిష్ట రక్షణ– దుష్ట శిక్షణ అనేది స్వామివారే చూసుకుంటారు. శ్రీవారి ఆస్తులు, ఆభరణాలు, బంగా రం, నిధులు, భూములు ఇలా అన్ని వివరాలు ఆన్‌లైన్‌లో అత్యంత పారదర్శకంగా ఉన్నాయి. మారిషస్, న్యూజిలాండ్ లాంటి దేశాల్లో శ్రీవారి ఆలయాలు నిర్మించాలని అడుగుతున్నారు. దీని గురించి కూడా ఆలోచన చేస్తున్నాం. దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ శ్రీవా రి ఆలయాలు నిర్మించాలని కోరుతున్నారు. వచ్చే ఏడాదికి సోమశిలకు, ఆపై కందలేరు బాలాజి సాగర్‌కు నీరు తీసుకొస్తాం. వచ్చే ఏడాదికి కల్యాణి డ్యామ్‌కు కూడా నీటిని తరలిస్తామని తెలిపారు.







# ఆధ్యాత్మికతకు ప్రపంచ నమూనాగా తిరుమల

- ఆరు అంశాల్లో టీటీడీ కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ
- రాష్ట్రంలో 5 వేల శ్రీవారి ఆలయాల నిర్మాణం లక్ష్యం
- భక్తుల కోసం రూ.2 లక్షల బీమా అమలు చేస్తున్నాం
- విద్య, వైద్యరంగాల్లో శ్రీవారి సేవకులకు కార్యాచరణ
- తిరుమల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవం
- భక్తుల అనుభూతి పెంచేలా ఎక్స్‌పీరియన్స్ సెంటర్
- శ్రీవారి ప్రాశస్త్యం తెలిసేలా ఎస్వీ మ్యూజియం అభివృద్ధి
- భక్తుల రాకపోకలకు 32 ఎలక్ట్రికల్ బస్సులు ప్రారంభం

తిరుమల (చైతన్యరథం): తిరుమలను పవిత్రమైన దివ్యక్షేత్రంగా, ఆధ్యాత్మికతకు ప్రపంచస్థాయి నమూనాగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. తిరుమలలో భక్తులకు మెరుగైన అనుభూతిని అందించ డంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆధ్యాత్మికత, సేవాభావం, ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తామని చెప్పారు. తిరుమ ల కొండల్లో 89.5 శాతం గ్రీన్ కవర్ ఉందని, దీన్ని మరింత పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బుధవారం తిరుమలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను సీఎం ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్-1 వద్ద ఏర్పాటు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, ఆధునికీకరించిన ఎస్వీ మ్యూజియం, రిలయన్స్ ఫౌండేషన్-భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద ఏర్పా టు చేసిన పిలిగ్రిమ్స్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో శ్రీవారికి నిర్వహిం చే నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు, తిరుమలలోని వివిధ ప్రాంతాలను త్రీడీ సాంకేతికత ద్వారా భక్తులు వీక్షించే అవకాశం కల్పించారు. ఆరు డీవీఆర్ వర్చువల్ రియాలిటీ ద్వారా తిరుమల దర్శన అనుభూతిని ముఖ్యమంత్రి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తిరుమలకు వచ్చే ప్రతి భక్తుడికీ బీమా సదుపాయం కల్పించాలని టీటీడీ నిర్ణయించిందని తెలిపారు. ఎల్ఐసీతో కలిసి ఆధార్ ఆధారిత ఆన్‌లైన్ బీమా అమలు చేయ నున్నట్లు చెప్పారు. దురదృష్టవశాత్తూ తిరుమలలో భక్తుడు మరణి స్తే రూ.2 లక్షల ఆర్థికసాయం అందేలా ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 5 వేల దేవాలయాలను శ్రీవాణి ట్రస్టు ద్వారా నిర్మాణం చేపడతామన్నారు. మారిషస్, న్యూజిలాండ్ వంటి దేశాల్లో కూడా శ్రీవారి ఆలయాలు నిర్మించాలని కోరుతు న్నారని, దీనిపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు. శ్రీవారి సేవకులను విద్య, వైద్యరంగాల్లోనూ వినియోగించుకునేలా కార్యాచరణ చేపడుతున్నామని








తెలిపారు. ఆరు అంశాల్లో తిరుమల తిరుపతి దేవస్థాన కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తామని స్పష్టం చేశారు.

## ఎస్వీ మ్యూజియం ఆధునికీకరణ

గతంలో ఉన్న ఎస్వీ మ్యూజియాన్ని ఆధునికీకరించి పునః ప్రారంభించారు. శ్రీవారి వైభవం, తిరుమల చరిత్ర, పురాణ గాథలు, శ్రీవారి పరిణయం తదితర అంశాలను భక్తులకు సుల భంగా అర్థమయ్యే రీతిలో ప్రదర్శించేలా టీటీడీ ఈ మ్యూజి యా న్ని సిద్ధం చేసింది. టీసీఎస్ ట్రస్ట్ రూ.104 కోట్లతో మ్యూజి యాన్ని అభివృద్ధి చేసింది. శ్రీకృష్ణదేవరాయలు సహా వివిధ రాజులు శ్రీవారికి సమర్పించిన ఆభరణాల నమూనాలు, వివిధ కాలాలకు చెందిన చారిత్రక వస్తువులు, స్వామివారికి అలంకరిం చే కిరీటాలు, ఆభరణాల త్రీడీ నమూనాలను మ్యూజియంలో ఏర్పాటు చేశారు. పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో ద్వారా శ్రీవారి పరిణయ విశేషాలను సీఎం చంద్రబాబు తిలకించారు. శ్రీవారి సేవకోసం, స్వామి వారిని కీర్తించేందుకు ఆనాటి సంగీత కారులు వినియోగించిన వాయిద్య పరికరాలను కూడా మ్యూజి యంలో ఆసక్తిగా పరిశీలించారు.

## 32 ఎలక్ట్రిక్ బస్సులు జెండా ఊపి ప్రారంభం

తిరుమలలో భక్తుల రాకపోకలకు వీలుగా రిలయన్స్ ఫౌండేష న్, భారత్ బయోటెక్ సంస్థలు అందించిన 32 ఎలక్ట్రిక్ బస్సుల ను సీఎం జెండా ఊపి ప్రారంభించారు. రిలయన్స్ ఈ-మొబిలిటీ సీఈవో నితిన్ సేత్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్రా ఎల్లా, మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు సహా టీటీడీ సభ్యులతో కలిసి నారాయణగిరి సర్కిల్ నుంచి ఎస్వీ మ్యూజియం వరకూ ఎలక్ట్రిక్ బస్సులో సీఎం ప్రయాణించారు.





చైతన్యరథం



# అర్హులకు రుణాలు అందితేనే అంతిమ ఫలితం






- **అన్ని రంగాలు, వర్గాలకు బ్యాంకింగ్ సేవలు చేరాలి**
- **పీఎం సూర్యఘర్‌లో రాష్ట్రాన్ని ప్రథమంలో నిలపాలి**
- **టిడ్కో గృహాలకు రుణాలపై కార్యాచరణ ప్రకటించాలి**
- **కౌలు రైతుల స్వయం సమృద్ధికి ముందుకురావాలి**
- **ఎస్‌హెచ్‌జీలకు వన్‌టైమ్ సెటిల్మెంట్ అమలుచేయాలి**
- **236 ఎస్ఎల్‌బీసీ సమావేశంలో సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలోని అన్ని రంగాలు, అన్ని వర్గాలను బలోపేతం చేసేలా బ్యాంకులు రుణాలు ఇవ్వాలని, ప్రతి అర్హుడికి బ్యాంకింగ్ సేవలు చేరాలని ముఖ్యమంత్రి చంద్రబాబు బ్యాంకర్లకు దిశానిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన 236వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో పలు కీలక సూచనలు చేశారు. కొన్ని బ్యాంకులు రుణాలు ఇచ్చే విషయంలో చాలా వెనకబడి ఉన్నాయని, లక్ష్యాలను చేరుకుంటేనే ఎస్ఎల్‌బీసీ సమావేశానికి అర్థం ఉంటుందని పేర్కొన్నారు. వ్యవసాయ రుణాలు సహా వివిధ వర్గాలకు బ్యాంకులు అందించే సేవలపై సీఎం సమీక్షించారు. గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రస్తావించిన అంశాలపై ఏ మేరకు చర్యలు తీసుకున్నారని బ్యాంకర్లను అడిగి తెలుసుకున్నారు. మొత్తం 13 అంశాలకు గానూ 9 అంశాలపై చర్యలు తీసుకున్నామని బ్యాంకర్లు తెలిపారు. గత ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చిన అంశాలను, లక్ష్యాలను ఇంకా చేరుకోకపోవడం సరికాదని వ్యాఖ్యానించారు. ఎంఎస్ఎంఈలకు రుణాల మొత్తం గతం కన్నా ఈసారి పెరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో రుణాల మంజూరు జరగలేదని వారి దృష్టికి తెచ్చారు.





### కౌలు రైతులకు రుణాలపై దృష్టి పెట్టండి

పీఎం సూర్యఘర్‌లో దేశంలోనే ముందు స్థానంలో రాష్ట్రాన్ని నిలపాలని భావిస్తున్నాం. బ్యాంకులు పెద్దఎత్తున రుణాలు ఇస్తేనే ఇది సాధ్యమవుతుంది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి 15 శాతం సాధించాలని లక్ష్యం పెట్టుకున్నప్పటికీ ఎల్‌నినో కారణంగా ఇబ్బందికర పరిస్థితి తలెత్తింది. ప్రతికూలతలు అధిగమించేందుకు కృషి చేస్తున్నాం. కౌలు రైతులకు రుణాలు సమృద్ధిగా అందించేలా బ్యాంకులు ముందుకురావాలి. రుణాల చెల్లింపుల్లో స్వయం సహాయక సంఘాల మహిళలు ఆదర్శంగా నిలుస్తున్నారు. దేశంలోనే నెంబర్-1 స్థానంలో నిలిచారు. రుణాలు తీసుకున్న వారిలో 99 శాతానికి పైగా మహిళలు రుణాలను సమయానికే చెల్లించేస్తు న్నారు. కేవలం 0.67 శాతం మంది మహిళలు మాత్రమే రుణాల చెల్లింపుల్లో వెనకబడ్డారు. వీరి నుంచి రుణాల 100 శాతం రికవరీ సాధించేందుకు వన్‌టైమ్ సెటిల్మెంట్ విధానం గురించి బ్యాంకులు ఆలోచన చేయాలి. అలాగే టిడ్కో గృహాలకు రుణాలు ఇచ్చేందుకు కార్యాచరణ త్వరితగతిన అమలులోకి తీసుకురావా లి. సైబర్ మోసాలపై అప్రమత్తత అవసరం. డీజీపీ సైబర్ సెక్యూరిటీ సెల్‌తో సమన్వయం జరగాలి. రాష్ట్రవ్యాప్తంగా సైబర్ ఫ్రాడ్-ఫైనాన్షియల్ లిటరసీ అవగాహన కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి. నాలా చట్టం రద్దు చేసినందున నాలా పేరుతో రుణాలు ఇవ్వకుండా ఎవరినీ ఇబ్బందులకు గురిచేయవద్దని చెప్పారు.

### 236వ ఎస్ఎల్‌బీసీ సమావేశంలో ముఖ్యాంశాలు

ఆంధ్రప్రదేశ్‌లో బ్యాంకింగ్‌లో రుణాల వేగం పెరిగింది. 2026 జూన్ నాటికి రూ.10.28 లక్షల కోట్లకు మొత్తం అడ్వా న్సులు చేరాయి. వ్యవసాయ రంగానికి భారీగా రుణ మద్దతు లభించింది. జూన్ 2026 నాటికి వ్యవసాయ రుణాలు రూ.3.98 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గతేడాది కన్నా ఎక్కువ. అటు ఎంఎస్ఎంఈలకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరం జూన్ వరకు తొలి త్రైమాసికంలో 2.33 లక్షల ఎంఎస్ఎంఈలకు రూ.63,686 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. అటు పీఎం సూర్యఘర్‌కు సెప్టెంబర్ 10 నాటికి 1,57,703 దరఖాస్తులు రాగా రూ.3,081 కోట్ల రుణాల మంజూరు చేశారు. మహిళా స్వయం సహాయక సంఘాల రుణాలపై అన్ని బ్యాంకుల్లో సర్వీస్ ఛార్జీల నుంచి పూర్తిస్థాయి మినహాయింపు ఇచ్చాయి. ఎస్‌హెచ్‌జీ లకు సెప్టెంబర్ 10 నాటికి మొత్తం రూ.18,621 కోట్ల రుణాల పంపిణీ జరిగింది. పీఎం ముద్ర రుణాల్లో భారీ పురోగతి కనిపిం చింది. సెప్టెంబర్ 10 నాటికి 4,48,562 దరఖాస్తులకు రూ.13,757 కోట్ల రుణాలను బ్యాంకులు మంజూరు చేశాయి. మరోవైపు సమీక్షలో రాజధాని అమరావతి ఫైనాన్సియల్ హబ్‌లో పలు బ్యాంకు కార్యాలయాల నిర్మాణాల పురోగతిని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మరింత వేగంగా నిర్మాణాలు పూర్తి చేయడంపై బ్యాంకులు దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. అలాగే ఇకపై ఎస్ఎల్‌బీసీ సమావేశాలను బ్యాంకులు, జిల్లాలు, విభాగాల వారీగా ఫలితాలు విశ్లేషించిన తర్వాతే దానిపై సమీక్షిం చాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ సమావేశంలో మంత్రు లు పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు, కొండపల్లి శ్రీనివాస్, బ్యాంకింగ్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# అల్ట్రా మెగా ప్రాజెక్టుగా బీపీసీఎల్ రిఫైనరీ

- త్వరితగతిన పనులు ప్రారంభించేలా చర్యలు
- రిఫైనరీ సమీపంలో 1,500 ఎకరాల్లో
- పెట్రోకెమికల్స్ పార్క్ ఏర్పాటుకు ప్రణాళికలు
- బీపీసీఎల్ సీఎండీతో సమావేశంలో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): రామాయపట్నం పోర్టు సమీపంలో భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ బీపీసీఎల్ చేపట్టనున్న గ్రీన్ ఫీల్డ్ రిఫైనరీ కమ్ పెట్రోకెమికల్ ప్రాజెక్టు పనులు త్వరిత గతిన ప్రారంభించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశా రు. రిఫైనరీ సమీపంలో పెట్రో కెమికల్ పార్కును కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ సీఎండీ సంజయ్ ఖన్నాతో సీఎం సమావేశమయ్యారు. ప్రకాశం- నెల్లూరు జిల్లాల మధ్య ఏర్పాటు కానున్న బీపీసీఎల్ రిఫైనరీ ప్రాజె క్టు వ్యయం దాదాపు రూ.1.45 లక్షల కోట్లకు చేరిందని సంజయ్ ఖన్నా తెలిపారు. ఏడాదికి 9 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఇంటిగ్రేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీని ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. ప్రాజెక్టుకు తుది పర్యావరణ అనుమతి సెప్టెం బరు చివరి నాటికి వచ్చే అవకాశం ఉందని సీఎంకు తెలిపారు. ఇంజినీరింగ్ ఇండియా లిమిటెడ్ చేపట్టిన అధ్యయన నివేదిక వచ్చి న వెంటనే ఈ ఏడాది అక్టోబరు నెలలోనే తుది పెట్టుబడి వ్యయం ఖరారు అవుతుందని వివరించారు. ఆ తదుపరి రిఫైనరీ నిర్మాణ పనులను ప్రారంభిస్తామని స్పష్టం చేశారు.

### పెట్రో కెమికల్ పార్కు ఏర్పాటుపై సూచన

ప్రాజెక్టులో భాగంగా రిఫైనరీ నుంచి యూరో-6 ప్రమాణాలతో కూడిన ఇంధనం ఉత్పత్తి అవుతుందని బీపీసీఎల్ సీఎండీ వివరిం చారు. మోటార్ స్పిరిట్, హైస్పీడ్ డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ కలిపి సుమారు 5.4 మిలియన్ టన్నులు ఉత్పత్తి కానున్నట్టు తెలియచేశారు. ఇతర పెట్రోకెమికల్స్ ఉత్పత్తులు సుమారు గా 3.2 మిలియన్ టన్నులు ఉంటుందన్నారు.

ఉప ఉత్పత్తులుగా హెచ్‌డీపీఈ, ఎల్‌డీపీఈ, ఎల్ఎల్‌డీపీఈ, పాలీ ప్రొపైలీన్, పాలీ వినైల్ క్లోరైడ్ వంటి బై ప్రోడక్ట్స్ కూడా వస్తాయని వివరించారు. బీపీసీఎల్ రిఫైనరీ నిర్మాణం కోసం అవసరమైన 6 వేల ఎకరాల భూమిలో 75 శాతాన్ని ఇప్పటికే అప్పగించామని సీఎం తెలిపారు. మిగిలిన భూమిని అక్టోబరు రెండో వారంలోగా అప్పగి స్తామన్నారు. ప్రాజెక్టుకు సంబంధించిన ప్రక్రియలను వేగవంతం చేసి వీలైనంత త్వరగా పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని బీపీసీఎల్ ప్రతినిధులను కోరారు. రిఫైనరీ సమీపంలో సుమారు 1,500 ఎకరాల్లో డౌన్‌స్ట్రీమ్ పెట్రోకెమికల్స్ పార్క్ ఏర్పాటుకు బీపీసీఎల్, ఏపీఐఐసీ కలిసి ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

### భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తులు

భారత్‌లో పట్టణీకరణ, తయారీ రంగం విస్తరణతో పెట్రో కెమికల్స్‌కు డిమాండ్ వేగంగా మారుతోందని సీఎం వివరించారు. దేశ పెట్రోకెమికల్ ఇంటెన్సిటీ ఇండెక్స్ ప్రస్తుతం 5 శాతం నుంచి వచ్చే దశాబ్దంలో 15-20 శాతానికి పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని రిఫైనరీని నిర్మించాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ముడి చమురును కేవలం ఇంధనంగా వినియోగించకుండా ఇథలీన్, ప్రొపైలీన్ వంటి రసాయన ముడి పదార్థాల ఉత్పత్తిని పెంచే విధంగా ఆధునిక రిఫైనరీల రూపకల్పన జరగాలని సూచించారు. ప్రాథమిక పాలిమర్లకే పరిమితం కాకుండా అధునా తన మెటీరియల్ విభాగాల్లో పెరుగుతున్న డిమాండ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు. దేశంలో కెమికల్, పెట్రోకెమికల్ రంగం 2040 నాటికి 1 ట్రిలియన్ డాలర్లకు చేరు తుందని, ఆ అవసరాలను తీర్చే దిశగా బీపీసీఎల్ పనిచేస్తుందని సీఎండీ సంజయ్ ఖన్నా తెలిపారు. ఈ సమావేశంలో బీపీసీఎల్ డైరెక్టర్ ఫైనాన్స్ వీఆర్కే గుప్తా, ఏపీ రిఫైనరీ ఈడీ రాజీవ్, జీఎం రిటైల్ టి.చతుర్వేది, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# తిరుపతిలో డివిజన్లు 66కు పెంచుతూ గ్రీన్‌సిగ్నల్




- నగరపాలక డివిజన్ల పునర్విభజనకు ఆమోదం
- స్థానిక సంస్థల ఎన్నికలకు వేగంగా కసరత్తు

తిరుపతి(చైతన్యరథం): తిరుపతి నగరపాలక సంస్థలో డివిజన్ల పునర్విభజనకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ప్రస్తుతం ఉన్న 50 డివిజన్లను 66కు పెంచుతూ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నగరపాలక సంస్థపరిధిలో రాజకీయ కసరత్తు మరింత వేగం పుంజుకోనుంది. స్థానిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని నగరపాలక సంస్థ అధికారులు ఏప్రిల్ చివరి వారంలో 50 డివిజన్లను 66గా పునర్విభజించే ప్రక్రియను చేప ట్టారు. డివిజన్ల సరిహద్దులు, జనాభా తదితర అంశాలను పరిగణ నలోకి తీసుకుని ప్రతిపాదనలు రూపొందించి ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించారు. గడువులో ప్రజల నుంచి వచ్చిన అభ్యంతరాలను అధికారులు స్వీకరించి పరిశీలించారు. అవస రమైన చోట స్వల్ప మార్పులు, చేర్పులు చేసి తుది ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అనంతరం 66 డివిజన్లతో కూడిన తుది జాబితాను ప్రభుత్వానికి పంపించారు. తాజాగా ప్రభుత్వం దీనికి ఆమోదం తెలపడంతో డివిజన్ల పునర్విభజన ప్రక్రియ పూర్తయింది. 66 డివిజన్లకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో తిరుపతి నగర రాజకీ యాల్లో ఎన్నికల వేడి మరింత పెరిగే అవకాశం ఉంది. పెరిగిన డివిజన్లలో రిజర్వేషన్లు, అభ్యర్థుల ఎంపిక, ఆయా పార్టీల బలా బలాలపై రాజకీయ వర్గాల్లో అప్పుడే చర్చ మొదలైంది.

## నేడు సీఎం చంద్రబాబు వారణాసి పర్యటన

**'సేవా సంకల్ప్ అభియాన్' యాత్రకు హాజరు**

**మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థాన కార్యక్రమం**

అమరావతి (చైతన్యరథం): ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని వారణాసిలో గురువారం జరగనున్న 'సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబా బు పాల్గొనున్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ప్రజా జీవితంలో నరేంద్ర మోదీ చేసిన సేవలను పురస్కరించుకుని దేశవ్యాప్తంగా నెలరోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు. ఇందులో భాగంగా కాశీ నగరంలో వారణాసి-వాద్న గర్ సేవా యాత్రను చేపట్టారు. ప్రధాని మోదీ ప్రజా జీవితంతో ప్రత్యేక అనుబంధం ఉన్న వారణాసి, వాద్నగర్‌ను అనుసంధాని స్తూ ఈ సేవా సంకల్ప్ అభియాన్‌లో సీఎం చంద్రబాబు పాల్గొంటారు. యువత, ప్రజా ప్రతినిధులు, సేవా ప్రతినిధుల భాగస్వా మ్యంతో ఈ సంకల్ప్ అభియాన్ చేపట్టారు. దేశ అభివృద్ధి ప్రయా ణంలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత కీలకమనే సందేశాన్ని 'సేవా సంకల్ప్ అభియాన్' ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లనున్నారు. ప్రతీ గ్రామం, ప్రతి కుటుంబం, యువత, ప్రతి మహిళ అభివృద్ధి ప్రక్రియలో భాగస్వామి కావాలనే స్ఫూర్తితో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. సీఎం చంద్రబాబు గురువారం ఉదయం 7.30 గంటలకు విజయవాడ నుంచి బయలుదేరి 9.35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ముందుగా 11.15 గంటలకు వారణాసిలోని కాశీ విశ్వనాథుడిని దర్శించుకోనున్నారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్ చేరుకుని సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్ర మంలో పాల్గొంటారు. తర్వాత మధ్యాహ్నం 3.10 గంటలకు వారణాసి నుంచి బయలు దేరి 5.15గంటలకు తిరిగి అమరావతి చేరుకోనున్నారు.





# ధరలకు కళ్లెంతోనే ద్రవ్యోల్బణం కట్టడి

- మార్కెట్ ఇంటర్వెన్షన్‌తో ధరల నియంత్రణ
- వ్యవస్థలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలి
- రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా నిత్యావసరాలు
- హైరిస్క్ ఉద్యాన పంటల రక్షణకు రూ.190 కోట్లు
- వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో సీఎం చంద్రబాబు



అమరావతి(చైతన్యరథం): నిత్యావసరాల ధరలు సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ద్రవ్యోల్బణాన్ని నియంత్రించేందుకు ముందస్తు అంచనాలతో పంటల సాగు, ఉత్పత్తి, మార్కెట్ నిర్వహణపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ శాఖలపై బుధవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ద్రవ్యోల్బణం పెరగడానికి గల కారణాలను అంచ నా వేయాలని సూచించారు. ఉత్పత్తి డిమాండ్‌కు తగ్గట్టు ఉందా, సరఫరా పరిస్థితులు తదితర అంశాలను విశ్లేషించుకుని దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎలాంటి చోట్ల, ఏయే పంటలకు మార్కెట్ ఇంటర్వెన్షన్ అవసరమో గుర్తిం చి ధరలు పెరగకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ మేరకు వివిధ పంటలకు కేంద్రం ప్రకటించిన కనీస మద్దతు ధరలను రాష్ట్రంలో అమలు చేయడంతో పాటు రైతులను ఆయా పంటలు సాగు చేసేలా ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ధరలను నియంత్రణ చేసేలా చూడాలని స్పష్టం చేశా రు. అవసరమైతే రైతుల నుంచి బై బ్యాక్ ఒప్పందాలు చేసుకోవా లని సూచించారు. ఆయిల్ ఫెడ్, మార్క్ ఫెడ్, రైతు బజార్లు, రేషన్ డిపోల వంటి వ్యవస్థలను పూర్తిస్థాయి లో వినియోగించుకోవాలని స్పష్టం చేశారు. కనీస మద్దతు ధర ప్రకటిస్తే ఉత్పత్తులు ప్రభుత్వం చెంతకే చేరతాయని, తద్వారా ధరల నియంత్రణకు అవకాశం ఉంటుందన్నారు. ప్రిడిక్షన్ చేశాక ప్రొడక్షన్‌కు వెళ్లాలి...ఆ మేరకు మార్కెట్ కూడా అంచనా వేసు కోవాలని స్పష్టం చేశారు.

### రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా సరఫరా

రైతు బజార్లు, రేషన్ డిపోల ద్వారా దాదాపు 60 రకాల నిత్యా వసర సరుకులు సరఫరా చేసేలా చూడాలని సీఎం సూచించారు. ఉల్లి, కంది పప్పు వంటి వాటిని త్వరలో రైతుబజార్లు, రేషన్ డిపోల ద్వారా అందించాలని సూచించారు. పామాయిల్‌ను కూడా రేషన్ డిపోల ద్వారా సరఫరా చేయాలన్నారు. ఉల్లి, మిర్చి వంటి పంటలను ఎప్పుడూ పండించే ప్రాంతాల్లో కాకుండా ఇతర ప్రాంతాల్లో కూడా పండించే అంశాన్ని పరిశీలించాలని ఆదేశిం చారు. రైతు సేవా కేంద్రాల వారీగా ఏయే పంటలు పండిస్తు న్నారో తెలుసుకోవాలని, ఉల్లి ఎంత అవసరం, ప్రస్తుతం ఎంత అందుబాటులో ఉందో అంచనా వేసుకోవాలని తెలిపారు. ధరలు ఏ విధంగా పెరుగుతాయో ముందుగానే అంచనా వేసి ప్రస్తుత మార్కెట్‌ను నియంత్రణ చేసుకుంటూ అవసరమైన పంటలు వేసేలా చూడాలని సూచించారు. రాయితీ విత్తనాలు, అవసరమైన యంత్ర పరికరాలు ఇచ్చి ఆ పంటలు వేసేలా రైతులను ప్రోత్స హించాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎక్కడా పశుగ్రాసం లేక పాల ఉత్పత్తి తగ్గిందనే మాట రాకూడదన్నారు. పశు వుల దాణాకు ఇబ్బంది రాకుండా చూడాలని స్పష్టం చేశారు.

### అంచనాల ఆధారంగా పంటల సాగు

రాష్ట్రంలో పంటల సాగు చేయని 8.61 లక్షల హెక్టార్లలో వర్షాధార పంటలు వేసేలా చూడాలని ఆదేశించారు. చిరు ధాన్యాలు, రాగి, కొర్రలు, జొన్న, బాజ్రా వంటి పంటలను సాగు చేయించాలని, మొక్కజొన్న వేసేలా చూడాలని సూచించారు. ఉలవల సాగుపై కూడా దృష్టి పెట్టాలన్నారు. నేచురల్ ఫార్మింగ్‌ను ప్రోత్సహించాలన్నారు. ఏయే ప్రాంతాల్లో ఏయే పంటలు వేయ వచ్చో గుర్తించి ఆ మేరకు రైతులతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. రాష్ట్రంలో 3.61 లక్షల హెక్టార్లలో ఉద్యాన పంట లు హైరిస్క్‌లో ఉన్నాయని అధికారులు పేర్కొనగా, హైరిస్క్‌లో ఉన్న ఉద్యాన పంటలను రక్షించేందుకు లైఫ్ సేవింగ్ ఇరిగేషన్ కోసం రూ.190 కోట్ల కేటాయిస్తున్నట్టు తెలిపారు. ఈ నిధులను హైరిస్క్‌లో ఉన్న ఉద్యాన పంటలను రక్షించేందుకు అవసరమైన చర్యలకు వినియోగించాలని సూచించారు. ఇందులో భాగంగా వాటర్ ట్యాంకర్లను పంపించడం వంటి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రతి నెలా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టుకు ×ూజాూ గ్లోబల్ అవార్డు-2026 (ICRISAT Center of Excellence for South-South Cooperation in Agriculture) రావడం పై అధికారులను అభినందించారు. ఈ సమీక్షలో మంత్రులు అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నియోజకవర్గానికో లేబర్ అడ్డా

### ఏసీ హాల్, విశ్రాంతి గదులతో కార్మికులకు ఆధునిక వసతులు

భీమవరం (చైతన్యరథం): భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికు లకు మె రుగైన వసతులు, ఉపాధి కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఆధునిక 'లేబర్ అడ్డాలను అందుబాటులోకి తీసుకువస్తోంది. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా 25 అడ్డాలను నిర్మించగా, జిల్లాలో తాడేపల్లిగూడెంలో నిర్మాణం పూర్తయింది. మిగిలిన అన్ని నియోజకవర్గాల్లో ఒక్కొక్క టి, జిల్లా కేంద్రమైన భీమవరంలో రెండు అడ్డాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులతోనే ఈ నిర్మాణాలను చేపడుతున్నారు. ఇటీవల నిర్వహించిన కేబినెట్ భేటీలో సీఎం నారా చంద్రబాబునాయుడు ఈ మేరకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పనుల కోసం రోడ్లపై ఎండన పడి పడిగాపులు కాసే దుస్థితికి చరమగీతం పాడుతూ కార్మికుల కోసం ఈ అడ్డాల్లో ఏసీ సౌకర్యంతో కూడిన విశ్రాంతి గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడ డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రీసోర్స్ పర్సన్లను నియమిస్తారు. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాల్లో సాగుతున్న కార్మికుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఇకపై లేబర్ అడ్డాల్లోనే జరగనుంది. దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో ఏర్పా టవుతున్న ఈ లేబర్ అడ్డాలను ఆధునిక సాంకేతికతతో అనుసంధానిస్తున్నారు. ప్లంబర్, ఎలక్ట్రీషియన్, పెయింటర్, తాపీ మేస్త్రీ, వడ్రంగి వంటి సేవలు అవసరమైన ఇంటి యజమానులు నేరుగా బుక్ చేసుకు నేందుకు వీలుగా ప్రత్యేక యాప్‌ను రూపొందించారు.





# కోవూరులో ఎన్టీఆర్ కాంస్య విగ్రహం



### ఆవిష్కరించిన మంత్రి నారా లోకేష్

కోవూరు(చైతన్యరథం): నెల్లూరు జిల్లా పర్యటనలో భాగంగా కోవూరు బైపాస్ సాయిబాబా గుడి వద్ద ఏర్పాటు చేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు కాంస్య విగ్రహాన్ని మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు కోవూరు పట్టణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం కోవూరు పట్టణం నుంచి బైపాస్ వరకు మంత్రి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్‌రావు, మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు బీద రవిచంద్ర యాదవ్, జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.









చైతన్యరథం



# కార్పోరేట్ హంగులతో మున్సిపల్ హైస్కూల్

**రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి - మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా ప్రారంభం**

నెల్లూరు (చైతన్యరథం): కార్పోరేట్ హంగులతో నెల్లూరులో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నేతృత్వంలో శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి చేసి కార్పోరేట్ స్కూళ్లను తలపించేలా సకల సౌకర్యాలతో అందుబాటు లోకి తీసుకువస్తున్నారు. నెల్లూరు నగరంలో మొత్తం 15 ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చే ప్రయత్నంలో భాగంగా ఇప్పటికే వీఆర్సీ స్కూల్‌ను ఆధునికీకరించడం జరిగింది. ఈ నేపథ్యంలో బుధవారం నెల్లూరు పట్టణం స్టోన్‌హౌస్‌పేటలో ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్ మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు నెల్లూరు ఎంపీ, వీపీఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు.



అనంతరం ఆధునికీకరించిన ఆర్ఎస్ఆర్ ప్రభుత్వ పాఠశాల భవనాలను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో తరగతి గదులు, ల్యాబ్‌లు, డైనింగ్ హాల్‌ను పరిశీ లించి విద్యార్థులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం నాణ్య తపై ఆరాతీశారు. బాగా చదువుకుని తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### రూ.8.3 కోట్లతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి

వీపీఆర్ ఫౌండేషన్ రూ.8.3 కోట్ల సీఎస్ఆర్ నిధులతో ఆర్ఎస్ఆర్ మున్సిపల్ హైస్కూల్‌ను అభివృద్ధి చేయడం జరిగింది. రెండు అంతస్థుల్లో భారీ నిర్మాణంతో 43 తరగతి గదులు అందు బాటులోకి తీసుకువచ్చారు. విద్యార్థులకు డిజిటల్ బోధన అందిం చేందుకు ఎల్ఈడీ స్క్రీన్‌లు, అధునాతన బెంచీలను ఏర్పాటు చేశారు. పాఠ్యపుస్తకాలకే విద్యను పరిమితం చేయకుండా ప్రయోగాత్మక, సాంకేతిక విద్యకు ప్రాధాన్యం ఇస్తూ కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందిం చేందుకు ఆర్ట్, మ్యూజిక్, డ్యాన్స్, లాంగ్వేజ్ రూమ్‌లు తదితర ప్రత్యేక వసతులను కల్పించడం జరిగింది. విద్యార్థుల ఆరోగ్యం, పరిశు భ్రతకు ప్రాధాన్యమిస్తూ మోడ్రన్ టాయిలెట్లను ఏర్పాటు చేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించాలనే లక్ష్యంతో పాఠశాలలో ఎకరా స్థలంలో విశాలమైన క్రీడా ప్రాంగ ణాన్ని అభివృద్ధి చేశారు. ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్ కోర్టులు సిద్ధం చేశారు. అదనంగా కిడ్స్ ప్లే ఏరియా, సెన్సరీ పార్క్, అవుట్‌డోర్ జిమ్ వంటి ఆధునిక సదుపాయాలను కల్పించారు. సుమారు 21 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో సింథటిక్ కోర్టు ఏర్పాటు చేశారు.

### ప్రైవేటుకు ధీటుగా ఆధునిక సదుపాయాలు

నర్సరీ నుంచి పదో తరగతి వరకు విద్యాబోధనకు అనువుగా పాఠశాలను తీర్చిదిద్దడం జరిగింది. ఒకే ప్రాంగణంలో పాఠశాల విద్యకు అవసరమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, గ్రంథాలయం, కళలు, క్రీడలు, డిజిటల్ విద్య తదితర సదుపాయాలను అందుబా టులోకి తీసుకొచ్చారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యా ర్థులు కూడా ప్రైవేట్, కార్పోరేట్ పాఠశాలల విద్యార్థులతో సమా నంగా ఆధునిక సదుపాయాలను వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఈ విద్యాయజ్ఞాన్ని మంత్రి లోకేష్ ముందుకు తీసుకెళ్తున్నారు.

### ప్రైవేటు పాఠశాలలతో పోటీ పడాలి


ఆధునికీకరించిన పాఠశాలను ప్రారంభించిన అనంతరం పాఠశాల పనితీరుపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.ప్రసాద్, ఇతర అధికారులతో లోకేష్ సమీక్షించారు. లెర్నింగ్ అవుట్ కమ్స్ లో స్కూల్ వెనుకబడి ఉందని, ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. గతేడాది పదో తరగతిలో 60.19 శాతం ఉత్తీర్ణత సాధిం చారని, ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంపుపై దృష్టి సారించాలని సూచించారు. స్టూడెంట్ ఎన్‌రోల్‌మెంట్ కూడా తగ్గిందని, ప్రైవే టు పాఠశాలలతో పోటీపడాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపైనా ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి పి. నారాయణ, నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ పి.షరణి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.











చైతన్యరథం




# స్థానిక ఎన్నికల్లో వన్‌సైడ్ విక్టరీ రావాలి

- **గొడ్డలి పార్టీ కుట్రలను తిప్పికొట్టాలి**
- **వైసీపీ నాయకులు ఫస్ట్ గ్రేడ్ క్రిమినల్స్...**
- **కుల,మత విభేదాలు కూడా రెచ్చగొడతారు**
- **డీఎస్సీ అంటే జగన్‌రెడ్డికి**
- **డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి**
- **కోవూరు సమన్వయ సమావేశంలో లోకేష్**



కోవూరు/నెల్లూరు జిల్లా(చైతన్యరథం): అక్టోబరు, నవంబరులో స్థానిక సంస్థల ఎన్నికలు జరగబోతున్నాయి..స్థానిక ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు వన్‌సైడ్ విక్టరీ రావాలి..రాష్ట్రవ్యాప్తంగా ఎన్డీయే జెండా ఎగరాలని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. కోవూరు అసెంబ్లీ నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలిస్తే కార్యకర్తలకు న్యాయం, ప్రజలకు మరింత సేవ చేయగలమని పేర్కొన్నారు. వైసీపీ నాయకులు ఫస్ట్ గ్రేడ్ క్రిమినల్స్..రాజకీయ ముసుగులో కుల, మత విభేదాలు రెచ్చగొడతారు..మనం అప్రమ త్తంగా ఉండాలి.. వారి దుష్ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పికొట్టా లని పిలుపునిచ్చారు. కోడికత్తి డ్రామా చూశాం.. సొంత బాబాయి ని లేపేసి బాబు గారి చేతిలో కత్తిపెట్టి నారాసుర రక్తచరిత్ర అని రాశారు. ఇటీవల ఈడీ అవినాష్‌ను పిలిచింది. ఎన్నికల సమయంలో జగన్ గులకరాయి డ్రామా చూస్తే ఆశ్చర్యమేసింది. ప్రతిదీ చంద్రబాబు, లోకేష్ చూసుకోవడం సాధ్యం కాదు. మనకు వారి మాదిరి దొంగ పేపర్లు, టీవీలు లేవు. అయితే కోటిమంది కార్యకర్తలు ఉన్నారు. మనమంతా మాట్లాడటం మొదలుపెడితే వారు ఎన్ని రాసినా ప్రజలు నమ్మరని తెలిపారు.

## చేసిన మంచిని ప్రజలకు వివరించాలి

భారతదేశంలో ఎవరూ ఇవ్వని విధంగా పెన్షన్లు ఇస్తున్నాం. ఇంట్లో ఎంతమంది చదువుకునే పిల్లలు ఉంటే అందరికీ తల్లికి వందనం ఇస్తున్నాం, స్త్రీశక్తి కింద ఉచిత బస్సు కల్పిస్తున్నాం. రైతులకు అన్నదాత సుఖీభవ, చేనేతల సేవలో, ఆటోవాలా సేవలో, మత్స్యకారుల సేవలో వంటి పథకాలు అమలు చేస్తు న్నాం. 16 వేల టీచర్ పోస్టులు, 6వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీచేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది. గూగుల్, రాయల్ ఎన్ ఫీల్డ్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను రాష్ట్రానికి రప్పించాం. అభివృద్ధి, సంక్షేమం జోడెడ్ల బండిలాంటివి. వాటిని సమర్థమం తంగా ముందుకు తీసుకెళుతున్నాం. వైసీపీ హయాంలో రోడ్లపై పడిన గుంతలు పూడ్చడానికి రూ.2 వేల కోట్లు ఖర్చయ్యాయి. ప్రజాప్రభుత్వం గత రెండేళ్లలో చేసిన మంచిపనులతో పాటు గొడ్డలిపార్టీ కుట్రలను ప్రజలకు తెలియజెప్పాల్సిన బాధ్యత క్యాడర్ పై ఉందని పేర్కొన్నారు.

## వేమిరెడ్డి దంపతులకు అభినందనలు

నెల్లూరుగడ్డపై ఎంతో గొప్పవాళ్లు జన్మించారు. ప్రపంచంలో ఎక్కడికెళ్లినా నెల్లూరు వాళ్లు ఉంటారు. స్వాతంత్ర్య సమరయోధు డు బెజవాడ గోపాలరెడ్డి జన్మించిన నేల కోవూరు. ఎన్టీఆర్ పార్టీని స్థాపించినపుడు కోవూరుకు చెందిన బెజవాడ పాపిరెడ్డి తొలి కార్యకర్తగా చేరారు. ఎంతో గొప్ప చరిత్ర ఉన్న నేల ఇది. కోవూరులో అన్నగారి విగ్రహంలేని లోటు తీర్చిన వేమిరెడ్డి దంపతులకు అభినందనలు. కోవూరు టీడీపీ కంచుకోట. కొందరు మనపార్టీలో గెలిచి వేరే పార్టీలోకి వెళ్లారు. అయినా ఎత్తిన పసుపుజెండా దించ ని కార్యకర్తలు అండగా నిలబడ్డారు. ఈ నియోజకవర్గంలో 8 సార్లు మనం గెలిచాం. వీపీఆర్ తాగునీటి సమస్య పరిష్కారానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు చేస్తున్నారు. ప్రజలకోసం ఏదో చేయాలనే తపన ఆయనలో ఉంది. ఎంతోమంది డబ్బు సంపాదించినా అటువంటి ఆలోచన రావడం అభినందనీయమని ప్రశంసించారు.

## డీఎస్సీ అంటే జగన్‌కు డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి

డీఎస్సీకి, ఏపీపీఎస్సీకి తేడా తెలియని వ్యక్తి నన్ను ప్రశ్నిస్తున్నా రు. దేశ చరిత్రలో అనేకమంది సీఎంలను చూశా..గత ఐదేళ్లలో సైకోని చూశా. గొడ్డలిపార్టీ అధినేతకు డీఎస్సీ అంటే డ్రగ్స్, శాండ్, చీప్ లిక్కర్ గుర్తొస్తాయి. వారు అధికారంలో ఉన్న సమ యంలో ఒక్క టీచర్ పోస్టు ఇవ్వలేదు. మనం 16 వేల టీచర్ పోస్టులు ఇస్తే ప్రశ్నిస్తున్నారు. డీఎస్సీపై తప్పుడు ఆరోపణలతో సీబీఐ ఎంక్వయిరీకి ఆదేశించాలని హైకోర్టులో వాళ్లు పిటిషన్ వేశారు. కోర్టు మొట్టికాయలు వేయడంతో పిల్ వేస్తే విత్ డ్రా చేసుకున్నారు. ఏ తప్పు చేయని చంద్రబాబును 53 రోజులు జైలులో పెడితే సింహంలా తిరిగివచ్చారు. ఆయన ఎప్పుడూ భయ పడలేదు. నేను మళ్లీ చాలెంజ్ చేస్తున్నాను. డీఎస్సీపై చర్చకు నేను సిద్ధం, జగన్ సిద్ధమా? అని సవాల్ విసిరారు. అరిగి పోయిన రికార్డులా డీఎస్సీలో అవకతవకలు అంటూ లేనిపోని విమర్శలు చేస్తున్నారు. ఎటువంటి తప్పు జరగకపోయినా ప్రజల ను నమ్మించేలా వాళ్లు అబద్ధాలు చెబుతున్నారు. మనం నిజాన్ని ఎక్కువసార్లు ప్రజలకు చెప్పాలి. ఇటీవల 10 వేల టీచర్, పోలీసు, ఇతర పోస్టులతో నోటిఫికేషన్ ఇచ్చాం. అదీ మన చిత్తశుద్ధి అని వివరించారు.

## కులం ముసుగులో వస్తున్నారు...తస్మాత్ జాగ్రత్త

వైసీపీ నాయకులు కులం ముసుగులో జనంలోకి వస్తున్నారు. సీదిరి అప్పలరాజు కొడుకు యాక్సిడెంట్ చేసి ఒక వ్యక్తిని చంపేస్తే మరొకరిని తీసుకొచ్చి కేసు మాఫీ చేసుకోవాలని చూశా డు. జగన్ చనిపోయిన బీసీ కుటుంబం పరామర్శకు వెళ్లకుండా అప్పలరాజు ఇంటికి వెళ్లాడు. జగన్ బడా చోర్ అయితే, కారుమూరు నాగేశ్వరరావు చోటా చోర్. మద్యంలో 400 కోట్లు దోచేసి, కోడలు అకౌంట్‌లో వేసి బుక్ చేశాడు. ఇన్‌కం టాక్స్, ఈడీ వాళ్లు వచ్చి బొక్కలో వేశారు. ఆ వ్యవహారంలో మనకు సంబంధం లేదు. అయినా మనపై తోస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అమర్ నాథ్ గౌడ్, నందం సుబ్బయ్యలను ఎలా చంపారో చూశాం. గొడ్డలిపార్టీ

(తరువాయి 10లో..)



చైతన్యరథం

# స్థానిక ఎన్నికల్లో వన్‌సైడ్ విక్టరీ రావాలి





(9వ పేజీ తరువాయి..)

మారణకాండపై బీసీల్లో చైతన్యం తేవాలి. ఐదేళ్ల అరాచకాలను ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత ఉంది. సంక్షేమం, అభివృద్ధితో పాటు గొడ్డలిపార్టీ దుష్ప్రచారాన్ని కూడా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

### మరోసారి ఆమె గురించి తప్పుగా మాట్లాడితే సహించం

ప్రజల కోసం ప్రశాంతిరెడ్డి రాజకీయాల్లోకి వచ్చారు. వారిది గౌరవంగా బతికే కుటుంబం, ఏనాడు తప్పు చేయలేదు. కొంత మంది రౌడీలు, నియోజకవర్గానికి ఒక్కపని చేయని వారు ఆమె గురించి మాట్లాడుతున్నారు. త్వరలో మీ టైం కూడా వస్తుంది, ఎవరినీ వదలిపెట్టం. నీతి,నిజాయితీగా ప్రజలకోసం రాజకీయా ల్లోకి వచ్చిన వీపీఆర్ కుటుంబం గురించి, వారి క్యారెక్టర్ గురించి మాట్లాడే హక్కు వైసీపీ నాయకులకు ఎవరిచ్చారు. మరోసారి అటువంటి మాటలు మాట్లాడితే వారి సంగతి చూస్తా. అసెంబ్లీలో సైకోలు చేసిన వ్యక్తిత్వ హనన వ్యాఖ్యల వల్ల నాతల్లి మూడునెలలు బాధపడింది. ఏనాడూ నేను జగన్ తల్లి విజయలక్ష్మి, చెల్లి షర్మిల గురించి మాట్లాడలేదు. ఆయన భార్య భారతి గురించి ఓ కార్యకర్త మాట్లాడితే జైలుకు పంపించాం. పార్టీ ఏదైనా రాజకీయం వేరు, కుటుంబం వేరుగా చూడాల్సిన అవసరం ఉంది. బుల్లెట్ దిగిందా, గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటా అన్న వ్యక్తి ఇప్పుడు ఏమయ్యాడో చూశాం. ఈరోజు అతడి పరిస్థితి ఏమిటి..బాబుగారి జోలికి ఎవరు వచ్చినా మాడి మసైపోయారని పేర్కొన్నారు.

### కార్యకర్తే అధినేత నినాదాన్ని చేతల్లో చూపుతున్నాం

కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని చేతల్లో చూపుతున్నాం. పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున అధ్యక్షుల వారి పక్కన సాధారణ కార్యకర్తలు కూర్చున్నారు. కడప మహానాడులో మనం చేసుకున్న ఆరు శాసనాల్లో ఒకటి కార్యకర్తే అధినేత. పసుపు సైన్యం త్యాగం, రక్తం వల్లే మనకు అధికారం దక్కింది. పల్నాడులో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టి వారి పార్టీకి జైకొట్టమంటే జై టీడీపీ, జై చంద్రబాబు అని ప్రాణాలు వదిలారు. ఆయనే నాకు స్ఫూర్తి, ఆయన కుమారుడికి ఉద్యోగం ఇచ్చేందుకు చట్టాన్ని సవరించాం. చంద్రయ్య కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చిన ఘనత టీడీపీది. మంజుల, అంజిరెడ్డి తాత ధైర్యాన్ని చూశాం. మనది ఒక పెద్ద కుటుంబం. కార్యకర్తల కోసం సంక్షేమ నిధి, ఇప్పటివరకు రూ.175 కోట్లు అందించాం. కార్యకర్తలు ఆర్థికంగా నిలదొక్కు కోవాలన్నదే మా లక్ష్యం. ప్రతి కార్యకర్త సొంత కాళ్లపై నిలబడా లన్నది బాబు గారి ధ్యేయం. కార్యకర్తల ఆర్థిక స్వావలంబన, ఆరోగ్యం ముఖ్యం. మన ఆరోగ్యం బాగుంటే కుటుంబం, పార్టీ బాగుంటాయి.పార్టీ కార్యాలయంలో రక్తపరీక్షలు చేయించుకోండి. ఉచితంగా మందులు కూడా అందించే బాధ్యత నాది. మై టీడీపీ, మై హెల్త్ యాప్‌లు తెచ్చాం. ఆ కార్యక్రమానికి సహకరించాలని సూచించారు.

### నా తెలుగుదేశం-నా బాధ్యత నినాదానికి కట్టుబడి ఉండాలి

కార్యకర్తలంతా నా తెలుగుదేశం, నా బాధ్యత అనే నినాదానికి కట్టుబడి ఉండాలి. జిల్లా నుంచి పార్లమెంటు వ్యవస్థ తేవడానికి మూడు పొలిట్‌బ్యూరో సమావేశాలు పట్టింది. పార్టీలో మార్పు రావాలి, యువరక్తం రావాలని పోరాడా. మనది కోటి 6 లక్షల సభ్యులున్న అతిపెద్ద కుటుంబం. చిన్నచిన్న సమస్యలు ఉంటే అంతర్గతంగా మాట్లాడుకుందాం. ఏదేని అంశంపై పార్టీ నిర్ణయం తీసుకున్నాక జై తెలుగుదేశం, జై చంద్రబాబు అనాలి. పాదయాత్ర చేసినపుడు కార్యకర్తలు కలిశారు. పనిచేసిన వారికి గుర్తింపు ఇవ్వాలన్నారు. అందుకే మై టీడీపీ యాప్ తెచ్చాం. పార్టీ పిలుపు ఇచ్చిన కార్యక్రమాలు చేసిన నామినేటెడ్ పోస్టులు వెదుక్కుంటూ వస్తాయి. ప్రతి వ్యక్తి యాక్టివిటీని చంద్రబాబు చూస్తున్నారు. ఇంటింటికీ టీడీపీ కార్యక్రమంలో 45 రోజుల్లో కోటి 10 లక్షల గడపలు కార్యకర్తలు తొక్కారు. ఒకరోజు 47 వేలమంది పాల్గొన్నా రు. అదే మనందరికీ శ్రీరామరక్ష. కార్యకర్తలు నాయకుల చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. మిమ్మల్ని గుర్తించే బాధ్యత తనదని పేర్కొన్నారు.

### క్యాడర్ అంతా ప్రజలతో మమేకం కావాలి

కార్యకర్తలు ప్రజల వద్దకు వెళ్లి, వారితో మమేకం కావాలి. వారితో అనుబంధం చాలా ముఖ్యం. ప్రజలతో బంధం ఏర్పడటం వల్లే మంగళగిరి ప్రజలు నన్ను 91 వేల మెజారిటీతో గెలిపించా రు. కార్యకర్తలంతా ప్రజలతో అనుసంధానం అవ్వండి. ప్రజలకు దగ్గర కావాల్సిన అవసరం ఉంది. క్లస్టర్, యూనిట్ పనిచేయక పోతే దండం పెట్టి మార్చుకుంటాం. డోర్ టు డోర్ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా 8వేల బూత్‌లలో ఇన్చార్జిలు తిరగలేదు. 75ఏళ్ల వయసులో బాబు గారు తిరుగుతుంటే మనం వెళ్లకపోతే ఎలా? పార్టీ కార్యకర్తలంతా సీరియస్‌గా తీసుకుని పనిచేయండి. ఏ కార్యక్రమం చేసినా మన టీడీపీ యాప్ ద్వారా తెలియజేయండి. కోటి 6 లక్షలకు తోడు మనకు జనసేన, బీజేపీ కూడా ఉన్నాయి. నోక్రాస్ ఫైర్, మిస్ ఫైర్, విడాకులు ఉండవు. పార్టీ అధినేతలుగా మాకు ఎలాంటి డౌట్లు లేవు. డౌట్ వస్తే నేను పవనన్నకు నేరుగా ఫోన్ చేస్తా. చిన్నచిన్న సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని సూచించారు.

### ప్రభుత్వ కొనసాగింపు ముఖ్యం

ప్రభుత్వ కొనసాగింపు వల్ల గుజరాత్, ఒడిశా రాష్ట్రాలు అభివృ ద్ధి చెందాయి. ఐదేళ్లు ప్రభుత్వం మారడం వల్ల ఇబ్బంది పడ్డాం. జైలుకు వెళ్లాం. కష్టకాలాన్ని మర్చిపోకూడదు. 2019-24వరకు దొంగ కేసులు పెట్టారు. నాపై 23 కేసులు పెట్టారు. కేసులపై అప్రమత్తంగా ఉండాలి. భైరెడ్డి శబరి నేతృత్వంలో కమిటీ వేశాం, రివ్యూ చేసి దొంగ కేసులు తీసేస్తున్నాం. ఎవరిపైనైనా తప్పుడు కేసులు ఉంటే పార్టీ ఆఫీసుకు తెలియజేయండి. ఉపాధి హామీ, నీరు చెట్టు, ఇతర బిల్లులు క్లియర్ చేశాం. 200 కోట్లు పెండింగ్ ఉంది. అది కూడా క్లియర్ చేస్తాం. 2029 నాటికి పెండింగ్ ఉన్నా యంటే ఒప్పుకోను. కోవూరులో అద్భుతమైన నాయకత్వం ఉంది. వారికి అండగా నిలబడాలి. నియోజకవర్గాన్ని కంచుకోటగా తయా రుచేయాలి. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా తెలుగుదేశం జెండా ఎగరాలని పిలుపునిచ్చారు.

### లోకేష్ చేతులమీదుగా ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఆనందంగా ఉంది

ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల అమరావతి లో నిర్వహించిన కాంక్లేవ్ తన లాంటి రాజకీయ నాయకులకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. కోవూరులో తొలిసా రిగా ఎన్టీఆర్ విగ్రహాన్ని యువనేత లోకేష్ చేతులమీదుగా ఆవిష్క రించడం ఆనందంగా ఉందన్నారు. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ యువనేత లోకేష్ కార్యకర్తే అధినేత అనే నినాదాన్ని ఆచరణలో చూపుతున్నారు. కోవూరులో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ ఇక్కడి ప్రజల కల. 83 నుంచి పనిచేసిన కార్యకర్తలు కోవూరులో ఎంతోమంది ఉన్నారు. కోవూరులో పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు అండగా నిలబడింది కార్యకర్తలే. వారసత్వ మంటే ఆస్తులు పంచుకోవడం కాదు, ఆశయాన్ని పంచుకోవడ మని చాటిచెప్పిన నాయకుడు నారా లోకేష్. వయసులో చిన్న వాడైనప్పటికీ పార్టీ పటిష్టత కోసం చంద్రబాబు గారి అడుగు జాడల్లో పనిచేస్తున్నారు. భవిష్యత్ తరాలకు దిక్సూచి లాంటివాడు. కార్యకర్తల సంక్షేమం కోసం ఆయన ఎన్నో కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టులతో పాటు పెద్దఎత్తున పరిశ్రమలు రాష్ట్రానికి రావడానికి లోకేష్ కృషే కారణం. రికార్డు టైమ్‌లో డీఎస్సీ నిర్వహించి 16 వేల మందికి టీచర్ ఉద్యోగాలిచ్చిన లోకేష్‌పై తప్పుడు ఆరోపణలతో బురద జల్లుతున్నారు. మెగా డీఎస్సీ గురించి మాట్లాడే అర్హత లేని పార్టీ వైసీపీ అని ప్రశాంతిరెడ్డి ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, రాష్ట్ర మంత్రి ఎన్ఎండీ ఫరూక్, జోనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకట్రాజు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, పార్లమెంటు పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర రెడ్డి, కోవూరు నియోజకవర్గ అబ్జర్వర్ ఐనంపూడి రమేష్ పాల్గొన్నారు.









# ఆధునిక సౌకర్యాలతో డీఎస్ఆర్ పాఠశాల

**రూ.13.41 కోట్ల వ్యయంతో అభివృద్ధి - ప్రారంభించిన మంత్రి నారా లోకేష్ - సీఎస్ఆర్ నిధులతో మారిన రూపురేఖలు**

నెల్లూరు(చైతన్యరథం): నెల్లూరు మూలాపేటలో ఆధునిక వసతులతో పునర్ నిర్మించిన డీఎస్ఆర్(దేవిరెడ్డి శారద) ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ రూ.13.41 కోట్ల సీఎస్ఆర్ నిధులతో పాఠశాలను అభివృద్ధి చేయడం జరిగింది. ముందుగా పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు దేవిరెడ్డి శారద ఛారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, మేనేజింగ్ ట్రస్టీ డి.సుధాకర్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ ట్రస్టీ డి.ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆధునికీకరించిన డీఎస్ఆర్ గవర్నమెంట్ హైస్కూల్‌ను రిబ్బన్ కట్ చేసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని, దేవిరెడ్డి శారద విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.




### రూ.13.41 కోట్ల వ్యయంతో అభివృద్ధి

డీఎస్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత దేవిరెడ్డి సుధాకర్‌రెడ్డి రూ. 13.40 కోట్ల దాతృత్వంతో పాఠశాలను పునర్ నిర్మించారు. రెండంతస్థుల్లో సుమారు 24 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో 24 తరగతి గదులు నిర్మించారు. విద్యార్థులకు ఆధునిక బోధన అందించేందుకు 15 ఎల్ఈడీ స్క్రీన్‌లు, 300 బెంచీలు ఏర్పాటు చేశారు. ప్రస్తుత విద్యా అవసరాలకు అనుగుణంగా పాఠశాలలో ప్రత్యేక ల్యాబొరేటరీలను ఏర్పాటు చేశారు. కంప్యూటర్, రోబోటిక్స్, ఆస్ట్రో, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ ల్యాబ్‌లు విద్యార్థులకు ప్రయోగాత్మక విద్యకు వేదికగా నిలవనున్నాయి. అదేవిధంగా ఆర్ట్, మ్యూజిక్, సిక్, స్టోర్, లాంగ్వేజ్ రూమ్‌లు, లైబ్రరీ వంటి ప్రత్యేక సదుపాయాలను కల్పించారు. విద్యార్థుల ఆరోగ్యం, పరి శుభ్రతకు ప్రాధాన్యమిస్తూ ఆధునిక టాయిలెట్లను ఏర్పాటు చేశారు.

### విద్యార్థుల సమగ్ర వికాసానికి పెద్దపీట

పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల సమగ్ర వికాసానికి పెద్దపీట వేశారు. బాస్కెట్‌బాల్, పికిల్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, కోకో కోర్టులు సిద్ధం చేశారు. అదేవిధంగా ఓపెన్ మ్యూజికల్ ఇన్‌స్ట్రుమెంట్స్, కిడ్స్ ప్లే ఏరియా, సెన్సరీ పార్క్, అవుట్‌డోర్ జిమ్, క్రికెట్ ప్రాక్టీస్ నెట్‌లు ఏర్పాటు చేశారు. ప్లే క్లాస్ నుంచి పదో తరగతి వరకు విద్యాబోధనకు అనువుగా పాఠశాలను తీర్చి దిద్దారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి అడుగుపెట్టిన నాటి నుంచి పాఠశాల విద్య పూర్తయ్యే వరకు అవసరమైన అన్ని వసతులను ఒకే ప్రాంగణంలో సమకూర్చారు.

### పాఠశాల పనితీరుపై మంత్రి సమీక్ష

పాఠశాల భవనాలను ప్రారంభించిన అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యు.పద్మలత, అధికారులతో లోకేష్ సమీక్షించారు. విద్యార్థుల హాజరు తక్కువగా ఉండటంపై అసం తృప్తి వ్యక్తం చేశారు. ఇందుకు గల కారణాలను అడిగి తెలుసు కున్నారు. స్కూల్ లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై దృష్టిపెట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు. గతేడాది కంటే విద్యార్థుల ప్రవేశాలు పెరగడంపై హర్షం వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల్లో కూడా మంచి ఫలితాలు సాధించాలని ప్రశంసించారు. మధ్యాహ్న భోజ నంపై ఉపాధ్యాయుల ఫీడ్ బ్యాక్ 100 శాతం ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ బీద మస్తాన్‌రావు, మంత్రి పి.నారాయణ, పి.షరణి, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.















చైతన్యరథం

# సింహపురిలో లోకేష్‌కు బ్రహ్మరథం



నెల్లూరు పర్యటనకు వచ్చిన మంత్రి లోకేష్‌కు సింహపురి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. యువనేతకు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. తొలుత నెల్లూరులో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మంత్రి నారాయణ నేతృత్వంలో ఘనస్వాగతం పలికారు. పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. ప్రతిఒక్కరికి అభివాదం చేస్తూ లోకేష్ ముందుకుసాగారు. స్వాగ తం పలికిన వారిలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహ న్‌రెడ్డి, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మాజీ మేయర్ రూప్‌కు మార్ యాదవ్, రీజనల్ కోఆర్డినేటర్ మద్దిపాటి వెంకటరాజు తదితరు లు ఉన్నారు.

### కోవూరులో అపూర్వ స్వాగతం

నెల్లూరులో కార్యక్రమాలు ముగిసిన అనంతరం కోవూరు పర్యటనకు వచ్చిన లోకేష్‌కు ఘనస్వాగతం లభించింది. కోవూరు పసుపుమయమైంది. బాణాసంచా మోతలు, కోలాట నృత్యాలు, గరగలు, అశ్వకదళాలతో పెద్దఎత్తున స్వాగతం పలికారు. లోకేష్ ను చూసేందుకు మండుటెండలోనూ ప్రధాన రహదారికి ఇరు వైపులా జనం బారులు తీరారు. కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక తొలిసారిగా కోవూరు నియోజకవర్గానికి వచ్చిన లోకేష్‌కు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు అపూర్వ స్వాగతం పలికారు.



















## వైసీపీ నేతలకు ధైర్యముంటే

# డీఎస్సీపై ఆరోపణలు కాదు.. ఆధారాలు చూపండి

- **రాష్ట్రంలోని ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 90 శాతం టీడీపీ హయాంలో నియమితులైనవారే**
- **ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, బదిలీల్లో పారదర్శకతకు బీజం వేసిందే చంద్రబాబు**
- **వైసీపీ హయాంలోని ఏపీపీఎస్సీ స్కాంనుండి దృష్టి మరల్చేందుకే డీఎస్సీపై ఆరోపణలు**
- **గుడ్డకాల్చి మొహాన పడేస్తామంటే ప్రజలు తాటతీస్తారని వైసీపీ నేతలకు మంత్రి కొల్లు వార్నింగ్**

మచిలీపట్నం (చైతన్య రథం): ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు, బదిలీల్లో పారదర్శకతకు బీజం వేసిందే నారా చంద్రబాబు నాయుడు అని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. ఈ మేరకు మచిలీపట్నం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేశాం. పారదర్శకంగా నియామకాలు పూర్తి చేశాం. కానీ ఏదో జరిగిపోయి దంటూ వైసీపీ నేతలు ఆరోపణలు చేయడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. ఒకప్పుడు టీచర్ల బదిలీలు జిల్లా పరిషత్ చైర్మన్లు నడిపించేవారు. ఎవరికి ఎక్కడ రాస్తే అక్కడకు బదిలీ చేసేవారు. కానీ చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక దేశంలోనే మొట్టమొదటిసారి కౌన్సిలింగ్ విధానం తీసుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలను పారదర్శకంగా నిర్వహించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల్లో 90 శాతం టీడీపీ హయాంలో నియమితు లైనవారే. మెరిట్ ప్రకారమే నియామకాలు జరగాలనే సిద్ధాంతంతో పని చేశాం. వైసీపీ ఐదేళ్ల పాలనలో ప్రభుత్వ ఉద్యోగుల్ని జలగల్లా పీడించారు. ఉపాధ్యాయుల్ని మద్యం షాపుల ముందు కాపలా పెట్టారు. మరుగుదొడ్ల కడిగించి ఫోటోలు తీయిం చారు. కానీ నేడు ఉపాధ్యాయులకు మెరుగైన శిక్షణ కోసం విదేశాలకు పంపిస్తున్నాం. అత్యుత్తమ విధ్యా విధానాలను అధ్యయనం చేసే అవకాశం కల్పించాం.

బదిలీలు కావాలంటే డబ్బు తీసుకోవడంలో తప్పేముందని బందరులోని వైసీపీ నేత నిస్సిగ్గుగా మాట్లాడుతున్నాడు. ప్రభుత్వ ఉద్యోగులు 'గిఫ్టలు ఇస్తే తప్పేముంది, ఉద్యోగస్తులు గిఫ్టలు తీసుకుంటే తప్పేముందని సిగ్గులేకుండా మాట్లాడుతున్నాడు. వాళ్లు అసలు మనుషులేనా? కూటమి ప్రభుత్వంలో అత్యంత పారదర్శకంగా ఉద్యోగ బదిలీలు జరిగాయి. నియామకాలు జరిగాయి. యువత జీవితాలు నాశనం చేసేలా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారు. నారా లోకేష్ గారు విద్యాశాఖ మంత్రిగా చేపట్టిన సంస్కర ణల వల్ల 19వ స్థానంలో ఉన్న రాష్ట్ర విద్యా రంగం ప్రస్తుతం అగ్రస్థానానికి చేరింది. ఎయిడెడ్ స్కూల్స్ అన్నింటిని దోచుకోవాలని వైసీపీ నేతలు ప్రయత్నిస్తే.. నేడు స్కూల్స్ అన్నింటినీ ఆదర్శంగా తీర్చిదిద్దుతు న్నాం. పేరెంట్స్ టీచర్ కమిటీలు ఏర్పాటు చేశాం. నాలెడ్జ్ స్టేట్‌గా ఏపీని మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గారు ప్రయత్నం చేస్తున్నారు. బీసీ హాస్టల్స్, రెసిడెన్షియల్స్, రెసిడెన్షియల్ స్కూల్స్‌గా, ఎస్సీ హాస్టల్స్‌ని భారతదేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం. బడుగు బలహీన వర్గాలకు ఇంటిగ్రేటెడ్ హాస్టల్స్ నిర్మాణం చేపట్టాం. రాష్ట్ర విద్యా రంగంలో జరుగుతున్న పురోగతిని నచ్చక కడుపు మంటతో ప్రభుత్వంపై నిందలేస్తున్నారు. మంచిని అడ్డుకోవాలని చూస్తే ప్రజలు ఎప్పటికీ క్షమించరనే విషయాన్ని వైసీపీ నేతలు గుర్తుంచు కోవాలని హెచ్చరించారు.

డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన రోజు నుండి సుమారు 300కి పైగా కేసులు వేశారు. వాటన్నింటినీ పరిష్క రించుకుని నియామకాలు పూర్తి చేశాం. పేకాట ఆడినోళ్లకు ఉద్యోగాలిచ్చారని పేర్ని నాని చెబుతు న్నాడు. బ్రిడ్జ్ గేమ్‌ను కేంద్ర ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా లో ఉంది. అందులో తప్పేముందో పేర్ని నాని



సమాధానం చెప్పాలి. ఆ కేటగిరీలో ఎవరికైనా ఉద్యోగాలిచ్చామా? పేర్ని నానికి ఛాలెంజ్ చేస్తున్నా.. ధైర్యముంటే వచ్చి నిరూపించు. నోరుంది కదా అని... ఏది పడితే అది వాగితే ప్రజలు తోలు వలిచేయడం తథ్యం. డీఎస్సీ గురించి రోజుకో మాట మాట్లాడు తున్న జగన్ రెడ్డి.. ఏపీపీఎస్సీలో జరిగిన అక్రమాలకు సమాధానం చెప్పాలి. వైసీపీ హయాంలో జరిగిన ఏపీపీఎస్సీలో అక్రమాలను కోర్టు ఆదేశాల మేరకు సిట్ నిగ్గుతేల్చింది. అక్రమాలు వాస్తవమని కూడా కోర్టుకు నివేదించింది. ఏపీపీఎస్సీ ప్రశ్నా పత్రాలను రిసార్టులో వేల్యేయేషన్ చేసినట్లు సిట్ పేర్కొంది.

యువత జీవితాలకు మార్గం చూపే ప్రశ్నా పత్రాలను రిసార్ట్‌లో వాల్యుయేషన్ వేపిస్తారా? ఏపీపీఎస్సీలో కోట్లాది రూపాయలు దండుకున్న దుర్మార్గుడు.. డీఎస్సీపై నిందలేయడం సిగ్గుచేటు. దాదాపు 630 ఓఎంఆర్ షీట్లు రిసార్టులో ఉంచినట్లు సిట్ నివేదికలో ప్రస్తావించింది. సెంట్రల్ ఫోరెన్సిక్ ల్యాబ్... 736 మంది అభ్యర్థుల పరీక్షా పత్రాలతో కూడినటువంటి ఫైల్‌ని... ఈ ల్యాబ్స్‌కు పంపించడం జరిగింది. ఇది జగన్ రెడ్డి చేసిన స్కాం కాదా? 97.55శాతం పత్రాల్లో అవకతవకలు జరిగినాయని సిట్ నివేదికలో పేర్కొనడం వాస్తవం కాదా? ఏపీపీఎస్సీలో చేయాల్సిన ఘోరాలన్నీ చేసి.. ట్రాన్స్ పరెంట్‌గా జరిగిన మెగా డిఎస్సీపై నిందలేస్తున్నారు. ఇప్పటికే అధికారులు డీఎస్సీ గురించి స్పష్టంగా చెప్పా రు. వైసీపీ ఆరోపణలన్నింటికీ సమాధానమిచ్చారు. ఇప్పటికీ మీకు అనుమానాలుంటే.. ఆధారాలతో రండి. విచారణ చేయిద్దాం. అంతేగానీ బురద జల్లేసి చేతులు కడుక్కుంటాం. గుడ్డకాల్చి మొహాన పడేద్దాం అనే ధోరణిలో వ్యవహరిస్తే ఉపేక్షించే పరిస్థితి లేదు.

కూటమి ప్రభుత్వం రెండున్నర సంవత్సరాల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారు. 16వ ఫైనాన్స్ కమిషన్ నిధులు సాధించుకోవడం కోసం స్థానిక ఎన్నికలు జరపాల్సిందే. ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించాం. ఈ వ్యవహారంపై కూడా వైసీపీ నేతలు కోర్టుకు వెళ్లారు. ఎన్నికలు జరపకుండా ఆపాలనే ప్రయత్నం చేశారు. జనాభా ప్రాతిపదికన డివిజన్ల పెంపు జరుగుతోంది. త్వరలోనే రిజర్వేషన్లు కూడా పూర్తి చేస్తాం. బీసీ రిజర్వేషన్ల విషయం కోర్టులో ఉంది. అది కూడా క్లియర్ అయిపోయిన తర్వాత ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తాం. మచిలీపట్నం మున్సిపాలిటీలో 60 డివిజన్ల ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. ప్రజల అభిప్రాయం మేరకు ప్రజల కోసం పాలిస్తున్నాం. అలాంటి ప్రజాస్వామ్య రాష్ట్రంలో వైసీపీలాంటి పార్టీ ఉండడం, జగన్‌రెడ్డి లాంటి దుర్మార్గులు ఉండడం మన దౌర్భాగ్యం. ప్రభుత్వ వ్యవహారాలపై ఎలాంటి అనుమానాలున్నా.. రైట్ టు ఇన్ఫర్మేషన్ యాక్ట్ ద్వారా ఏ ఇన్ఫర్మేషన్ కావాలన్నా తెచ్చుకోవచ్చు. ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడం మా బాధ్యత. ఆ మాటకు ఎప్పుడూ కట్టుబడి ఉంటాం. ఎక్కడైనా అవకతవకలు గుర్తిస్తే ఫిర్యాదు చేయాలి. అవసరమైతే కోర్టుకు వెళ్లి న్యాయపోరాటం చేయాలి. అంతేగానీ.. అబద్దాలు ప్రచారం చేస్తే మాత్రం ఎట్టి పరిస్థితుల్లో కూడా ప్రజలు క్షమించరనే విషయాన్ని జగన్ రెడ్డి అండ్ కో గుర్తుంచుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

---

# సమస్యల పరిష్కారమే లక్ష్యంగా..

**- ప్రజలతో మమేకమై.. సమస్యలను తెలుసుకున్న మంత్రి మండిపల్లి**



రాయచోటి (చైతన్య రథం): ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజాదర్బార్ నిర్వహించారు. రాయచోటి నియోజకవర్గం చిన్నమండెం మండలం బోరెడ్డిగారిపల్లెలోని తన నివాసంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ప్రజలను ఆత్మీయంగా కలుసుకున్న మంత్రి వారి సమస్యలను నేరుగా విని, ప్రతి వినతిని శ్రద్ధగా పరిశీలించారు. సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న ప్రజాదర్బార్‌కు మంచి స్పందన లభించింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట

- **కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 389 మందికి కారుణ్య నియామకాలు**
- **విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి**



విజయవాడ (చైతన్య రథం): విద్యుత్ శాఖలో ఉద్యోగులసంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ట్రాన్స్‌కో,జెన్‌కో,సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్, ఎస్పీడీసీఎల్ సంస్థల్లో ఇప్పటివరకు 389 మందికి కారుణ్య నియామకాలు కల్పించి నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా 28 మందికి కారుణ్య నియామక పత్రాలను మంత్రి స్వయంగా అందజేశారు.

అర్హులైన మరో 35నుంచి 45మందికి కటఆఫ్ తేదీ నిర్ణయించి, ప్రత్యేక కేసుల కింద ఉద్యోగాలు కల్పించాలని అధికారు లను మంత్రి ఆదేశించారు. మరణించిన ఉద్యోగుల పిల్లలు చిన్నవారైనా, వయస్సు వచ్చిన తర్వాతైనా,అర్హత మేరకు ఉద్యోగం పొందేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మని తెలిపారు. కారుణ్య నియామకాల కోసం అర్హులైన కుటుంబ సభ్యులు కార్యా లయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చర్యలుచేపట్టినట్లు వివరించారు. విద్యుత్‌శాఖలో నియామకాల ప్రక్రియను మరింత వేగవంతంచేస్తూ,అన్నివిభాగాలను కలిపి 659 అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుల భర్తీకి త్వరలో పరీక్షలునిర్వహించనున్నట్లు మంత్రి ప్రకటించారు. పరీక్షల అనంతరం సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తిచేసి, అభ్యర్థుల కు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పార దర్శకంగా నియామక ప్రక్రియ చేపడతా మని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఒక డీఎల్ పోస్టుకు బదులుగా రెండు డీఎల్ పోస్టులు ఇచ్చేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యంగా ఎల్‌సీటీ విభాగం పని చేస్తోందని, విశాఖపట్నంలో దాదాపు రూ.30 కోట్ల వ్యయంతో ప్రత్యేక శిక్షణ కేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్యుత్ శాఖ ఉద్యోగులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగైన శిక్షణ అందించేందుకు చర్యలు తీసుకుం టున్నామని చెప్పారు. ఉద్యోగుల సంక్షే మంతోపాటు గ్రామీణాభివృద్ధిపైనా ప్రభు త్వం దృష్టి సారించిందని మంత్రి తెలి పారు. గ్రామీణప్రాంతాల్లో సోలార్, విండ్, పీఎస్పీ ప్రాజెక్టులకు ప్రోత్సాహం అందిస్తు న్నట్లు వివరించారు. సూర్య ఘర్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన సుమారు 6 లక్షల కుటుంబాల ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆర్డీఎస్ఎస్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి రూ.10,000 కోట్లతో పనులు చేపడుతున్నట్లు వెల్లడిం చారు. ఉద్యోగ నియామకాలు, ఉద్యోగుల సంక్షేమం, శిక్షణ, గ్రీన్ ఎనర్జీ, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి ఈఅన్ని రంగా ల్లోనూ ప్రభుత్వం సమాంతరంగా ముందుకు సాగుతోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.

# ప్రతి దశలోనూ రోగి భద్రత

- ఎన్‌సీడీ ద్వారా వ్యాధుల గుర్తింపు.. 'సంజీవని'తో నిరంతర వైద్యం
- మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలకు ప్రాధాన్యం
- సెప్టెంబర్ 17న ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం
- ఆస్పత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు
- వైద్య విద్యా మంత్రి సత్యకుమార్ వెల్లడి



అమరావతి (చైతన్య రథం): రోగికి వైద్యం అందించడం ఎంత ముఖ్యమో, ఆ వైద్యం వల్ల ఎలాంటి హాని కలగకుండా చూడటం కూడా అంతే ముఖ్యమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. వ్యాధిని ముందుగానే గుర్తించడం, సకాలంలో చికిత్స అందించడం, మందులను సురక్షితంగా వినియోగించడం, చికిత్స అనంతరం రోగి ఆరోగ్యాన్ని పర్యవేక్షించడం ద్వారా రోగి భద్రతను బలోపేతం చేయాలన్నారు. ఎన్‌సీడీ 4.0లో ఇప్పటికే 2.83 కోట్ల మందికి పైగా పరీక్షలు నిర్వహించగా, 59.38 లక్షల మందిలో అధిక రక్తపోటు, 48.32 లక్షల మందిలో మధుమేహం గుర్తించినట్లు తెలిపారు. వ్యాధి గుర్తించిన వారికి సకాలంలో వైద్యం అందేలా 'సంజీవని' ద్వారా సేవలను అనుసంధానం చేస్తున్నామని చెప్పారు. సెప్టెంబర్ 17 ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా మంత్రి బుధవారం ప్రకటన విడుదల చేశారు.

### ముందస్తు పరీక్షలతో వ్యాధి గుర్తింపు

రక్తపోటు, మధుమేహంతో పాటు నోటి, రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులను తొలిదశలోనే గుర్తిస్తే చికిత్స సులభమవుతుందన్నారు. రాష్ట్రంలో 18 ఏళ్లు పైబడిన వారికి ఎన్‌సీడీ 4.0 ద్వారా విస్తృతంగా పరీక్షలు నిర్వహిస్తున్నామని మంత్రి తెలిపారు. క్యాన్సర్ పరీక్షల్లో అనుమానం ఉన్న వారిని తదుపరి పరీక్షలు, అవసరమైన చికిత్స కోసం పంపిస్తున్నామని చెప్పారు. వ్యాధి గుర్తించిన తర్వాత వైద్యం అందడంలో జాప్యం లేకుండా చూడాలని వైద్యులకు సూచించారు. అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

### 'సంజీవని'తో నిరంతర వైద్యం

పరీక్షల్లో వ్యాధి ఉన్నట్లు తేలిన తర్వాత రోగికి తదుపరి వైద్యం అందడంలో ఎలాంటి అంతరాయం ఉండకూడదన్నారు. 'సంజీవని' ద్వారా పరీక్షలు, చికిత్స, మందులు, తదుపరి పర్యవేక్షణ వంటి సేవలను అనుసంధానం చేస్తున్నామని మంత్రి తెలిపారు. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారు క్రమం తప్పకుండా వైద్యం పొందేలా సేవలను కొనసాగించాలని సూచించారు. ప్రతి రోగి ఆరోగ్య వివరాలను డిజిటలీకరణ చేస్తున్నామని తెలిపారు. సంజీవని ద్వారా రోగులకు ఆరోగ్య భద్రత మరింత పెరుగుతుందని చెప్పారు.

### మందుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ

రోగికి అవసరమైన మందులు సరైన మోతాదులో, సరైన సమయంలో అందడం చికిత్సలో కీలకమన్నారు. వైద్యుల సూచనల మేరకు మందులు తీసుకునేలా రోగులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. రోగులు తాము గతంలో తీసుకున్న చికిత్స, ప్రస్తుతం వాడుతున్న మందుల వివరాలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని, సొంతంగా మందుల మోతాదును మార్చడం లేదా నిలిపివేయడం చేయకూడదని తెలిపారు.

### రోగి, కుటుంబం భాగస్వామ్యం

రోగి భద్రతలో రోగి, కుటుంబ సభ్యుల భాగస్వామ్యం కూడా ముఖ్యమన్నారు. రోగులు తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు అండగా నిలవాలని తెలిపారు. మందులు సకాలంలో తీసుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం, వైద్యుల సూచనలు పాటించడంలో సహకరించాలని మంత్రి సూచించారు.

### ఆస్పత్రుల్లో భద్రతా ప్రమాణాల పరిశీలన

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగి భద్రతకు సంబంధించిన విధానాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. చికిత్స సమయంలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి వెంటనే సరిదిద్దాలని సూచించారు. రోగి వివరాల నమోదు, మందుల భద్రత, చికిత్స విధానాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. మంచి విధానాలను గుర్తించి అన్ని ఆస్పత్రుల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు.

### అవగాహన కార్యక్రమాలు

ప్రపంచ రోగి భద్రతా దినోత్సవం సందర్భంగా అన్ని జిల్లాలు, బోధనాస్పత్రుల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, నర్సులు, ఇతర ఆరోగ్య సిబ్బందికి రోగి భద్రత, మందుల భద్రత, సురక్షిత వైద్య విధానాలపై అవగాహన కల్పించాలని మంత్రి సత్యకుమార్ సూచించారు.

# జర్నలిస్టుల ప్రతిభకు రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలు

- 2025 ఉత్తమ జర్నలిస్టు అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం
- 12 విభాగాల్లో పురస్కారాలు
- రూ.2 లక్షలనుంచి రూ.లక్ష వరకు నగదు పురస్కారాలు
- దరఖాస్తులకు సెప్టెంబరు 28 గడువు
- రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు విశ్వనాథన్

విజయవాడ (చైతన్య రథం): జర్నలిజం రంగంలో విశేష సేవలందించిన పాత్రికేయులను గుర్తించి గౌరవించేందుకు 2025 సంవత్సరానికి 12 విభాగాల్లో ఉత్తమ జర్నలిస్టు అవార్డులు అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అర్హులైన జర్నలిస్టులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ సంచాలకులు కె.ఎస్.విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను 2026 సెప్టెంబరు 28 సాయంత్రం 5 గంటల్లోగా "డైరెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ, 2వ అంతస్తు, ఎన్టీఆర్ పరిపాలన భవనం, పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్, విజయవాడ -520013" చిరునామాకు పంపించాలన్నారు.

### కమిటీ విచక్షణతో ఎంపిక చేసే పురస్కారాలు

వి.ఆర్. నార్ల జీవిత సాఫల్య పురస్కారం

కొక్కు అహోబలరావు ఉత్తమ ఫోటో జర్నలిస్టు అవార్డు

మద్దూరి అన్నపూర్ణయ్య అవార్డు (చిన్న, మధ్యతరహా వార్తాపత్రికల సంపాదకులకు)

### దరఖాస్తుల ఆధారంగా ఎంపిక చేసే అవార్డులు

కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు ఉత్తమ జర్నలిస్టు అవార్డు -నగదు పురస్కారం రూ.2 లక్షలు. కనీసం 10 ఏళ్ల అనుభవం కలిగిన పూర్తికాలపు జర్నలిస్టులు అర్హులు. ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రచురితమయ్యే తెలుగు, ఆంగ్ల పత్రికలు/పీరియాడికల్స్ కోసం రాష్ట్రంలో లేదా వెలుపల పనిచేస్తున్న వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

### ఉత్తమ గ్రామీణ జర్నలిస్టు అవార్డులు (మూడు) ఒక్కొక్కటికి రూ.లక్ష

ఖాసా సుబ్బారావు అవార్డు, ముట్నూరి కృష్ణారావు అవార్డు, మద్దుకూరి చంద్రశేఖరరావు అవార్డు. కనీసం 3 ఏళ్ల గ్రామీణ రిపోర్టింగ్ అనుభవం ఉన్న దినపత్రికా జర్నలిస్టులు, అలాంటి అనుభవంగల మాజీ జర్నలిస్టులు అర్హులు.

సావిత్రిబాయి పూలే ఉత్తమ మహిళా జర్నలిస్టు అవార్డు. రూ.లక్ష పురస్కారం. తెలుగు, ఆంగ్ల పత్రికల్లో పనిచేస్తున్న మహిళా రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులు అర్హులు.

ఉత్తమ కార్టూనిస్టు అవార్డు, రూ.లక్ష పురస్కారం. కనీసం 10 ఏళ్ల అనుభవంగల దినపత్రికా కార్టూనిస్టులు అర్హులు.

అబుల్ కలాం ఆజాద్ ఉత్తమ ఉర్దూ జర్నలిస్టు అవార్డు, రూ.లక్ష పురస్కారం. కనీసం 10 ఏళ్ల అనుభవం గల ఉర్దూ జర్నలిస్టులు అర్హులు; ఉర్దూ జర్నలిజం సేవలు, గ్రామీణ సామాజిక-ఆర్థిక-రాజకీయ రిపోర్టింగ్ ప్రాతిపదికగా ఎంపిక జరుగుతుంది.

ఉత్తమ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు అవార్డు, రూ.లక్ష పురస్కారం. కనీసం 5 ఏళ్ల అనుభవంగల ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, దూరదర్శన్, రేడియో జర్నలిస్టులు అర్హులు.

ఉత్తమ వీడియో జర్నలిస్టు అవార్డు, రూ.లక్ష పురస్కారం.కనీసం 5ఏళ్ల అనుభవంగల ఎలక్ట్రానిక్ మీడియా వీడియో జర్నలిస్టులు అర్హులు.

### దరఖాస్తు విధానం, నిబంధనలు

జర్నలిస్టులు తమ సంస్థ, ఉద్యోగ వివరాలు, అర్హతలతో వ్యక్తిగతంగా దరఖాస్తు చేసుకోవాలి. 2025 క్యాలెండర్ సంవత్సరంలో ప్రచురితమైన / ప్రసారమైన కనీసం 5వ్యాసాలు, వార్తా కథనాలు, ఫొటోలు, కార్టూన్లు లేదా వీడియో క్లిప్పింగ్స్ జతచేయాలి (ఫోటోకాపీలు కూడా చెల్లుతాయి). ఎంపిక కమిటీ తుది నిర్ణయం అంతిమం; ఉత్తర ప్రత్యుత్తరాలు అనుమతించరు. ఏదైనా విభాగంలో తగిన ప్రమాణాలుగల దరఖాస్తులు అందకపోతే ఆ అవార్డును నిలిపివేసే అధికారం కమిటీకి ఉంటుంది. పూర్తి వివరాలను సమాచార పౌరసంబంధాల శాఖ మీడియా రిలేషన్స్ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

## 'సేవా సంకల్ప్ అభియాన'తో రాష్ట్రవ్యాప్తంగా వైద్య శిబిరాలు

- అక్టోబర్ 17 వరకు నిర్వహణ..
- కేంద్ర, రాష్ట్ర ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలి
- అధికారులకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు



అమరావతి (చైతన్య రథం): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని 'సేవా సంకల్ప్ అభియాన'లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా గురువారం నుంచి అక్టోబర్ 17వరకు నెల రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహించనున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా జరిగే ఈ శిబిరాల్లో ప్రజలకు అవసరమైన వైద్య సేవలు అందించడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలపై అవగాహన కల్పించనున్నారు. 'వికసిత్ భారత్-స్వర్ణ ఆంధ్రప్రదేశ్-2047' లక్ష్యాలకు అనుగుణంగా ఈ కార్యక్రమాలను చేపడుతున్నామని భాజపా జాతీయ నాయకుడు, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వైద్య శిబిరాలను నిర్వహించి, అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్సతో పాటు ఆరోగ్య పథకాల వివరాలను ప్రజలకు తెలియజేయనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. పార్టీ అధిష్ఠానం ఆదేశాల మేరకు దక్షిణాదిన జరిగే సేవా సంకల్ప అభియాన్ కార్యకలాపాలను భాజపా తరపున మంత్రి సత్యకుమార్ పర్యవేక్షిస్తున్నారు. శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ప్రణాళిక, సమన్వయం, అమలు, పర్యవేక్షణ బాధ్యతలతో పాటు జిల్లా వారీగా శిబిరాల తేదీలు, ప్రాంతాలు, అందించాల్సిన సేవలను ఈ కమిటీ ఖరారు చేయనుంది. హాజరయ్యే వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ, అందించిన సేవలను కమిటీ పర్యవేక్షించనుంది. శిబిరాలు పూర్తయిన అనంతరం జిల్లాల వారీగా లబ్ధిదారుల వివరాలతో సమగ్ర నివేదిక రూపొందించనున్నారు. కమిటీకి బి.వి.సతీష్‌కుమార్ (సంయుక్త సంచాలకులు) సమన్వయ అధికారిగా వ్యవహరించనుండగా, కె.శ్యామల, టి.రమేష్, జె.నరసింహానాయక్, వి.వి.బి. సుబ్రహ్మణ్యం సభ్యులుగా ఉంటారు. "ప్రజలకు అవసరమైన వైద్య సేవలను మరింత చేరువ చేయాలి. ప్రతి జిల్లాలో అధికారులు సమన్వయంతో పనిచేసి శిబిరాలను విజయవంతం చేయాలి. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రయోజనం అందేలా చూడాలి" అని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శిబిరాల నిర్వహణపై కమిషనర్ చక్రధర్‌బాబు బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. వైద్య సేవల అందజేత, అవగాహన కల్పన, ముందస్తు ప్రచారం, ప్రజలను సమీకరించడం వంటి అంశాలపై దిశానిర్దేశం చేశారు. శిబిరాలకు వచ్చే ప్రతి ఒక్కరికీ అవసరమైన పరీక్షలు నిర్వహించి, వ్యాధి గుర్తించిన వారికి తదుపరి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 104 సంచార వైద్య వాహనాల ద్వారా గ్రామాల్లో జరిగే పరీక్షలతో అనుసంధానం జరగాలని స్పష్టం చేశారు. వైద్య శిబిరాల నిర్వహణపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించారని, పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని చక్రధర్‌బాబు తెలిపారు.

## డబ్ల్యుజీఎం టైటిల్‌కు అర్హత సాధించిన సహితి వర్షిణికి శాప్‌చైర్మన్ అభినందన



విజయవాడ (చైతన్య రథం): సెర్బియాలో జరిగిన IM VII రౌండ్ రాబిన్ చెస్ టోర్నమెంట్‌లో మూడో, చివరి డబ్ల్యుజీఎం నార్మ్ సాధించి, 19 ఏళ్ల వయసులోనే వుమెన్ గ్రాండ్‌మాస్టర్ టైటిల్‌కు అవసరమైన అన్ని అర్హతలు పూర్తి చేసిన సహితి వర్షిణిని శాప్ చైర్మన్ రవి నాయుడు అభినందించారు. అంతర్జాతీయ చెస్ వేదికపై ఆంధ్రప్రదేశ్ ప్రతిభను చాటిన సహితి వర్షిణి విజయం రాష్ట్ర చెస్ చరిత్రలో మరో మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి, దేశానికి గర్వకారణంగా నిలవాలని ఆకాంక్షించారు.

# హజ్ యాత్రికులకు వైద్య పరీక్షల గడువు పెంపు

- ఈ నెల 30 వరకు పొడిగింపు
- మైనారిటీ, న్యాయ మంత్రి ఫరూక్ వెల్లడి



అమరావతి (చైతన్య రథం): హజ్-2027 యాత్రకు ఎంపికైన యాత్రికులకు వైద్య పరీక్షలు నిర్వహించి, సంబంధిత ధ్రువీకరణ పత్రాలను సమర్పించేందుకు గడువును 30వరకు పొడిగించినట్టు రాష్ట్ర మైనారిటీ సంక్షేమ, న్యాయ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. హజ్ కమిటీ ఆఫ్ ఇండియా జారీ చేసిన సర్క్యులర్ నం.13 ప్రకారం హజ్ యాత్రకు తాత్కాలికంగా ఎంపికైన యాత్రికులు తప్పనిసరిగా ప్రభుత్వ వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ అల్లోపతిక్ వైద్యాధికారి ద్వారా నిర్దేశిత వైద్య పరీక్షలు చేయించుకుని, ప్రాథమిక వైద్య పరీక్ష, శారీరక దృఢత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్ పొందాలని బుధవారం అమరావతిలో విడుదల చేసిన ప్రకటనలో ఫరూక్ పేర్కొన్నారు. ఇప్పటివరకు వైద్య పరీక్షలను పూర్తి చేయని యాత్రికులు పొడిగించిన గడువులోగా వైద్య పరీక్షలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఎన్ఆర్ఐ యాత్రికులు తమ ప్రస్తుత నివాస దేశంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేయించుకోవచ్చన్నారు. వైద్య పరీక్షలు పూర్తయిన అనంతరం ప్రాథమిక వైద్య పరీక్ష, శారీరక దృఢత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్‌తోపాటు ఆన్‌లైన్‌లో చెల్లింపు మొత్తానికి సంబంధించిన రసీదును అక్టోబర్ 1లోపు హజ్ కమిటీ ఆఫ్ ఇండియా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇవే రసీదులను, ధ్రువపత్రాలను రాష్ట్ర హజ్ కమిటీలకు సమర్పించడం తప్పనిసరి అని మంత్రి పేర్కొన్నారు. యాత్రికులు తమ ఒరిజినల్ ప్రాథమిక వైద్య పరీక్ష, శారీరక దృఢత్వ ధ్రువీకరణ సర్టిఫికెట్, సంబంధిత వైద్య పరీక్షల నివేదికలను భద్రంగా ఉంచుకోవాలని మంత్రి తెలిపారు. హజ్ యాత్రకు ముందు జరిగే స్టేజ్-2 వైద్య పరీక్షలు, వ్యాక్సినేషన్ సమయంలో వాటిని సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. హజ్-2027 యాత్రికులకు అవసరమైన వైద్య పరీక్షలు సకాలంలో పూర్తయ్యేలా సంబంధిత అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా హజ్ సొసైటీ, రాష్ట్ర హజ్ కమిటీలు సమన్వయంతో పూర్తి చేయాలని మంత్రి ఫరూక్ ఆదేశించారు.

## వైసీపీ భూఆక్రమణలు, రెవెన్యూ అన్యాయాలపై
# గ్రీవెన్స్‌లో వెల్లువెత్తిన ఫిర్యాదులు

- మూడు తరాలనాటి భూమికి రాజకీయ గ్రహణం
- రికార్డుల ఫోర్జరీ, తప్పుడు నోటీసులు, పరిహారంలో కోత.. బాధితుల ఆవేదన
- అర్జీలు స్వీకరించి సమస్యల పరిష్కారానికి కృషి చేసిన ఏపీఐడీసీ చైర్మన్ దేగల



మంగళగిరి (చైతన్య రథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన బాధితులు భూఆక్రమణలు, రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం, పరిహారంలో అన్యాయంపై పెద్ద సంఖ్యలో అర్జీలు సమర్పించారు. ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ దేగల ప్రభాకర్ అర్జీలను స్వీకరించి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. అనకాపల్లి జిల్లా నర్సీపట్నానికి చెందిన కోట ప్రసాద్ అర్జీని సమర్పిస్తూ.. గొలుగొండ మండలంలోని తన వ్యవసాయ భూమిలో కొంత భాగాన్ని ఇరుగుపొరుగు వారు అక్రమంగా కలిపేసుకున్నారని ఫిర్యాదు చేశారు. 2023లో రీ-సర్వే నెపంతో రెవెన్యూ అధికారులను ప్రలోభపెట్టి, అధికారిక సంతకం లేకుండానే రికార్డులను ఫోర్జరీ చేసి తమ పేర్లతో నమోదు చేయించుకున్నారని, పొలానికి వెళ్లే ఉమ్మడి బాటను కూడా సొంతం చేసుకున్నారని ఆవేదన వెళ్లగక్కారు. పల్నాడు జిల్లా గురజాల మండలం పల్లెగుంతకు చెందిన పి లింగమ్మ.. తమ కుటుంబం 80 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వారసత్వ భూమికి సంబంధించి పూర్తి చట్టబద్ధమైన పత్రాలు స్పష్టిటికీ, తహసీల్దార్ రాజకీయ ఒత్తిళ్లకు లొంగి ముందస్తు నోటీసులు ఇవ్వకుండానే ఆన్‌లైన్ రికార్డుల నుంచి తమ భూమి వివరాలను ఏకపక్షంగా తొలగించారని ఫిర్యాదు చేస్తూ అర్జీని ఇచ్చారు.

తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురానికి చెందిన చింతా డేవిడ్ రాజారత్నం 1950 నుంచి తమ కుటుంబం స్వాధీనంలో ఉన్న ఆస్తులపై యాజమాన్య హక్కులు లేవంటూ జిల్లా కలెక్టరేట్ నోటీసులు జారీ చేశారని, సర్వేయర్,రెవెన్యూ, పంచాయతీ అధికారుల నివేదికలు తమకు అనుకూలంగా ఉన్నా కలెక్టరేట్ అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. తనపై కక్షపూరితంగా తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపారని, ఈ వేధింపుల వల్ల కుటుంబం ఆర్థికంగా, మానసికంగా నష్టపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.



పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం కంభంపాడుకు చెందిన బోడపాటి చంద్రమౌళి తమ భార్య పేరిట గతంలో నమోదైన భూమి, ఇటీవలి రీ-సర్వేలో తక్కువ విస్తీర్ణంతో నమోదు కావడంతో 21 సెంట్ల భూమి రికార్డుల్లో తగ్గిపోయిందని, తప్పిదాన్ని సరిదిద్దాలని పలుమార్లు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు.

ఎన్టీఆర్ జిల్లా విజయవాడకు చెందిన జయదుర్గాబాయి తమకుటుంబం నాలుగు దశాబ్దాలుగా నిర్వహిస్తున్న ఆలయాన్ని హస్తగతం చేసుకోవాలని కొందరు బంధువులు గొడవలు చేస్తూ వేధింపులకు, దాడులకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. దివ్యాంగురాలైన తాను, వృద్ధురాలైన తల్లిని బెదిరించి ఆలయం నుంచి గెంటివేసేందుకు యత్నిస్తున్నారని, పలుమార్లు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని ఆవేదన వెలిబుచ్చారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడికి చెందిన గీత.. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తమ నివాస గృహాలు తొలగింపునకు గురైనా, పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ అడిగినంత కమిషన్ ఇవ్వలేదన్న కారణంతో తమకు ఇతరులతో పోలిస్తే 30-40శాతం తక్కువ పరిహారం ఇచ్చి అన్యాయం చేశారని ఆరోపించారు.

వీటితో పాటు పింఛన్లు, రేషన్, ఇళ్ల నిర్మాణ సమస్యలపై పలువురు అర్జీలు ఇవ్వగా, మరికొందరు ఉద్యోగాల కోసం రెజ్యూమ్‌లు అందజేశారు. అనారోగ్య సమస్యలతో ఆర్థిక తోడ్పాటు కోరుతూ కొందరు విజ్ఞప్తులు సమర్పించారు. సమస్యలను సావధానంగా విన్న ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని అర్జీలు సమర్పించిన బాధితులకు హామీ ఇచ్చారు.

## పెరదేపిలో టీడీపీలో చేరిన
# 40 బీసీ, ఎస్సీ కుటుంబాలు

**మంత్రి డిఎస్‌బివి స్వామి సమక్షంలో చేరిక**



కొండపి (చైతన్య రథం): ప్రకాశం జిల్లా కొండపి మండలం పెరదేపిలో ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన 40 కుటుంబాలు మంత్రి డోలా శ్రీ బాల వీరాంజ నేయస్వామి సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి పసుపు కండువాలు వేసి మంత్రి స్వామి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని నమ్మి ఇతర పార్టీల శ్రేణులు టీడీపీలో చేరుతున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలిచింది ఎప్పుడూ తెలుగుదేశమేనని, వైసీపీ హయాంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై నిత్యం దాడులు, దౌర్జన్యాలు, మారణ హోమాలేనని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల్లో పేదరికాన్ని రూపుమాపి వారిని ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు కృషి చేస్తున్నారని మంత్రి తెలిపారు. కొత్తగా పార్టీలోకి వచ్చిన వారు సీనియర్లను గౌరవిస్తూ పని చేయాలన్నారు. కొండపి నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ హయాంలోనేనని అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పని చేస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి పేర్కొన్నారు.

# 19నుంచి ఉమెన్ ఏపీఎల్

**ఏసీఏ అధ్యక్షుడు, ఎంపీ శివనాథ్ వెల్లడి**



విజయవాడ (చైతన్య రథం): ఆంధ్ర ప్రీమియర్ లీగ్ తరహాలోనే ఉమెన్ ఏపీఎల్ పోటీలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్టు విజయవాడ ఎంపీ, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని) వెల్లడించారు. ఈనెల 19నుంచి 27 వరకు మంగళగిరి స్టేడియంలో ఉమెన్ ఏపీఎల్ పోటీలు జరగనున్నాయని చెప్పారు. మొత్తం నాలుగు టీములు పాల్గొనే ఈ టోర్నమెంటును... డే అండ్ నైట్ విధానంలో నిర్వహించనున్నట్టు చెప్పారు. విజయవాడ ఏసీఏ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేశినేని శివనాథ్ మాట్లాడుతూ... ఉమెన్ ఏపీఎల్ ప్రారంభోత్సవానికి నారా బ్రాహ్మణి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని చెప్పారు. ప్రేక్షకులు ఉచితంగా మ్యాచ్‌లు వీక్షించేందుకు ఏర్పాట్లు చేశామని, విజయవాడ నుంచి విద్యార్థులను తీసుకువెళ్లేందుకు బస్సులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఉమెన్ ఏపీఎల్ ద్వారా మహిళా సాధికారతను ఘనంగా చాటబోతున్నామని చెప్పారు. ఈ సీజన్‌లో మంగళగిరి స్టేడియంలో మాత్రమే మ్యాచ్‌లు జరుగుతాయని, వచ్చే సీజన్ నుంచి విశాఖ, కడపలోనూ ఉమెన్ ఏపీఎల్ మ్యాచ్‌లు నిర్వహించబోతున్నామని చెప్పారు.

# వైభవంగా దేవదేవుడి హంసవాహన సేవ



తిరుమల (చైతన్య రథం): శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన బుధవారం రాత్రి శ్రీమలయప్ప స్వామి వారు సరస్వతి అమ్మవారి అలంకారంలో వీణను ధరించి హంస వాహనంపై తిరుమాడ వీధుల్లో విహరిస్తూ భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. జ్ఞానానికి ప్రతీకగా భావించే హంసవాహనంపై శ్రీవారి అలంకారం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. వాహనసేవ సందర్భంగా తిరుమాడ వీధులు భక్తజన సందోహంతో కిక్కిరిశాయి. మంగళవాయిద్యాల నడుమ, వేదఘోషలు, భక్తుల గోవింద నామస్మరణతో తిరుమల గిరులు మార్మోగాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాబృందాలు ప్రదర్శించిన సంప్రదాయ కళారూపాలు వాహన సేవకు మరింత శోభను చేకూర్చి భక్తులను విశేషంగా అలరించాయి.

## ఏపీపీఎస్సీపై సిట్ రిపోర్టు గురించి

# మాట్లాడే దమ్ముందా..?

- జగన్‌కు ప్రతిపక్ష హోదా లేదు.. నాయకత్వం, క్యాడరూ లేవు
- అద్దె మనుషులతో పబ్బం గడుపుతున్న దుస్థితి..
- ఆధారాలు లేకుండా డీఎస్సీపై బురదజల్లడమే ఆయన పని
- గ్రూప్-1 కుంభకోణానికి ఏం సమాధానం చెప్తారు?
- సొంత మీడియా తప్పుడు ప్రచారాన్ని ప్రజలు పట్టించుకోరు
- జగన్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు ధ్వజం



మంగళగిరి (చైతన్య రథం): తెలుగులో పెద్దలు ఊరికే అనలేదు.. 'కుక్కతోక వంకర' అని, 'గురివింద తనకింద నలుపు ఎరగదు' అని. ఎదుటివారివైపు ఒక వేలు చూపిస్తే.. మిగిలిన నాలుగు వేళ్ళు మనవైపే చూపిస్తాయన్న విషయం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌రెడ్డికి తెలుసుకోవాలి అని మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్‌బాబు వ్యాఖ్యానించారు. అధికారం కోల్పోయి, కనీసం ప్రతిపక్ష హోదా కూడా దక్కని పరిస్థితికి వచ్చినా జగన్‌రెడ్డి తీరు మారలేదని దుయ్యబట్టారు. పార్టీకి సరైన నాయకత్వం లేక, బలమైన క్యాడర్ లేక అద్దె మనుషులతో హడావుడి చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వైసీపీని ఎద్దేవా చేశారు. ఎన్నికల్లో ప్రజలు 11 సీట్లకే పరిమితం చేసినా.. జగన్‌రెడ్డిలో మాత్రం ఆత్మపరిశీలన కనిపించడం లేదన్నారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జగన్‌రెడ్డికి ఇప్పుడు మిగిలిన ఏకైక బలం సొంత మీడియానేనని విమర్శించారు. ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా మాట్లాడటం, ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గుర్తించడం పక్కనపెట్టి.. తెలుగుదేశం ప్రభుత్వంపై ఏదోక విధంగా బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ప్రజలు ఉదయాన్నే లేచి యోగా, వాకింగ్ చేస్తుంటే.. జగన్‌రెడ్డి మాత్రం ఉదయం 11 గంటలకో, 12 గంటలకో లేచి తెలుగుదేశం ప్రభుత్వంపై ఏం మాట్లాడాలి? ఎలా విమర్శించాలి? అనే ఆలోచనతో రోజును ప్రారంభిస్తున్నారని ఎద్దేవా చేశారు.

### డీఎస్సీపై ఆరోపణలకు ఆధారాలేవీ?

16,000కు పైగా ఉపాధ్యాయ పోస్టులను పూర్తి పారదర్శకంగా భర్తీ చేశామని, స్పోర్ట్స్ కోటా ఆరోపణలకు ఆధారాలు చూపాలని అశోక్ బాబు సవాల్ విసిరారు. నోటిఫికేషన్ దశ నుంచి 260-280 రిట్ పిటిషన్లు వేయించినా కోర్టు అన్నింటినీ కొట్టివేసిందని, అభ్యర్థులు విధుల్లో చేరిన ఏడాది తర్వాత ప్రజా సమస్యలను దారి మళ్లించేందుకే ఈ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఎంపికైన అభ్యర్థులే స్వచ్ఛందంగా రోడ్లపైకి వచ్చి ప్రచారాన్ని తిప్పికొట్టిన విషయాన్ని అశోక్‌బాబు గుర్తు చేశారు.

### గ్రూప్-1 కుంభకోణం: సిట్ నివేదికలో వెల్లడైన వాస్తవాలు

జగన్ ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 నియామకాల్లో జరిగిన అక్రమాలు దేశ పరిపాలనా చరిత్రలోనే అత్యంత దారుణమైనవని అశోక్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా, కమిషన్ సభ్యుల అనుమతి లేకుండా డిజిటల్ మూల్యాంకనం చేపట్టడాన్ని హైకోర్టు తప్పుపట్టి మాన్యువల్‌గా చేయాలని ఆదేశించింది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఆన్సర్ షీట్లను ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి ప్రైవేట్ రిసార్ట్ 'హాయ్‌లాండ్'కు తరలించి 84 రోజులపాటు అక్కడే ఉంచారు. మూల్యాంకనం కోసం ఎంపిక చేసిన 150 మంది నిపుణుల్లో 70-75 మంది మాత్రమే హాజరవగా, మిగిలిన పేపర్లను ఎలక్ట్రీషియన్లు, టైపిస్టులు, కంప్యూటర్ ఆపరేటర్లతో దిద్దించి మార్కులు వేయించారని సిట్ నివేదిక వెల్లడించింది. పేపర్లను వైట్నర్‌తో ట్యాంపరింగ్ చేయడం, ఓఎంఆర్ డీకోడింగ్‌లో మిస్‌మ్యాచ్‌లు ఉన్నా తమకు కావాల్సిన వారికి ఇష్టానుసారం మార్కులు వేయడం జరిగిందని అశోక్‌బాబు ఆరోపించారు.

ఇంటర్వ్యూ దశలోనూ అవకతవకలు జరిగాయని, రాతపరీక్షలో అత్యధిక మార్కులు (446) సాధించిన అభ్యర్థికి ఇంటర్వ్యూలో కేవలం 42 మార్కులు వేసి తొలగించగా, రాతపరీక్షలో 402 మార్కులు మాత్రమే వచ్చిన తమ వర్గం అభ్యర్థికి 75కుగాను 73 మార్కులు కట్టబెట్టి ఎంపిక చేశారని అశోక్‌బాబు వివరించారు. అప్పటి సెక్రటరీ పీఎస్సార్ ఆంజనేయులు కనుసన్నల్లో 164 మందిని అడ్డగోలుగా ఎంపిక చేశారని, ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని వారిని కీలక బాధ్యతలకు దూరంగా 'నాన్-ఫోకల్' పోస్టుల్లోనే ఉంచాలని ఆదేశించిందని పేర్కొన్నారు.

### జగన్‌కు రెండు ప్రశ్నలు

కోర్టుల చుట్టూ తిరుగుతూ ఏళ్లుగా బెయిల్‌పై కాలం గడుపుతున్న జగన్, ఇతరులపై మాట్లాడటం హాస్యాస్పదమని అశోక్ బాబు విమర్శించారు. సిట్ నివేదికపై అసెంబ్లీలో చర్చ జరిగినా, సొంత పార్టీ నేతలే ఈ అక్రమాలపై విస్మయం వ్యక్తం చేస్తున్నారని గుర్తుచేశారు. అవకతవకలు రుజువైన గ్రూప్-1 నియామకాలను రద్దు చేయాలా వద్దా అనే దానిపై జగన్ సమాధానం చెప్పాలని, ఇది కేవలం 164 పోస్టుల సమస్య కాదని, 60-70 వేలమంది యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశమన్నారు. సిట్ నివేదిక కోర్టు పరిశీలనలో ఉందని, న్యాయస్థానం ఏ నిర్ణయం తీసుకున్నా బాధితుల పక్షాన కూటమి ప్రభుత్వం నిలుస్తుందని అశోక్‌బాబు హామీ ఇచ్చారు. అలాగే, గత ప్రభుత్వం గాలికొదిలేసిన 6,000 కానిస్టేబుల్ పోస్టుల భర్తీని పూర్తి చేసి స్టైఫండ్ పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని, ఐదేళ్ల వైసీపీ పాలనలో మెడికల్ మినహా ఇతర పీఎస్సీ ఉద్యోగాలు ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగాల క్యాలెండర్ ప్రకటించి వేగంగా నియామకాలు చేపడుతోందని తెలిపారు. అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు కాబట్టే ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని, ఇప్పటికైనా ఆధారాల్లేని ఆరోపణలు, డైవర్షన్ రాజకీయాలు మానుకోవాలని జగన్ రెడ్డికి అశోక్‌బాబు హితవు పలికారు.

# డీఎస్సీపై నిందలు.. డైవర్షన్ పాలిటిక్స్

## జగన్‌రెడ్డిపై విరుచుకుపడిన టీడీపీ అధికార ప్రతినిధి దాసరి

మంగళగిరి (చైతన్య రథం): గత కొద్ది రోజులుగా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గంటల తరబడి మీడియా సమావేశాలు పెట్టి మెగా డీఎస్సీపై నిరాధార ఆరోపణలతో నిరుద్యోగులను అయోమయానికి గురిచేసే ప్రయత్నం చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి దాసరి శ్యామ్ చంద్రశేషు తీవ్రంగా మండిపడ్డారు. బుధవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కేవలం హామీలు ఇచ్చేది కాదని, నిరుద్యోగ యువత చేతుల్లో నియామక పత్రాలు పెట్టి వారి భవిష్యత్తు తీర్చిదిద్దే ప్రభుత్వమని ఈ వాస్తవాన్ని జగన్ ఇప్పటికైనా గుర్తించాలన్నారు. గతంలో ఇచ్చిన 2.32 లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దు, మద్యపాన నిషేధం వంటి హామీలు తుంగలో తొక్కినందుకే ప్రజలు వైసీపీని 151నుంచి 11 సీట్లకు పరిమితం చేసి, ప్రతిపక్ష హోదా కూడా లేకుండా చేశారని గుర్తుచేశారు. నరేంద్ర మోదీ సుపరిపాలన, చంద్రబాబు అనుభవం, పవన్ కళ్యాణ్ పోరాట పటిమ, నారా లోకేష్ 'యువగళం' పాదయాత్ర ద్వారా వచ్చిన చైతన్యంతో ప్రజలు కూటమిని 164 స్థానాల్లో గెలిపించారని పేర్కొన్నారు.

### పారదర్శక డీఎస్సీపై 323 కేసులు వేసినా ఆధారాల్లేవు

చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తూనే మొదటి సంతకం మెగా డీఎస్సీ ఫైలుపై చేశారని, నారా లోకేష్ పర్యవేక్షణలో 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను ఎలాంటి అవకతవక లేకుండా పారదర్శకంగా భర్తీ చేశారని దాసరి తెలిపారు. నోటిఫికేషన్ నుంచి నియామక పత్రాల వరకు దాదాపు 323 కేసులు వేసినా ఏ కోర్టు కూడా నియామక ప్రక్రియలో లోపాలున్నాయని చెప్పలేదని, ప్రాథమిక ఆధారాలు కూడా లేవని కొట్టిపారేశాయని గుర్తుచేశారు. ఆధారాలు ఉంటే కోర్టుకు సమర్పించాలి తప్ప మీడియా ముందు గంటల తరబడి అసత్య ప్రచారం చేయడం సిగ్గుచేటని, నిరుద్యోగుల జీవితాలతో రాజకీయం చేయడం ఆపాలని హెచ్చరించారు. డీఎస్సీపై బహిరంగ చర్చకు మంత్రి నారా లోకేష్‌తో పాటు టీడీపీ ప్రజాప్రతినిధులు సవాల్ విసిరినా తోకముడిచి పారిపోయిన జగన్, అసెంబ్లీకి కూడా రాకుండా మీడియా సమావేశాల్లో మాత్రమే మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు.

### ఏపీపీఎస్సీ స్కామ్: 97.55శాతం ఓఎంఆర్ షీట్లలో అవకతవకలు

వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీలో జరిగిన చారిత్రాత్మక కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే జగన్ డీఎస్సీపై డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దాసరి ఆరోపించారు. సిట్ దర్యాప్తులో 736 మంది అభ్యర్థుల ఓఎంఆర్ షీట్లను 7 సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు పంపగా, 718 షీట్లలో (97.55శాతం) మార్పులు జరిగినట్లు తేలిందని, ఉద్యోగాలు పొందిన 165 మందిలో 160 మంది ఓఎంఆర్ షీట్లు మార్చి పోస్టులు దక్కించుకున్నారని వివరించారు. ఉద్యోగాలు రాని 161 మంది షీట్లలో కూడా 153లో తేడాలు కనిపించాయని, రిట్ పిటిషన్లు వేసిన 408 మందిలో 405 మంది (99.62శాతం) పత్రాల్లో భారీ మార్పులు జరిగినట్లు సిట్ నిగ్గు తేల్చిందని పేర్కొన్నారు. ఈ పాపాలు బయటపడితే మిగిలిన 11 సీట్లు కూడా ఊడిపోతాయన్న భయంతోనే డీఎస్సీపై బురదజల్లే యత్నం చేస్తున్నారని, 98శాతం అవకతవకలు



జరిగిన ఏపీపీఎస్సీ స్కామ్‌పై సీబీఐ విచారణ కోరే దమ్ముందా? అని జగన్‌ను నిలదీశారు.

### 'దొంగే దొంగ దొంగ అని అరిచినట్టుంది' జగన్ తీరు

జగన్ మాట్లాడే మాటలు ఎప్పటికీ నిజాలు కావని, ఆయన నిజస్వరూపం రాష్ట్ర ప్రజలందరికీ తెలుసని దాసరి ధ్వజమెత్తారు. ఇంట్లో చొరబడి దొరికిపోగానే ఊరి జనంలో కలిసిపోయి 'దొంగ.. దొంగ..' అని కేకలు పెట్టిన జిత్తులమారి దొంగలా జగన్ వ్యవహరిస్తున్నారని, 16 నెలలు జైలు జీవితం గడిపిన వ్యక్తి ఎదుటివారిని దొంగ అనడం హాస్యాస్పదమని అన్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీలకు కట్టుబడి నారా లోకేష్ రాష్ట్ర ప్రగతి కోసం శ్రమిస్తున్నారని, కూటమి హయాంలో ఇప్పటికే 8 లక్షల మందికి పైగా యువతకు నియామక పత్రాలు అందించామని, గూగుల్ డేటా సెంటర్‌తో సహా దిగ్గజ కంపెనీల నుంచి దాదాపు 23 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. భోగాపురం విమానాశ్రయం, పోలవరం ఎడమ కాలువ, వెలిగొండ ప్రాజెక్టు వంటి పనుల ఘనతను తానే చేశానంటూ జగన్ 'క్రెడిట్ చోరీ'కి దిగుతున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు కనిపించకుండా పరదాలు కావాలనుకున్న జగన్, అధికారం కోల్పోయాక రాజకీయ లబ్ధి కోసం శవాలు కావాలనుకుంటున్నారని, ఇదే తీరు కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 11 సీట్లు కూడా దక్కక పార్టీ శాశ్వతంగా తుడిచిపెట్టుకుపోతుందని హెచ్చరించారు.

### కాకి నెమలి కాలేదు.. జగన్ ఎప్పటికీ చంద్రబాబు కాలేరు

కూటమి ప్రభుత్వ అభివృద్ధిని, చంద్రబాబు ఘనతను సొంత ఖాతాలో వేసుకోవాలని చూస్తున్న జగన్ 'క్రెడిట్ చోరీ' రాజకీయాలపై దాసరి తీవ్రంగా స్పందించారు. తానే నెమలినంటూ పక్షులను నమ్మించిన కాకి, వర్షం పడి అసలైన నెమలి పురివిప్పి నాట్యం చేయగానే నల్లగా మాసిపోయి మూలకు చేరిన కథను ఉటంకిస్తూ, జగన్ పరిస్థితి కూడా అలాగే ఉందని వ్యాఖ్యానించారు. నిజమైన నెమలిలా అభివృద్ధిని పురివిప్పించే నాయకుడు చంద్రబాబు అని, ఆయన చేసిన అభివృద్ధిని ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని పేర్కొన్నారు. జగన్ చేసిన అవినీతి బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని, త్వరలోనే ఆయన రాజకీయ తెరపై కాకుండా జైల్లో ఉండాల్సిన పరిస్థితి వస్తుందని, ప్రజల ఆదరణతో కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని దాసరి స్పష్టం చేశారు.

# ఎన్టీఆర్ పోరాటంతో ప్రజాస్వామ్యానికి పునర్జన్మ

- 1984 ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమం చరిత్రలో సువర్ణాధ్యాయం
- ఆనాటి సంక్షోభాన్ని గుర్తు చేసుకున్న ప్రతిభాభారతి, మోత్కుపల్లి, రామకృష్ణ
- 1984 ఉద్యమంలో చంద్రబాబు కీలక పాత్ర: టీడీ జనార్దన్
- ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య పరిరక్షణ దినోత్సవం



విజయవాడ (చైతన్య రథం): 1984 ఆగస్టు 16న నాటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రామ్‌లాల్, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక పద్ధతులతో ముఖ్యమంత్రి పదవిని కోల్పోయి.. నెల రోజుల వ్యవధిలో దేశంలోని ప్రధాన కాంగ్రెసేతర పార్టీలన్నింటినీ కూడగట్టి మహోద్యమ రీతిలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమాన్ని నిర్వహించి సెప్టెంబర్ 16, 1984న తిరిగి అధికారాన్ని అధిష్టించిన తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారక రామారావు సృష్టించిన చరిత్రను ఆనాటి నుండి ప్రజాస్వామ్య పరిరక్షణ దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ అధ్యక్షులు టీడీ జనార్దన్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 16న ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ కార్యాలయంలో ప్రజాస్వామ్య పరిరక్షణ దినోత్సవ వేడుక ఘనంగా జరిగింది. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా నందమూరి రామకృష్ణ, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మాజీ స్పీకర్ ప్రతిభాభారతి, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు, ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. తొలుత ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్, విశిష్ట అతిథులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి, అసెంబ్లీ మాజీ స్పీకర్ ప్రతిభాభారతి.. ఎన్టీ రామారావు స్థాపించిన తెలుగుదేశం పార్టీతో తాను చేసిన సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. చిన్న వయసులోనే 1983లో తనకు పార్టీ టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించి మంత్రిని చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. 1984 ఆగస్టులో నాదెండ్ల భాస్కరరావు, గవర్నర్ రామ్‌లాల్, ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కుట్రపన్ని ఎన్టీఆర్‌ను పదవీచ్యుతిని చేసినప్పుడు తామందరం అన్నకు అండగా నిలబడ్డామన్నారు. ఆ నెల రోజులలో జరిగిన చేదు సంఘటనలు దేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు మెజారిటీ సభ్యుల మద్దతు ఉందని తెలియచెప్పడానికి తామందరం ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతి ఎదుట పెరేడ్ చేశామని, ఆ తర్వాత కర్ణాటక ప్రభుత్వం ఆహ్వానం మేరకు బెంగళూరుకు, మైసూరుకు, నంది హిల్స్‌కు వెళ్లామని, నెలరోజుల తర్వాత హైదరాబాద్ వచ్చినప్పుడు అపూర్వ స్వాగతం లభించిందని, ఎన్నో వ్యయప్రయాసలు కోర్చి ఎన్టీఆర్ చేసిన పోరాటం వలన కేంద్రం దిగొచ్చిందన్నారు. ఈ మొత్తం ఉదంతంలో నాడు చంద్రబాబు నాయుడు కీలక పాత్ర పోషించారని అన్నారు. ఎమ్మెల్యేలందరినీ రామకృష్ణ సినీ స్టూడియోలో ఉంచాలన్నది ఆయన ఆలోచనేనని గుర్తు చేసుకున్నారు.

మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు ఆనాటి సంఘటనలను మననం చేసుకున్నారు. తనలాంటి సామాన్య దళితులను ఆదరించి అక్కున చేర్చుకొని ఎమ్మెల్యేగా, మంత్రిగా చేసిన మహానుభావుడు ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ నీతి నిజాయితీలకు మారుపేరని, అవినీతిని సహించరని, మహోన్నత వ్యక్తిత్వం ఎన్టీఆర్‌దని పేర్కొన్నారు. అటువంటి రాజకీయ నాయకుడు దేశ రాజకీయాల్లో అరుదని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌తో తనకు విడదీయరాని అనుబంధ ముందని, ఆయన ఔన్నత్యం, భావజాలం భావితరాలకు తెలియజేయడానికి తన మిత్రుడు, సీనియర్ రాజకీయ నాయకుడు టీడీ జనార్దన్ ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీని ఏర్పాటు చేసి గొప్ప కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన పేరును అజరామరం చేస్తున్నందుకు అభినందిస్తున్నట్టు తెలిపారు.

ఎన్టీఆర్ తనయులు నందమూరి రామకృష్ణ ఎన్టీ రామారావు వ్యక్తిత్వంలోని విశేషాలను వివరించారు. సినీ నటుడిగా ఉంటూ చేయి విరిగిన సందర్భాల్లో కూడా నిర్మాతకు నష్టం రాకూడదనే భావంతో ఎన్టీఆర్ అలాగే షూటింగ్‌లలో పాల్గొనేవారని చెప్పారు. 1984 ఆగస్టు సంక్షోభం తమ కుటుంబానికి వ్యక్తిగతంగా ఓ పీడకల లాంటిది అన్నారు. తమ మాతృమూర్తి అనారోగ్యం పాలైన సందర్భంలోనే తమ తండ్రి ఎన్టీఆర్ అమెరికాలో ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకొని స్వదేశానికి తిరిగి వచ్చినప్పుడు పదవీచ్యుతిని చేయడం అత్యంత బాధాకరమని అన్నారు. తమ వివాహాలకు కూడా తమ తండ్రి హాజరు కాలేదని, ఆ సమయంలో ఆయన ప్రజలతోనే ఉండడం తమకు ఎప్పటికీ గర్వకారణం అని అన్నారు.

ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీ అధ్యక్షులు టీడీ జనార్దన్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా రాజకీయ జీవితం ప్రారంభించి ఎన్టీఆర్ ఆశీస్సులతో చిన్నతనంలోనే కృష్ణా జిల్లా సహకార బ్యాంకు అధ్యక్షునిగా కొనసాగానని, ఆ తర్వాత అంచెలంచెలుగా ఎదిగి ఎన్టీఆర్, చంద్రబాబు ప్రోత్సాహంతో తొమ్మిదేళ్ల ఆప్కాబ్ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా పనిచేశానన్నారు. ఇక పార్టీపరంగా అనేక బాధ్యతలు నిర్వహించానని, పార్టీ తనకు తల్లిలాంటిదని అన్నారు.

తనకు తెలుగుదేశం పార్టీ ద్వారా గుర్తింపు, గౌరవం అందించిన ఎన్టీ రామారావు రుణం తీర్చుకోవడానికి, ముఖ్యంగా సినీ నటుడిగా, రాజకీయ నాయకుడిగా, పరిపాలన దక్షుడిగా, ఎన్టీ రామారావు జీవితంలోని మహోన్నత ఘట్టాలను శాశ్వతంగా గుర్తుండిపోయేలా ఆయన శతజయంతి సంవత్సరంలో ఎన్టీఆర్ లిటరేచర్ కమిటీని ఏర్పాటు చేసి ఎన్టీఆర్ సినీ చరిత్ర, భావజాలం, పాలన విజయాలపై ఇప్పటివరకు 7 గ్రంథాలు వెలువరించామని, వీటన్నింటినీ ఇంగ్లీషుతో సహా ఇతర ప్రాంతీయ భాషల్లోకి అనువదించి ప్రచురిస్తున్నట్లు తెలిపారు. క్రిందటేడాది సెప్టెంబర్ 16న "1984 ప్రజాస్వామ్య పరిరక్షణోద్యమం – సజీవ చరిత్ర" అనే గ్రంథాన్ని జర్నలిస్టు విక్రమ్ పూలతో కలిసి రచించి నారా చంద్రబాబు నాయుడు, ఎం వెంకయ్య నాయుడు, ఎన్ ఇంద్రసేనారెడ్డి, అయ్యన్నపాత్రుడు తదితరుల సమక్షంలో ఆవిష్కరించినట్టు తెలిపారు. తెలుగుదేశం చరిత్రలో ఈ సంఘటనకు ఎంతో ప్రాధాన్యముందని, ఈ సంఘటన తర్వాత దేశ రాజకీయాలలో గుణాత్మకమైన మార్పులు వచ్చాయని, అంతటి ప్రాముఖ్యం కలిగిన సంఘటనను డాక్యుమెంట్ చేయడం ఎంతో సంతృప్తి కలిగిస్తుందన్నారు. అన్న ఎన్టీఆర్ యూట్యూబ్ ఛానల్ ద్వారా ఎన్టీఆర్ సినీ, రాజకీయ జీవితానికి సంబంధించిన విశేషాలు, ప్రముఖులతో ఇంటర్వ్యూలు అందిస్తున్నామని, ఎన్టీఆర్‌పై ప్రత్యేకంగా బ్లాగ్స్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

భవిష్యత్తులో ఇంకా మరెన్నో కార్యక్రమాలు చేస్తామని, తమకు నారా చంద్రబాబు నాయుడు ప్రోత్సాహం, సహాయ సహకారాలు ఉన్నాయని, యువనేత నారా లోకేష్ తమకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ కమిటీ సభ్యులు విక్రమ్ పూల, భగీరథ, మధుసూదన రాజు, శ్రీపతి సతీష్, మండవ సతీష్, వెంకట్రావు, కొమ్మినేని వెంకటేశ్వరరావు, హేమ సుందర్, బిక్కీ కృష్ణ, సాయి జ్యోతి, ప్రకాశం తదితరులు పాల్గొన్నారు.

## 'కోడెల శివప్రసాదరావు సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయి'



మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు వర్ధంతి సందర్భంగా మంగళగిరిలోని టీడీపీ జాతీయ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.బుచ్చిరామ్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, శ్రీశైలం దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబరు ఏవీ రమణ, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు గుత్తికొండ ధనుంజయరావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బుచ్చిరామ్ ప్రసాద్ మాట్లాడుతూ.. కోడెల సేవలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. టీడీపీ జెండాను గుండెల్లో పెట్టుకుని పార్టీ కోసం జీవితాంతం పనిచేసిన ధీశాలి శివప్రసాదరావు అని కొనియాడారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసి పార్టీ బలోపేతంలో తనదైన ముద్ర వేసిన నాయకుడు అన్నారు.

డాక్టర్ కోడెల శివప్రసాదరావుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు నివాళు లర్పించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసి ఆపన్నులకు అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. నాలుగు దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో వివిధ శాఖలకు మంత్రిగా, నవ్యాంధ్రప్రదేశ్ శాసనసభ తొలి స్పీకర్‌గా ఆయన అందించిన సేవలు, పల్నాడు అభివృద్ధికి చేసిన కృషి ఎప్పటికీ స్మరణీయమన్నారు.


## పోలీస్ శాఖలో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి(చైతన్యరథం): పోలీస్ అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. పోలీసు శాఖలో 2,050 పోస్టుల భర్తీకి ఏపీ సర్కార్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 378 ఎస్ఐ, 1,156 కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనుంది. ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించింది. ఈ ఉద్యోగాల కోసం ప్రాథమిక రాత పరీక్ష తేదీని త్వరలో ఏపీఎస్ఎల్‌పీఆర్‌బీ ప్రకటించనుంది. దరఖాస్తును అధికారిక వెబ్‌సైట్ (https://slprb.ap.gov.in)ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో సమర్పించాలని ప్రభుత్వం సూచించింది.

**ఏపీ సర్కార్ భర్తీ చేసే పోస్టులు**

ఎస్సై విభాగంలో సివిల్ 253, ఏఆర్ 116, ఎస్పీఎఫ్ 09, కమ్యూనికేషన్ 50, పీటీవో 10 పోస్టులు ఉన్నాయి. కానిస్టేబుల్ విభాగంలో 542 సివిల్, 285 ఏఆర్, 158 ఫైర్, జైలు వార్డర్ పురుషులు 150, జైలు వార్డర్ మహిళలు 21, కమ్యూనికేషన్ 200, పీటీవో విభాగంలో 15 మెకానిక్స్, 198 డ్రైవర్, 43 సైంటిఫిక్ అసిస్టెంట్ పోస్టులకు పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు నోటిఫికేషన్ విడుదల చేసింది. త్వరలో రాత పరీక్ష తేదీల వివరాలను వెల్లడించనుంది.

## యువ క్రీడాకారులకు జ్యోతి యర్రాజీ స్ఫూర్తి
## మంత్రి నారా లోకేష్ అభినందన




అమరావతి(చైతన్యరథం): ఆసియా క్రీడల్లో సత్తా చాటేందుకు సిద్ధమవుతున్న 'జ్యోతి యర్రాజీ'కి మంత్రి నారా లోకేష్ 'ఆల్ ది బెస్ట్' తెలిపారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఎంతోమంది యువ క్రీడాకారులకు జ్యోతి యర్రాజీ స్ఫూర్తిగా నిలుస్తున్నారని అభినందించారు. ఈ నెల 25, 26వ తేదీల్లో మహిళల 100 మీటర్ల హర్డిల్స్‌లో జ్యోతి యర్రాజీ బరిలోకి దిగుతున్నారని ప్రశంసించారు. ఆమె వేగంగా పరుగెత్తి భారత్‌కు ఘనత తీసుకు రావాలని ఆకాంక్షిస్తున్నానని అన్నారు. ఏపీ మొత్తం జ్యోతి యర్రాజీ కి అండగా నిలుస్తోందని చెప్పుకొచ్చారు.

# పల్లెల నిండుగా అభివృద్ధి పండగ

- ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దార్శనికత్వంలో మారిన గ్రామీణాంధ్ర
- రెండు దశల్లో గ్రామాల్లో విస్తృతంగా అభివృద్ధి పనులు
- రెండున్నరేళ్లలో 10 వేల కి.మి బీటీ, 9,600 కి.మి. సీసీ రోడ్ల నిర్మాణం
- 1,000 కిలోమీటర్లకు పైగా గిరిజన గ్రామాలకు అడవితల్లి బాటలు
- అన్నదాతకు అండగా 1.15 లక్షల పంట కుంటలు
- గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు
- పాడి రైతు కోసం 38 వేల మినీ గోకులాలు, 15 వేల నీటి తొట్టెలు
- రెట్టించిన ఉత్సాహంతో పల్లెపండుగ 3.0కి సిద్ధమైన రూట్ మ్యాప్
- వీబీ జీ-రాంజీ, సాస్కీ తదితర పథకాల ద్వారా గ్రామ సర్వతోముఖాభివృద్ధి ప్రణాళికలు



అమరావతి (చైతన్య రథం): గ్రామాభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి, తద్వారా దేశాభివృద్ధికి బలమైన పునాది. పల్లె ప్రగతితో ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. గ్రామీణ మౌలిక సదుపాయాల విస్తరణతో స్వయం సమృద్ధి సాధ్యపడుతుందన్న ప్రాథమిక సూత్రాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేసి దశాబ్దాలుగా సాధ్యంకాని గ్రామీణ ప్రగతిని కేవలం రెండేళ్లలో సాకారం చేశారు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్. ఆయన చొరవతో ఏడున్నర దశాబ్దాలుగా రోడ్డు చూడని ఎన్నో మారుమూల గ్రామాలకు తొలిసారి రహదారి సౌకర్యం ఏర్పడింది. నీరులేక బీళ్లు బారిన భూముల్లో పచ్చదనం చిగురించింది. మూగ జీవాలకు నీడ, నీటి సౌకర్యం ఏర్పడింది. పవన్ కళ్యాణ్ విజన్ పచ్చని పల్లెల్లో అభివృద్ధి పండుగ తీసుకువచ్చింది.

## గ్రామసభల తీర్మానాలతో అభివృద్ధికి అడుగులు

ఈ అభివృద్ధి మొత్తానికి గ్రామ సభల్లో మొదటి అడుగు పడింది. గ్రామస్తులు కోరుకున్న అభివృద్ధిని పవన్ వారి ముంగిట నిలిపారు. అందుకోసం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు తీసుకున్న వెంటనే ఏకకాలంలో రాష్ట్రవ్యాప్తంగా 13,326 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల్లో చేసిన తీర్మానాలను పల్లెపండుగ రూపంలో పనులుగా మలచి పట్టాలెక్కించారు. పల్లెపండుగ, పల్లెపండుగ 2.0 కలిపి రెండు దశల్లో రికార్డుస్థాయిలో 9,600 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించారు. పల్లెల్లో అంతర్గత అనుసంధాన వ్యవస్థను సీసీ రోడ్లు మెరుగుపర్చాయి. మరో 10,000 కిలోమీటర్ల మేర బీటీ (తారు) రోడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే వీటిలో చాలా వరకు పూర్తయ్యాయి. గ్రామాల మధ్య, గ్రామాలు, మండల కేంద్రాల మధ్య అనుసంధాన వ్యవస్థ తారు రోడ్ల నిర్మాణంతో మెరుగుపడింది. ఆంధ్రప్రదేశ్ పల్లెలు రోడ్ల నిర్మాణం పరంగా ఎన్నడూ చూడని అభివృద్ధిని పవన్ కళ్యాణ్ రెండేళ్ల పదవీకాలంలోనే చూశాయి.

## బడి, గుడి, ఆరోగ్య కేంద్రాలు, మార్కెట్లకు మెరుగైన రవాణా

పవన్ కళ్యాణ్ నాయకత్వంలో గ్రామాల్లో నిర్మించిన ప్రతి రోడ్డుకీ బలమైన నేపథ్యముంది. గ్రామీణాంధ్రవ్యాప్తంగా ఉన్న ఎన్నో ప్రసిద్ధ క్షేత్రాలకు ఉప ముఖ్యమంత్రి చొరవతో రహదారి సౌకర్యం మెరుగుపడింది. గత ప్రభుత్వ హయాంలో విగ్రహాల ధ్వంసంతో అపవిత్రమైన శ్రీరాముడు కొలువైన క్షేత్రం విజయనగరం జిల్లా రామతీర్థం. ఈ క్షేత్ర గిరి ప్రదక్షిణం మార్గంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో భక్తుల సౌకర్యార్థం రోడ్డు నిర్మించారు. శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని ఏర్పాటు చేసి స్వయంగా ప్రారంభించారు. అంతర్వేది శ్రీ లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రానికి, కోటప్పకొండ, ఐ.ఎస్. జగన్నాథపురంలాంటి వందలాది క్షేత్రాలకు వెళ్లే భక్తుల ప్రయాణ సౌకర్యాన్ని మెరుగుపరుస్తూ రోడ్లు నిర్మించారు. వాడపల్లి ఏడువారాల శ్రీ వెంకటేశ్వరస్వామిలాంటి ఎన్నో విఖ్యాత ఆలయాలకు సాస్కీలాంటి పథకాల నిధులతో రోడ్లు నిర్మిస్తున్నారు. పల్లెపండుగ రెండు దశల్లోనూ కలిపి 100కు పైగా క్షేత్రాల్లో రూ.120 కోట్లతో 205 కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణం చేపట్టారు. వీటితోపాటు గ్రామీణ ప్రాంతాలనుంచి ఆరోగ్య కేంద్రాలకు చేరుకునేందుకు, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లేందుకు అనుగుణంగా రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు.

## రోజులు, గంటల వ్యవధిలో రోడ్లు మంజూరు చేసిన ఉప ముఖ్యమంత్రి

గ్రామాల్లో తీర్మానాలు చేసిన రోడ్లతోపాటు పలు సందర్భాల్లో ప్రజల కోరిక మేరకు అప్పటికప్పుడు రోడ్లు మంజూరు చేసి పవన్ కళ్యాణ్ తన మార్క్ చాటుకున్నారు. నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజకవర్గం గజ్జలవారిపల్లికి చెందిన విద్యార్థులు తమకు స్కూలుకు వెళ్లే రోడ్డు సరిగాలేదని సామాజిక మాధ్యమాల ద్వారా తెలియజేయగా, తక్షణం ఆ గ్రామానికి రోడ్డు నిర్మించారు. ప్రపంచ కప్ గెలిచిన అంధుల మహిళా క్రికెట్ జట్టు కెప్టెన్ టీసీ దీపిక సన్మాన కార్యక్రమంలో తమ గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరగా డిప్యూటీ సీఎం కార్యాలయం నుంచి దీపిక ఇంటికి చేరేలోపు రోడ్డు మంజూరు చేయడంతోపాటు నిర్మాణం పూర్తి చేశారు. కానిస్టేబుల్ నియామక పత్రాల పంపిణీ కార్యక్రమంలో అల్లూరి జిల్లా లబ్బర్తి పంచాయతీకి చెందిన లాకే బాబురావు తన గ్రామానికి రోడ్డు కావాలని వేదిక మీద కోరగా, వేదిక దిగేలోపే ఈ రోడ్డు మంజూరు చేసి అందర్నీ ఆశ్చర్యపరిచారు. వీటితోపాటు క్షేత్రస్థాయి పర్యటనల సందర్భంగా వచ్చిన ఎన్నో వినతులు ఆయా గ్రామాల్లో రోడ్లుగా మారాయి. అడవితల్లి బాట కార్యక్రమం ద్వారా డోలీ రహిత గిరిజన గ్రామాలు లక్ష్యంగా వందలాది గిరిజన గ్రామాలను అనుసంధానిస్తూ, వేల కిలోమీటర్ల రోడ్లు నిర్మిస్తున్నారు. ఇప్పటికే రెండు దశల్లో రూ. 2.078 కోట్లతో, 2,310 కిలోమీటర్ల రహదారుల అభివృద్ధి పనులు చేపడుతున్నారు. ఇందులో దాదాపు వెయ్యి కిలోమీటర్లకు పైగా కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. ఎన్నో గిరి శిఖర గ్రామాలకు సంక్లిష్ట పరిస్థితులకు ఎదురెల్లి మరీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నారు. ప్రధాన మంత్రి జన్ మన్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీతో పాటు వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల నిధులు, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో అడవితల్లి బాటలు పరుస్తున్నారు. వీటితోపాటు పంట పొలాల మధ్యకు వెళ్లే డొంక రోడ్లు కూడా కొన్ని నిర్మించారు.

## అన్నదాతకు ఉపాధి భరోసా

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో పల్లెపండుగ రెండు దశల్లో రైతులకు మేలు చేసే కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టారు. భూగర్భ జలాల వృద్ధితోపాటు వర్షపు నీటిని ఒడిసిపట్టడం ద్వారా రైతుకు సాగు నీటి కష్టాలు తీర్చేందుకు పంట కుంటల నిర్మాణానికి పవన్ కళ్యాణ్ శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా 1.15 లక్షల పంట కుంటలు నిర్మించగా, ఒక్క రాయలసీమలోనే ఈ కార్యక్రమం తర్వాత సుమారు 50 వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం పెరగడం గమనార్హం. దీంతోపాటు హార్టికల్చర్ సాగుకు ఊతమిస్తూ... ఉపాధి హామీ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 2 లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు సాగు చేశారు. పాడి రైతుల కోసం, పశువులకు నీడ కల్పించేందుకు రాష్ట్రవ్యాప్తంగా 38,000కి పైగా మినీ గోకులాలు నిర్మించారు. వేసవిలో మూగ జీవాల దాహార్తి తీర్చేందుకు 15 వేల నీటి తొట్టెలు నిర్మాణం చేపట్టారు.

రోడ్లు, గోకులాలు, పండ్లతోటలు, నీటి కుంటలతో పాటు గ్రామీణ పారిశుధ్యానికి పెట్టపీట వేస్తూ... డ్రెయినేజీ వ్యవస్థకు కొత్త రూపం ఇస్తూ మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం చేపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటి వరకు 54 కిలోమీటర్ల మేర మ్యాజిక్ డ్రెయిన్లు నిర్మించి, దోమలు, దుర్వాసన నుంచి గ్రామీణ ప్రజలకు రక్షణ కల్పిస్తున్నారు. ఇంకుడు గుంతలు, చెత్తనుంచి సంపద సృష్టి కేంద్రాలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు.

పల్లెపండుగ, పల్లెపండుగ 2.0 కార్యక్రమాల ద్వారా పల్లెపండుగ 3.0కి పవన్ కళ్యాణ్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో, పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న గ్రామీణాభివృద్ధికి మెచ్చి ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో ప్రతిష్టాత్మంగా తీసుకువచ్చిన వీబీ జీ-రాంజీ జాతీయస్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమ ప్రారంభోత్సవానికి మన రాష్ట్రాన్ని ఎంపిక చేశారు. రైల్వే కోడూరు నియోజకవర్గం వేదికగా ప్రారంభమైన వీబీ జీ-రాంజీతోపాటు సాస్కీ తదితర కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల నిధులను సద్వినియోగం చేసుకుంటూ పల్లెపండుగ 3.0కి శ్రీకారం చుట్టనున్నారు.ంం

# దూండి గణేష్‌కు ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డు

### 72 అడుగుల పర్యావరణహిత మట్టి గణపతికి విశిష్ట గుర్తింపు

విజయవాడ (చైతన్య రథం): విజయవాడ విద్యాధరపురం సితార గ్రౌండ్స్‌లో దూండి గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన 72అడుగుల శ్రీపంచముఖ వరసిద్ధి మహా మట్టి గణపతి ప్రపంచ రికార్డు సాధించాడు. ప్రధానంగా మట్టి, పర్యావరణ హిత పదార్థాలతో నిర్మించిన ఈవిగ్రహానికి 'అత్యంత ఎత్తైన పర్యావరణహిత గణేష్ విగ్రహం'గా ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డ్స్ గుర్తింపు లభించింది. విగ్రహ నిర్మాణాన్ని జూలై 9న ప్రారంభించి సెప్టెంబర్ 12న పూర్తి చేశారు. సెప్టెంబర్ 13న సితార గ్రౌండ్స్‌లో జరిగిన ఆగమన కార్యక్రమంలో విగ్రహాన్ని ఆవిష్కరించారు. భక్తి, శిల్పకళా నైపుణ్యంతోపాటు పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని చాటేలా ఈభారీ గణపతి విగ్రహాన్ని రూపొందించారు. ప్రపంచరికార్డు ధ్రువీకరణ పత్రాన్ని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ చేతుల మీదుగా దూండి గణేష్ సేవాసమితి ప్రతినిధులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గ నాయకుడు నాగుల్ మీరా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంఎస్ భేగ్ తదితరులు తమ బృందంతో గణేశుడిని దర్శించుకున్నారు. రికార్డు అందుకునే కార్యక్రమంలో దూండి గణేష్ సేవాసమితి కార్యవర్గ సభ్యుడు, రాష్ట్ర ఆర్యవైశ్య సంక్షేమ, అభివృద్ధి సంస్థ చైర్మన్, టీడీపీ అధికార ప్రతినిధి దూండి రాకేష్‌తో పాటు ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు కొత్త ముక్తేశ్వరరావు, దరిశి వెంకట సుబ్బారావు, పేర్ల వెంకట రవికుమార్, ఆలపాటి సత్యన్నారాయణరావు, సామ చైతన్య, నంబూరి నాగేశ్వరరావు, వక్కలగడ్డ పవన్ కుమార్, సీఎల్ అరుణ్ కుమార్, ఆత్మకూరు శ్రీనివాసరావు, కొల్లూరు లక్ష్మణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



# నిరంతరం నేర్చుకునే తత్వమే భవిష్యత్తుకు నిజమైన రక్షణ

- ఏఐ యుగంలో శాశ్వత ఉద్యోగం కంటే నిరంతర నైపుణ్యాభివృద్ధి ముఖ్యం
- విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్ నిర్మాణానికి నెట్‌వర్క్ ఎఫెక్ట్స్ కీలకం
- ప్రిజమ్ కళాశాల విద్యార్థులతో ఎంపీ శ్రీభరత్ ముఖాముఖీ



విశాఖపట్నం (చైతన్యరథం): మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ, తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడమే యువత భవిష్యత్తుకు నిజమైన రక్షణ అని విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ అన్నారు. విశాఖపట్నంలోని ప్రిజమ్ డిగ్రీ అండ్ పీజీ కాలేజీ విద్యార్థులతో బుధవారం నిర్వహించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్ పాల్గొని, విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమగ్రంగా సమాధానాలు ఇచ్చారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ యుగంలో సమాచారాన్ని పొందడం గతంలో కంటే ఎంతో సులభమైందని శ్రీభరత్ అన్నారు. ఏఐ సాధనాలు విస్తృతమైన సమాచారాన్ని క్షణాల్లో అందిస్తున్న నేపథ్యంలో, కేవలం ఒక సబ్జెక్టులో నైపుణ్యం సాధించడం మాత్రమే కాకుండా నిరంతరం నేర్చుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం ఎంతో అవసరమని చెప్పారు. భవిష్యత్తులో ఉద్యోగ స్వభావం, అవసరమైన నైపుణ్యాలు వేగంగా మారే అవకాశం ఉన్నందున, ఒక ఉద్యోగం లేదా ఒక నైపుణ్యంపైనే ఆధారపడకుండా నిరంతరం నేర్చుకోవడం, మార్పులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవడం యువతకు అవసరమని సూచించారు.

**విశాఖలో బలమైన ఐటీ ఎకోసిస్టమ్**

విశాఖపట్నాన్ని ఐటీ, టెక్నాలజీ రంగాల్లో మరింత అభివృద్ధి చేయడానికి బలమైన నెట్‌వర్క్ ఎఫెక్ట్స్ సృష్టించాల్సిన అవసరం ఉందని ఎంపీ శ్రీభరత్ తెలిపారు. గతంలో హైదరాబాద్‌లో ప్రముఖ ఐటీ సంస్థల రాకతో ఏర్పడిన ఐటీ ఎకోసిస్టమ్ మాదిరిగానే, విశాఖపట్నంలోనూ పెద్ద సంఖ్యలో ఐటీ, టెక్నాలజీ సంస్థలు, స్టార్టప్‌లు, అనుబంధ సేవలు ఏర్పడేలా వాతావరణాన్ని అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఉత్తరాంధ్రకు చెందిన అనేక మంది ఐటీ నిపుణులు, అనుభవజ్ఞులైన ప్రొఫెషనల్స్ దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశాల్లో పనిచేస్తున్నారని, విశాఖలో అవకాశాలు పెరిగితే వారిలో చాలామంది తిరిగి నగరానికి వచ్చే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. దీనివల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థతో పాటు యువతకు ఉద్యోగ, వ్యాపార అవకాశాలు మరింత పెరుగుతాయని వివరించారు.

**డేటా సెంటర్లతో కొత్త అవకాశాలు**

విశాఖపట్నం అంతర్జాతీయ సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్‌కు అనుసంధానమయ్యే వ్యూహాత్మక ప్రదేశంగా ఉండటం వల్ల డేటా సెంటర్లు, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ వంటి భవిష్యత్ సాంకేతిక రంగాలకు అనుకూలమైన కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని శ్రీభరత్ అన్నారు. పెద్ద టెక్నాలజీ సంస్థల పెట్టుబడులు వచ్చినప్పుడు వాటి చుట్టూ ఫిన్‌టెక్, ఏఐ, సాఫ్ట్‌వేర్, డిజిటల్ సర్వీసెస్ వంటి అనుబంధ రంగాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని తెలిపారు.

# స్థానిక ఎన్నికలే లక్ష్యంగా కూటమి పార్టీలు సమన్వయంతో పనిచేయాలి

- కూటమి పార్టీ ఆత్మీయ కలయికలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్, గాజువాక నియోజకవర్గ పరిశీలకులు కిడారి శ్రావణ్ కుమార్



విశాఖపట్నం (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలను లక్ష్యంగా చేసుకుని కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో ముందుకు సాగాలని రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్, గాజువాక నియోజకవర్గ పరిశీలకులు కిడారి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. గాజువాక నియోజకవర్గంలోని గ్రీన్ సిటీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కూటమి పార్టీ ఆత్మీయ కలయిక, సమావేశంలో ఆయన పాల్గొని నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ.. కూటమి పార్టీల మధ్య సమన్వయం మరింత బలోపేతం చేసుకుని, క్షేత్రస్థాయిలో ప్రజలతో నిరంతరం మమేకమవుతూ పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. గ్రామ, మండల, వార్డు స్థాయిలో నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో పనిచేస్తే కూటమి మరింత బలపడుతుందని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులంతా ఐక్యంగా పనిచేసి కూటమి లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గాజువాక శాసనసభ్యులు, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జి, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, బీజేపీ ఇన్‌చార్జి కేవీఆర్, గాజువాక ఇన్‌చార్జి ప్రసాదుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# అరకు పంచాయతీలో 50 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



అరకు (చైతన్యరథం): దుంబ్రిగూడ మండలం అరకు పంచాయతీ నుంచి 50 కుటుంబాలు బుధవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకున్నాయి. తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరిపాలన విధానానికి ఆకర్షితులై వీరంతా తెలుగుదేశంపార్టీలో చేరారు. మాజీ జెడ్పిటిసి ఏ.కృష్ణారావు, రిటైర్డ్ టీచర్ అల్లు, రిటైర్డ్ విఆర్ఓ సాయిబాబాతో పాటు వారి ఆధ్వర్యంలో వీరంతా తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి తెలుగుదేశం పార్టీ అరకు అసెంబ్లీ నియోజకవర్గ ఇన్చార్జి, ఏ.పి.ఎస్.ఆర్.టి.సి విజయనగరం ప్రాంతీయ జోన్ చైర్మన్ డా.సియ్యారి దొన్ను దొర కండువాలు వేసి పార్టీలోకి సాధారంగా ఆహ్వానించారు.

**వైసీపీలో ఎవరికీ మేలు జరగలేదు**

ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి దొన్ను దొర మాట్లాడుతూ... వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ఈ నాయకులంతా ఇబ్బందులు పడ్డారని వారి గ్రామానికి గాని వారి కుటుంబాలకు కానీ ఒక మంచి పని కూడా జరగలేదని ఆవేదన వారందరిలో కనిపించిందన్నారు. అందుకే ఈరోజు ఆ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి చేరారన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఒకపక్క సంక్షేమాన్ని మరోపక్క అభివృద్ధిని సమపాలల్లో అందిస్తున్నారన్నారు. తర తమ బేధం లేకుండా అర్హత ఒక్కటే ప్రాథమికంగా తీసుకొని పాలన సాగిస్తూ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఇటువంటి ముఖ్యమంత్రి ఆంధ్రప్రదేశ్‌కు భవిష్యత్తులో కూడా రావాలన్నారు. ఇది మాత్రమే కాకుండా గిరిజన ప్రాంతంలో ఎన్నడూ లేని అభివృద్ధి జరుగుతున్న విషయాన్ని ప్రజలందరూ గమనిస్తున్నారన్నారు. అందుకే గిరిజన జాతికి మంచి చేస్తున్న నాయకుడు పక్షాన నిలవాలన్న ఉద్దేశంతో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి వీళ్ళందరూ వస్తున్నారన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ నియామకాల్లో

**అక్రమాలు జరిగాయి : ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు**



విజయనగరం (చైతన్యరథం): వైసీపీ ప్రభుత్వంలో నిర్వహించిన ఏపీపీఎస్సీ నియామకాల్లో అనేక అక్రమాలు జరిగాయని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు ఆరోపించారు. వేలాదిమంది అభ్యర్థులు కష్టపడి పరీక్షలు రాస్తే ఆనాటి జగన్ ప్రభుత్వం ఇష్టానుసారంగా, లోపభూయిష్టంగా మూల్యాంకనం చేసిందని ఎద్దేవా చేశారు. బుధవారం గురజాడ గ్రంథాలయం దగ్గర ఉన్న ఓ పోటీ పరీక్షల కేంద్రానికి వెళ్లి ఆమె వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ తీసుకుంటున్న అభ్యర్థులతో మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ల విజయవంతంగా మెగా డీఎస్సీ నిర్వహిస్తే.. వైసీపీ కావాలనే దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు. యువత ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే విధంగా ఆ పార్టీ ప్రవర్తన ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల చేశామని, నిరుద్యోగ యువతకి పరిశ్రమలు తీసుకువచ్చి ఉపాధి అవకాశాలు కలిపిస్తున్నామని వివరించారు.

## ఎమ్మెల్యే కళా వెంకట్రావును కలిసిన మజ్జి శ్రీనివాసరావు



రాజాం (చైతన్యరథం): విజయనగరం జడ్పీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట్రావును రాజాంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి, చీపురుపల్లి, గుర్ల, మెరకముడుదాం మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చిన్న శ్రీనును పార్టీలోకి స్వాగతిస్తున్నామని, అందరూ ఒక కుటుంబంలా కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేద్దామని చెప్పారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం విజయం సాధించేందుకు కృషి చేస్తానని మజ్జి శ్రీనివాసరావు ఈ సందర్భంగా చెప్పారు. ఈ నెల 8న చంద్రబాబు సమక్షంలో తాను టీడీపీలో చేరానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

## 2018 ఏపీపీఎస్సీ పరీక్షల్లో లోపించిన పారదర్శకత

- వైసీపీ ప్రభుత్వ పనితీరుపై మండిపడ్డ పడాల భూదేవి



పాలకొండ (చైతన్యరథం): పాలకొండ టౌన్ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో టీడీపీ ఇన్‌ఛార్జ్ పడాల భూదేవి యువతను ఉద్దేశించి మాట్లాడారు. గత వైసీపీ పాలనలో సుమారు రూ.150కోట్ల మేర ఉద్యోగాల పేరుతో కుంభకోణం జరిగిందన్నారు. డిప్యూటీ కలెక్టర్ పోస్టుకు 2.5 కోట్లు ఆర్డీవో పోస్ట్‌కి ఒక కోటి రూపాయలు, డీఎస్పీ పోస్టుకు 50 లక్షలు వసూలు చేశారని సమాచారమని, ఏపీపీఎస్సీ జవాబు పత్రాల నిర్వహణలో తీవ్ర అవకతవకలు చోటు చేసుకున్నాయని అన్నారు. ఫోరెన్సిక్ పరీక్షల్లో మొత్తం 730 పత్రాలకు గాను 718 అంటే 97.5 0% పత్రాలలో అనధికార దిద్దుబాట్లు జరిగినట్లు తేలిందన్నారు. 2018 ఏపీపీఎస్సీ గ్రూప్ వన్ పరీక్ష నియామకంలో లోపించిన పారదర్శకత, అధికారుల ఇష్టారాజ్యం, తీవ్ర ఆందోళనను రేకెత్తించాయి. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏళ్ళ తరబడి సిద్ధమవుతున్న లక్షలాదిమంది యువ అభ్యర్థులకు స్పష్టమైన సందేశం ఒకటే నియామకాలు కేవలం ప్రతిభా ఆధారంగా, పారదర్శకంగా ఎటువంటి అవకతవకలకు తావులేకుండా జరగాలి. NDA ప్రభుత్వ పాలనలో మీ అవకాశాలకు పూర్తి రక్షణ ఉంటుంది. మీ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని పడాల భూదేవి యువతను ఉద్దేశించి మాట్లాడారు.

## జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

విజయనగరం (చైతన్యరథం): జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 17, 18 తేదీల్లో విజయనగరం కలెక్టరేట్ ఆడిటోరియంలో కౌశలం డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. గ్రీన్వేక్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (జీటీఐ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ డ్రైవ్లో 700 ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఫౌండ్రీ విభాగంలో 400, మెషినింగ్ విభాగంలో 300 పోస్టులు భర్తీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. 18 నుంచి 32 సంవత్సరాల వయస్సు గల పురుషులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చన్నారు. ఎస్ఎస్సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, ఏదైనా ట్రేడ్, డిప్లొమా లేదా బీటెక్ (మెకానికల్) విద్యార్హత కలిగిన వారు, ఫ్రెషర్లు కూడా ఇంటర్వ్యూకు హాజరు కావచ్చని తెలిపారు.

## యువత భవితకు భరోసా.. ప్రతిభకు పెద్దపీట

●ఉభయగోదావరి జిల్లాల ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం



పెద్దాపురం (చైతన్యరథం): పెద్దాపురంలోని ఎస్.ఆర్.వి.బి.ఎస్.జె.బి. మహారాణి కళాశాలను స్థానిక ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో సమావేశమై వారి భవిష్యత్తు, ఉపాధి అవకాశాలు మరియు ప్రభుత్వ నియామకాలపై భరోసా కల్పించారు. యువత నమ్మకాన్ని నిలబెడుతూ.. ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత, ప్రతిభ ఆధారిత విధానం, అవకతవకలకు తావులేని ప్రక్రియకు ఎన్డీయే ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఏళ్ల తరబడి ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న లక్షలాది మంది యువతకు న్యాయమైన అవకాశాలు అందేలా నియామక ప్రక్రియపై విశ్వాసాన్ని పెంపొందించడమే లక్ష్యం. విద్యార్థులతో నేరుగా సమావేశాలు నిర్వహించడం ద్వారా వారి భవిష్యత్తుపై ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించి భరోసా కల్పించారు.

## కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

●రాష్ట్ర ఐటీసీ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని



పెద్దపాడు (చైతన్యరథం): రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రతి నెల రెండవ బుధవారం నిర్వహించే మండల విస్తృత స్థాయి సమావేశం, దెందులూరు నియోజకవర్గ శాసనసభ్యులు చింతమనేని ప్రభాకర్ సూచనలతో పెద్దపాడు మండలం నాయుడుగూడెంలో అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (IDC) డైరెక్టర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, దెందులూరు నియోజకవర్గ పరిశీలకురాలు అంకెం ఇందిరా ప్రియదర్శిని ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అంకెం ఇందిరా ప్రియదర్శిని మాట్లాడుతూ... నాయకులు, కార్యకర్తలు ఎంతో బాధ్యతాయుతంగా పనిచేసి 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని ఘన విజయం చేశారని కొనియాడారు. ఇదే స్ఫూర్తితో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల భారీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ శ్రమించాలని పిలుపునిచ్చారు.

**సంక్షేమ పథకాల విస్తృత ప్రచారం:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్' పథకాలు, పింఛన్ల పెంపు, ఉచిత ఇసుక విధానం, ప్రతి నెల అందిస్తున్న డీబీటీ సంక్షేమ ఫలాలను ఇంటింటికీ వివరించాలి. గ్రామ స్థాయిలోని ప్రజా సమస్యలను గుర్తించి, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంలో నాయకులు ముందుండాలి. రానున్న గ్రామ పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి విజయదుందుభి మోగించేలా క్షేత్రస్థాయిలో పార్టీ యంత్రాంగాన్ని బలోపేతం చేయాలి. వైసీపీ పాలనలోని వైఫల్యాలు, ప్రస్తుత కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తేటతెల్లం చేస్తూ ముందుకు సాగాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో పెద్దపాడు మండల తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోడెల శివప్రసాదరావు సేవలు చిరస్మరణీయం



నరసరావుపేట (చైతన్యరథం): నియోజకవర్గం, రొంపిచర్ల మండలం, ముత్తనపల్లి గ్రామంలో నవ్యాంధ్రప్రదేశ్ తొలి శాసన సభాపతి, పల్నాటి పులి డాక్టర్ కోడెల శివప్రసాదరావు 7వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో వేమూరు శాసనసభ్యులు, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోడెల శివప్రసాదరావు విగ్రహాన్ని ఆవిష్కరించి, ఆయనకు ఘన నివాళులు అర్పించారు. ప్రజా సేవలో కోడెల శివప్రసాదరావు చేసిన విశేష కృషి, పల్నాడు ప్రాంత అభివృద్ధికి అందించిన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, కోడెల శివప్రసాదరావు అభిమానులు వేలాదిగా తరలివచ్చి, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



## విద్యార్థులకు కెరీర్‌పై దిశానిర్దేశం : ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర



పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం పట్టణంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో "యువత భవితకు భరోసా" కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి డిగ్రీ కళాశాల చైర్మన్ మణికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయచంద్ర విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి జీవిత ఆశయాలు, కెరీర్ లక్ష్యాలు, డిగ్రీ అనంతరం ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రైవేట్ రంగ అవకాశాలు, వ్యాపార మరియు స్టార్టప్ అవకాశాలపై చర్చించారు. ప్రభుత్వ ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకున్న విద్యార్థులకు సరైన సమాచారం, పక్కా ప్రణాళిక, నిరంతర కృషి అవసరమని ఎమ్మెల్యే సూచించారు. APPSC, UPSC, SSC, బ్యాంకింగ్, రైల్వేలు, రక్షణ, పోలీస్ శాఖలకు సంబంధించిన పోటీ పరీక్షలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కూడా ఎమ్మెల్యే దృష్టికి తమ అవసరాలను తీసుకువచ్చారు. పార్వతీపురం నియోజకవర్గంలో ప్రభుత్వ ఆధ్వర్యంలో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల కోసం ప్రత్యేక కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే ప్రస్తుత ఉద్యోగ అవకాశాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేసి కంప్యూటర్, కోడింగ్, స్పోకెన్ ఇంగ్లీష్ తదితర నైపుణ్యాల్లో శిక్షణ అందించాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. విద్యార్థుల అభిప్రాయాలను తెలుసుకున్న ఎమ్మెల్యే, వారి అవసరాల ఆధారంగా కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షల కోచింగ్, లైబ్రరీ సౌకర్యాలు, స్కిల్ ట్రైనింగ్, జాబ్ మేళాలు వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరాన్ని కార్యక్రమంలో ప్రస్తావించారు. ప్రస్తుత ఉద్యోగ మార్కెట్‌లో డిగ్రీతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంగ్లీష్, డిజిటల్ స్కిల్స్, AIపై అవగాహన, సమస్య పరిష్కార సామర్థ్యం, లాజికల్ థింకింగ్, టీమ్‌వర్క్, ఇంటర్వ్యూ నైపుణ్యాలు కూడా ఎంతో ముఖ్యమని విద్యార్థులకు వివరించారు.

## లోకేష్‌కు పేరొస్తుందనే అక్కసుతోనే పారదర్శకంగా జరిగిన డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం

●పట్టిసీమపై ఒక్క మంచి మాట చెప్పలేని జగన్.. డీఎస్సీపై నీతులు చెబుతున్నారా? : మాజీమంత్రి దేవినేని ఉమా




విజయవాడ (చైతన్యరథం): మెగా డీఎస్సీపై వైసీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. మంత్రి నారా లోకేష్‌కు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతోనే అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించిన మెగా డీఎస్సీపై ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. గొల్లపూడి లోని కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టపడి డీఎస్సీలో ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులను అవమానించేలా, వారి మనోధైర్యాన్ని దెబ్బతీసేలా వైసీపీ వ్యవహరిస్తోందని మండిపడ్డారు. 892 ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని కూడా ఓర్వలేకపోతున్నారని అన్నారు. మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారాలతో ట్వీట్లు చేస్తున్న జగన్‌రెడ్డికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే.. పట్టిసీమ నీటితో జరిగిన మేలుపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ చేయాలని ఉమా డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వారు జన్‌జీ గురించి మాట్లాడటం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. స్పోర్ట్స్ కోటాలో డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు పొందిన వారిలో 372 మందికి నియామకాలు లభించగా, వారిలో 326 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందినవారేనని దేవినేని ఉమా తెలిపారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం పొందిన గణేష్ బోడెన్నీ సరస్సును ఈది ప్రపంచ రికార్డు సృష్టించడం రాష్ట్రానికి గర్వకారణమన్నారు. అదేవిధంగా పేద మత్స్యకార కుటుంబంలో పుట్టి డీఎస్సీ ఉద్యోగం సాధించిన రవికుమార్ తన ఏడాది జీతాన్ని గ్రామం కోసం, పేదల కోసం అందించి స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులకు హామీలు ఇచ్చి మోసం చేసిన జగన్‌రెడ్డికి డీఎస్సీపై మాట్లాడే నైతిక హక్కు లేదని దేవినేని ఉమా అన్నారు. రాష్ట్రంలో జరిగిన 14 డీఎస్సీల ద్వారా 1,80,000 టీచర్ ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదేనని తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తుంటే ఓర్వలేక మెగా డీఎస్సీపై తప్పుడు ప్రచారాలు చేయడం వైసీపీ దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ కుట్రలకు ప్రజలు తగిన బుద్ధి చెప్పనున్నారని దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు.

## ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికల నిలుపుదలకు వైసీపీ కోర్టులను ఆశ్రయిస్తోంది

●చిలకలూరిపేట పట్టణంలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ చేసిందే

●పట్టణ యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్ ఛార్జులు కుటుంబ సాధికార సారథుల సమావేశంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి



చిలకలూరిపేట (చైతన్యరథం): సంక్షేమ పథకాల్లో అర్హుల గుర్తింపు.. అభివృద్ధి పనులపై విస్తృత ప్రచారం.. రెండేళ్ల పాలన విజయాలు.. ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబు పనితీరు వంటి అంశాలే మున్సిపల్ ఎన్నికల్లో పార్టీని గెలిపిస్తాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి తెలిపారు. ప్రజల్లో పార్టీ ఇమేజ్, ప్రభుత్వ ప్రతిష్ట పెరిగిందని, దాన్ని ఓట్లుగా మార్చడంలో యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్ ఛార్జులు, కుటుంబ సాధికార సారథులు కీలక పాత్ర పోషించాలని ఆయన స్పష్టంచేశారు. బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో పట్టణంలోని యూనిట్, క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు, కుటుంబసాధికార సారథులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వారికి పలు కీలక సూచనలు చేశారు.

**కే.ఎస్.ఎస్‌ల పనితీరే విజయావకాశాలు మెరుగుపరుస్తుంది...**

చిలకలూరిపేట మున్సిపాలిటీలో గెలవలేమని తెలిసే ఎన్నికలు ఆపాలన్న దురుద్దేశంతో వైసీపీ కోర్టుల్లో తప్పుడు కేసులు వేస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. స్థానిక ఎన్నికలు ఆపాలన్న లక్ష్యంతో వైసీపీ ఉంటే.. ప్రజామద్దతుతో ప్రతి ఎన్నికల్లో విజయం సాధించాలన్న పట్టుదలతో కూటమి పార్టీలు ఉన్నాయన్నారు. ఈ రెండేళ్లలో పట్టణంలో చేసిన అభివృద్ధి ఒకెత్తు అయితే, ఇటీవల రూ.65 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులు మరో ఎత్తని, అవన్నీవేగంగా పూర్తయ్యేలా యంత్రాంగం పనిచేస్తోందని ప్రత్తిపాటి తెలిపారు. కుటుంబ సాధికార సారథులు ప్రతి వార్డులో పార్టీ విజయావకాశాలు మెరుగుపరచాలని, ఆదిశగా ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. యూనిట్, క్లస్టర్లు, బూత్ ఇన్ ఛార్జులు ఎవరి పరిధిలో వారు క్షేత్రస్థాయిలో మంచి పనితీరు కనబరచాలన్నారు. అభిప్రాయభేదాలు, వ్యక్తిగత ఆలోచనలు పక్కన పెట్టి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేసే వారికే భవిష్యత్‌లో మంచి అవకాశాలు లభిస్తాయన్నారు.

**మనసు పెట్టి పనిచేస్తే పట్టణంలో వైసీపీ గల్లంతే..**

వార్డుల పునర్విభజనపై ప్రజల్లో అభ్యంతరాలు వ్యక్తమైతే, వెంటనే వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లేలా, పార్టీ శ్రేణులు వారికి అవగాహన కల్పించాలన్నారు. చిలకలూరిపేట పట్టణంలో టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప.. మరే నాయకుడు, పార్టీ ఏమీ చేసింది లేదన్నారు. కుటుంబ సాధికార సారథులు (కే.ఎస్.ఎస్) ప్రతి ఓటర్ నాడిని పసిగట్టి పనిచేయాలని, 48 వార్డుల్లో ప్రతి ఇంట్లో, ప్రతి ఒక్కరిలో కూటమిపాలనపై సానుకూలత ఏర్పడాలని, ఓటర్ల అభిమానం ఓట్ల రూపంలో కనిపించాలని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో ప్రధాన పాత్ర పోషించాల్సింది కే.ఎస్.ఎస్ లేనని, వారు మనసుపెట్టి పనిచేస్తే పట్టణంలో వైసీపీ డిపాజిట్లు గల్లంతవుతాయన్నారు.

చైతన్యరథం

# గుడివాడలో రూ.22.50 కోట్ల అమృత్ 2.0 పనులపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్ష



గుడివాడ (చైతన్యరథం): గుడివాడ పట్టణంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా అమృత్ 2.0 పథకంలో రూ.22.50 కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులకు స్పష్టం చేశారు. బుధవారం గుడివాడ ప్రజావేదిక కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, ఇంజనీరింగ్ సిబ్బంది, మెగా సంస్థ ప్రతినిధులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అమృత్ 2.0లో చేపట్టనున్న నీటి ప్రాజెక్టులతో పాటు ధనియాలపేట, ఆర్టీసీ కాలనీల్లో కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న తాగునీటి వాటర్ ట్యాంకుల పనుల పురోగతిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులకు సంబంధించిన వివరాలను అధికారులు, మెగా సంస్థ ప్రతినిధులు వివరించగా.. సాంకేతికంగా ఎదురవుతున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని రాము తెలిపారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా నిర్ణీత సమయంలో వాటర్ ట్యాంకుల నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు. అమృత్ 2.0 పనులను అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, తమ స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు అందించేందుకు రూపొందించిన ప్రణాళికలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తెలిపారు.

# పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ల ప్రధాన ధ్యేయం: యార్లగడ్డ



గన్నవరం (చైతన్యరథం): పేదల ఆకలి తీర్చడమే అన్నా క్యాంటీన్ల ప్రధాన ధ్యేయమని, గన్నవరం నియోజకవర్గ అభివృద్ధిని మరింత వేగవంతం చేసే దిశగా నిరంతరం కృషి చేస్తున్నామని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. గన్నవరం బాయ్స్ హైస్కూల్ మైదానం పక్కన ఏర్పాటు చేసిన అన్నా క్యాంటీన్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం కూటమి నాయకులతో కలిసి స్వయంగా పేదలకు అన్నం వడ్డించారు. అనంతరం ఆటో కార్మికులతో కలిసి భోజనం చేశారు. ఉంగుటూరు మండలం నందమూరు గ్రామానికి చెందిన మాధురి అనే విద్యార్థి తాను దాచుకున్న పాకెట్ మనీ నుంచి రూ.2,500 విశ్రాంత అధ్యాపకుడు మద్దుకూరి విజయ్‌కుమార్ రూ.లక్షలను అన్న క్యాంటీన్ నిర్వహణ కోసం విరాళంగా అందించారు. పేదలకు ఉపయోగపడే కార్యక్రమానికి స్వచ్ఛందంగా విరాళాలు అందించిన వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన అన్నా క్యాంటీన్లలో గన్నవరం కేంద్రం 277వదని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కేంద్రం ద్వారా రోజూ సుమారు 400 మందికి ఉదయం నాణ్యమైన అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించనున్నట్లు చెప్పారు.

# పల్నాడు అభివృద్ధికి స్ఫూర్తి ప్రదాత కోడెల శివప్రసాదరావు

**●ప్రజల హృదయాల్లో కోడెల చిరస్మరణీయుడు: టీడీపీ జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సైదా**



నరసరావుపేట (చైతన్యరథం): పల్నాడు అభివృద్ధికి స్ఫూర్తి ప్రదాతగా, ప్రజల కోసం నిరంతరం పనిచేసిన మహానేత డాక్టర్ కోడెల శివప్రసాదరావు ప్రజల హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయారని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు షేక్ జానీ సైదా అన్నారు. నరసరావుపేటలోని పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో తొలి శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు 7వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా షేక్ జానీ సైదా మాట్లాడుతూ.. సామాన్య కుటుంబం నుంచి స్వయంకృషితో రాజకీయ, సామాజిక రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదిగిన వ్యక్తి డాక్టర్ కోడెల శివప్రసాదరావు అని కొనియాడారు. వైద్య వృత్తిలో పేదలకు అందుబాటులో ఉండే వైద్యుడిగా సేవలందిస్తూ 'రూపాయి డాక్టర్'గా ప్రజల అభిమానాన్ని పొందారని గుర్తు చేశారు. అరాచకాలు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా నిలిచి ప్రజల కోసం పోరాడిన ధైర్యవంతుడైన నాయకుడని అన్నారు. అన్న ఎన్టీఆర్ పిలుపుతో తెలుగుదేశం పార్టీలోకి వచ్చి, పార్టీ అప్పగించిన ప్రతి పదవికి వన్నె తెచ్చిన నాయకుడు కోడెల అని పేర్కొన్నారు. నరసరావుపేట అభివృద్ధిలో కోడెల శివప్రసాదరావు పాత్ర మరువలేనిదని అన్నారు. కోటప్పకొండ అభివృద్ధి, స్టేడియం, టౌన్‌హాల్, పట్టణంలోని రహదారులు, పచ్చదనం వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన కృషి చేశారని తెలిపారు. పల్నాడులో ఫ్యాక్షన్ రాజకీయాలకు చరమగీతం పాడేందుకు ఆయన చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు. ప్రజా సేవ, అభివృద్ధి, పార్టీ పట్ల నిబద్ధత వంటి అంశాల్లో కోడెల శివప్రసాదరావు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తారని షేక్ జానీ సైదా పేర్కొన్నారు.

# ప్రపంచ రికార్డు సాధించిన దూండి గణేష్...



విజయవాడ (చైతన్యరథం) రాష్ట్రంలోనే అతి పెద్ద మట్టి వినాయకుడిగా దూండి గణేష్ రికార్డు సాధించడం హర్షణీయమని రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ దూండి రాకేష్ తెలిపారు. విజయవాడ విద్యాధరపురం, సితార గ్రౌండ్ నందు ఏర్పాటు చేసిన దూండి గణేష్ ప్రపంచ రికార్డు సాదించిందని, ప్రధానంగా మట్టి మరియు పర్యావరణ హిత పదార్థాలను ఉపయోగించి, అద్భుతమైన 72 అడుగుల ఎత్తైన "శ్రీ పంచముఖ వరసిద్ధి మహా మట్టి గణపతి" విగ్రహాన్ని నిర్మించి, "అత్యంత ఎత్తైన పర్యావరణ హిత గణేష్ విగ్రహం" అనే విశిష్ట ప్రపంచ రికార్డు బిరుదును సాధించడం ఆనందంగా ఉందన్నారు. ఈ విగ్రహ నిర్మాణం జూలై 9వ 2026న ప్రారంభమై 12 సెప్టెంబర్ 2026కు విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందని, ఈ విషయాన్ని గుర్తించిన ప్రపంచ రికార్డు సాధన సభ్యులు బుధవారం అందుకు సంబంధించిన సర్టిఫికేట్ అందజేశారని అన్నారు. ఈ విశిష్టమైన విజయాన్ని ఇంజీనియస్ చార్మ్ వరల్డ్ రికార్డ్స్ గర్వంగా ధృవీకరించి, గుర్తించి మరియు సత్కరించింది. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్, దూదేకుల కార్పొరేషన్ చైర్మన్, పశ్చిమ నియోజకవర్గం నాయకులు నాగుల్ మీరా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం. ఎస్. భేగ్ తమ అనుచరులతో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

# ఎన్టీఆర్ భరోసా పెన్షన్ దరఖాస్తు సెప్టెంబర్ 18 వరకు పెంపు

**●పెన్షన్‌కు అర్హులైన వారెవరూ అవకాశం కోల్పోవద్దు : ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ**



వినుకొండ (చైతన్యరథం): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం కూటమి ప్రభుత్వం ఈ నెల 18 వరకు గడువు పెంచారని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ... పార్టీలకు కులమతాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అర్హులైన వారు చివరి తేదీ ఈ నెల 18 వరకు వేచి ఉండకుండా సంబంధిత సచివాలయ సిబ్బందిని సంప్రదించి అవసరమైన ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా ప్రజాప్రతినిధులు, MPDO అధికారులు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించాలని చీఫ్ విప్ జీవీ సూచించారు.

# పొన్నూరు పట్టణ సమగ్ర అభివృద్ధికి రూ.22.10 కోట్ల నిధులు

**●అమృత్ 2.0 కింద తాగునీటి సరఫరా, నీటి వనరుల పునరుద్ధరణ పనులు**

**●అధికారులతో సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్**



పొన్నూరు (చైతన్యరథం): పట్టణ ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, సురక్షితమైన తాగునీటి సరఫరా అందించాలనే లక్ష్యంతో అమృత్ 2.0 పథకం కింద ప్రభుత్వం రూ.22.10కోట్ల నిధులు మంజూరు చేయడం పట్ల పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ హర్షం వ్యక్తం చేశారు. నిధుల మంజూరు అనంతరం చేపట్టాల్సిన పనులు, వాటి అమలు విధానం, నాణ్యతా ప్రమాణాలు, పనుల పురోగతి తదితర అంశాలపై పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్, పొన్నూరు మున్సిపల్ కమిషనర్ రమేష్ బాబు, డీఈ వెంకయ్య, సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా పనులను సమగ్రంగా చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పనుల అమలులో సమన్వయంతో ముందుకు సాగాలని, నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని సూచించారు.

**రూ.19.06 కోట్లతో తాగునీటి సరఫరా ప్రాజెక్టు**

అమృత్ 2.0 పథకం కింద మంజూరైన మొత్తం నిధుల్లో రూ.19.06 కోట్లను తాగునీటి సరఫరా ప్రాజెక్టుకు కేటాయించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా... 2,000 కిలోలీటర్ల సామర్థ్యంతో 3 నూతన ట్యాంకుల నిర్మాణం, 5 కిలోమీటర్ల మేర కొత్త పంపింగ్ మెయిన్ పైప్‌లైన్ నిర్మాణం, 25 కిలోమీటర్ల మేర కొత్త డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్ నెట్‌వర్క్ ఏర్పాటు, పొన్నూరు పట్టణంలోని 5,725 గృహాలకు నూతన హౌస్ సర్వీస్ కనెక్షన్లు ఏర్పాటు చేయనున్నారు.

**రూ.3.04 కోట్లతో నీటి వనరుల పునరుద్ధరణ**

పట్టణ పరిధిలోని నిరుపయోగంగా ఉన్న నీటి వనరులు, చెరువులను పునరుద్ధరించి, వాటి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు సుందరీకరణ చేపట్టేందుకు రూ.3.04 కోట్ల నిధులు కేటాయించారు. ఈ పనుల ద్వారా పట్టణంలో నీటి వనరుల సంరక్షణ, భూగర్భ జలాల పెంపు, పర్యావరణ పరిరక్షణకు మరింతగా దోహదపడే అవకాశం ఉంది. పొన్నూరు పట్టణ అభివృద్ధికి ప్రభుత్వం మంజూరు చేసిన ఈ రూ.22.10 కోట్ల నిధులను సద్వినియోగం చేసుకుంటూ పనులను వేగవంతంగా ప్రారంభించి, ప్రజలకు త్వరితగతిన ఫలితాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అధికారులకు సూచించారు.

# టీఎన్‌టీయూసీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా ఎంపికైన బొండా ఉమాకు టీఎన్‌టీయూసీ నేతల సత్కారం



విజయవాడ (చైతన్యరథం): తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌గా నియమితులైన విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొండా ఉమామహేశ్వరరావుని 64వ డివిజన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. రాష్ట్ర టీఎన్‌టీయూసీ ఉపాధ్యక్షులు పరుచూరి ప్రసాద్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ సురవరపు నాగరాజు ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ... శాసనసభలో కార్మికుల హక్కుల కోసం గళం వినిపించే నాయకుడికి ఈ పదవి దక్కడం అభినందనీయమని, ఆయన నాయకత్వంలో టీఎన్‌టీయూసీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి ధన్యవాదాలు తెలిపిన బొండా ఉమా, కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, రాజా లింగం, పైడేశ్వరరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-4
(ఒంగోలు, నెల్లూరు, రాజంపేట, తిరుపతి, చిత్తూరు)
చైతన్యరథం

## కూటమితోనే అభివృద్ధి సాధ్యం : గొట్టిపాటి లక్ష్మీ

●రూ. 1.96 కోట్లతో రహదారి పనులకు శంకుస్థాపన



దర్శి (చైతన్యరథం): 1.96 కోట్లతో దొనకొండ – గజ్జలకొండ రోడ్డు వయా ఇండ్లచెరువు రోడ్డుకు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ, టీడీపీ యువనాయకులు కడియాల లలిత్ సాగర్‌తో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు. దొనకొండ మండలం, దొనకొండ – గజ్జలకొండ రోడ్డు వయా ఇండ్ల చెరువు రోడ్డుకు రూ. 1.96 నిధులు మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. కూటమి పాలనలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి వైపు ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దొనకొండ మండల టీడీపీ అధ్యక్షులు మోడీ ఆంజనేయులు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు నాగులపాటి శివకోటేశ్వరరావు, దొనకొండ టౌన్ టీడీపీ అధ్యక్షులు షేక్ తోహిద్ అంజుమ్, నూనె విజయ్ కుమారి, రమణ యాదవ్, చెన్నయ్య, మండలంలోని వివిధ హోదాల్లో ఉన్న టీడీపీ సీనియర్ నాయకులు, క్లస్టర్లు, యూనిట్ బూత్ ఇన్‌ఛార్జ్‌లు, గ్రామ పార్టీ అధ్యక్షులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

## ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరాతం

● మదనపల్లె అభివృద్ధిపై ఎమ్మెల్యే షాజహాన్ భాషా ప్రకటన



మదనపల్లె (చైతన్యరథం): మదనపల్లె అభివృద్ధిపై ఎమ్మెల్యే యం.షాజహాన్ భాషా కీలక ప్రకటన చేశారు. రింగ్ రోడ్డు నిర్మాణం సుమారు రూ. 100 కోట్లతో చేపట్టాల్సిన భారీ ప్రాజెక్ట్ అని, ఇలాంటి పెద్ద ప్రాజెక్టులు పూర్తి కావడానికి కొంత సమయం పడుతుందని వివరించారు. మదనపల్లె నుంచి నిమ్మనపల్లె, రామసముద్రం వెళ్లే ప్రధాన రహదారులను డబుల్ రోడ్లుగా విస్తరించే చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. గతంలో అధ్వానంగా ఉన్న రోడ్లను సింగిల్ రోడ్లుగా నాణ్యతతో నిర్మించామని, తదుపరి దశలో డబుల్ రోడ్డు పనులు చేపడతామని చెప్పారు. రామసముద్రం, నిమ్మనపల్లె ప్రాంతాలకు హంద్రీ–నీవా కాలువ ద్వారా నీటిని అందించే అంశంపైనా సమావేశంలో ప్రస్తావించారు. నీటి అనుసంధానానికి సంబంధించి తదుపరి కార్యాచరణ కొనసాగుతోందని, ఇచ్చిన హామీ మేరకు నీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మదనపల్లెను టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళికలు ఉన్నాయని నాయకులు వెల్లడించారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ప్రకటనకు సంబంధించిన పత్రాలను మీడియాకు చూపించారు. పర్యాటక అభివృద్ధికి అవసరమైన మార్గదర్శకాలను రూపొందించే ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని కాంట్రాక్టర్లకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు. పనుల్లో క్వాలిటీ, స్టాండర్డ్స్ తప్పనిసరిగా పాటించాలని సూచించినట్లు వెల్లడించారు. మొత్తంగా రహదారుల విస్తరణ, సాగునీటి సౌకర్యం, పర్యాటక అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించిందని నాయకులు తెలిపారు.

## భూములకు ఖచ్చితత్వంతో సరిహద్దులు నిర్ణయించుటమే రీసర్వే ముఖ్య ఉద్దేశం : ఎమ్మెల్యే కందుల



మర్కాపురం (చైతన్యరథం): మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి మార్కాపురం మండలంలోని దరిమడుగు గ్రామంలో రీ సర్వే గ్రామసభలో పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో కండపురాయికి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో రైతు పట్టాదారు పాసుపుస్తకాలపై జగన్ బొమ్మ ముద్రించుకున్నారని దానితో రైతుల్లో తెలియని అయోమయం గందరగోళం భయం కూడుకున్నదని దాన్ని తొలగించడమే ధ్యేయంగా ఇప్పుడు గ్రామాల్లో కచ్చితత్వంతో భూములకు రీ సర్వే నిర్వహించి పట్టాదారు పాస్ పుస్తకాలను ప్రభుత్వ రాజ ముద్రతో ముద్రించి ఇస్తారని అన్నారు. ఈ ప్రాంతం వెలిగొండ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలోకి వస్తుందని తద్వారా ఈ ప్రాంతంలో పండ్ల మొక్కలు అభివృద్ధి చేసి హార్టికల్చర్ హబ్‌గా తయారు చేద్దాం అని అన్నారు. ఇది రైతు ప్రభుత్వం అని ఈ ప్రభుత్వం రైతులు అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఉద్యోగం కోరుకునే స్థాయి నుంచి ఉపాధి కల్పించే స్థాయికి యువత ఎదగాలి

● సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టితో రాష్ట్రానికి పెట్టుబడులు : ఎంపీ బైరెడ్డి శబరి

నంద్యాల (చైతన్యరథం): నా స్వస్థలమైన నంద్యాలలో, భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే యువతీ యువకుల మధ్య ఈ సదస్సును ప్రారంభించడం నాకెంతో సంతోషాన్ని ఇస్తోందని, ఒక రాష్ట్రంలోనైనా, దేశంలోనైనా శాశ్వత మార్పు రావాలంటే అది యువశక్తితోనే సాధ్యమని, అందుకే మా మంచి కూటమి ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి భద్రతకు పెద్దపీట వేస్తోందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. బుధవారం నంద్యాల శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాలలో యువత భవిష్యత్ కు భరోసా అను సదస్సును ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ప్రారంభించారు. ఈ సందర్భంగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మాట్లాడుతూ నా స్వస్థలమైన నంద్యాలలో భవిష్యత్ భారతాన్ని తీర్చిదిద్దే యువతీ యువకుల మధ్య ఈ సదస్సు ప్రారంభించడం నాకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందోందని, రాష్ట్రంలో నైనా, దేశంలో నైనా శాశ్వత మార్పు రావాలంటే అది యువ శక్తి తోనే సాధ్యం అని, మా మంచి ఉమ్మడి ప్రభుత్వం యువత నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి భద్రతకు పెద్ద పీఠ వేస్తోందని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. ఒకప్పుడు రాయలసీమ అనగానే తీవ్ర వర్షాభావం, రైతుల కష్టాలు, ఉపాధి లేక వలసలు గుర్తుకొచ్చేవి. కానీ నేడు పరిస్థితులు మారాయని. మన ప్రాంతం కరువుతో పోరాడే స్థితి నుంచి అభివృద్ధి వైపు పరుగులు తీస్తోందని. పరిశ్రమల రాకతో రాయలసీమ ముఖచిత్రం పూర్తిగా మారిపోతోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యా–ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ గ్లోబల్ ఇన్వెస్టర్లతో సంప్రదింపులు జరుపుతూ రాష్ట్రాన్ని పెట్టుబడుల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. రాష్ట్రానికి వస్తున్న భారీ పారిశ్రామిక పెట్టుబడుల ద్వారా స్థానిక యువతకు వేలాది ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రానున్నాయనీ. రాజకీయాల్లో విలువలు, అభివృద్ధిలో పారదర్శకత ఉండాలని కోరుకునే నేటి తరం.. దేశ నిర్మాణంలోనూ బాధ్యతాయుతంగా భాగస్వామ్యం కావాలని. మీ ఓటు హక్కు ద్వారా సమాజ భవితవ్యాన్ని మార్చే నాయకత్వాన్ని ఎన్నుకోండని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు.



### విద్యార్థులతో ముఖాముఖి మరియు వ్యవస్థాపకతపై సందేశం

ప్రసంగం అనంతరం ఎంపీ విద్యార్థులతో నేరుగా సంభాషించారు. ఉన్నత విద్య, పోటీ పరీక్షలు, స్టార్టప్ ఆలోచనలు, ప్రాంతీయ పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆమె వివరణాత్మక సమాధానాలు ఇచ్చారు. ఈ సందర్భంగా స్థానిక యువ ఔత్సాహిక పారిశ్రామికవేత్త, 'మీతో' (మీతో) యాప్ వ్యవస్థాపకుడు న్యాస పవన్ కృషిని ప్రత్యేకంగా అభినందిస్తూ.."ఉద్యోగం కోరుకునే స్థాయి నుంచి పలువురికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగడమే నిజమైన విజయం; విద్యార్థులు స్టార్టప్‌లు, ఆవిష్కరణల వైపు ముందడుగు వేయాలి" అని పిలుపునిచ్చారు.

## పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చ

● మైలవరం మండల టీడీపీ విస్తృత సమావేశం... పాల్గొన్న ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్



మైలవరం (చైతన్యరథం): మైలవరం మండల తెలుగుదేశం పార్టీ విస్తృత సమావేశం బుధవారం మైలవరంలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశానికి మైలవరం శాసనసభ్యులు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వసంత వెంకట కృష్ణప్రసాదు ముఖ్య అతిథిగా హాజరై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల పరిధిలో పార్టీ కార్యకలాపాల నిర్వహణ, గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం వంటి అంశాలపై చర్చించారు. గ్రామస్థాయిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు సూచించారు. ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీ కార్యక్రమాలను సమన్వయంతో నిర్వహించాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సమావేశంలో సూచించారు. అలాగే రాబోయే రోజుల్లో పార్టీ కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరాన్ని సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో మైలవరం మండల టీడీపీ నాయకులు, గ్రామాల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొని పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, స్థానిక సమస్యలు, భవిష్యత్ పార్టీ కార్యక్రమాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

## చంద్రబాబునాయుడు నాయకత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి : కిలారి రాజేష్

మంగళగిరి (చైతన్యరథం): టీడీపీ జాతీయ కార్యాలయంలో నిర్వహిస్తున్న వినాయక చవితి వేడుకల్లో మూడో రోజు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిలారి రాజేష్ ప్రత్యేకంగా పాల్గొని శ్రీ విఘ్నేశ్వర స్వామివారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామివారిని ప్రార్థించారు. చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజలకు సుభిక్షం కలగాలని కిలారి రాజేష్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బుచ్చి రామ్ ప్రసాద్ పాల్గొన్నారు.



## వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, పర్యావరణహితంగా జరుపుకోవాలి

● వినాయక మండపాలను సందర్శించిన ఎంపీ కేశినేని

విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గం 44,45వ డివిజన్ వినాయక చవితి సందర్భంగా విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలోని 44, 45వ డివిజన్లలో ఏర్పాటు చేసిన వివిధ వినాయక మండపాలను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, వినాయకుని ఆశీస్సులు పొందారు.విజయవాడ నగరం మొత్తం వినాయక చవితి వేడుకలతో సందడిగా మారిందని ఎంపీ చిన్ని అన్నారు. ఎటు చూసినా వినాయక మండపాలు, భక్తుల సందడి కనిపిస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా, భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగ వినాయక చవితి అని పేర్కొన్నారు.చాలాచోట్ల పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడం మంచి పరిణామమని ఎంపీ చిన్ని అన్నారు. మట్టి విగ్రహాల ఏర్పాటుతో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని సూచించారు. భక్తి, సంప్రదాయాలతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం అభినందనీయమన్నారు.లంబోదరుడైన శ్రీ వినాయకుని ఆశీస్సులు ప్రతి ఒక్క కుటుంబంపై ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. విఘ్నాలను తొలగించి ప్రతి ఒక్కరి జీవితంలో శుభాలు, సంతోషాలు నింపాలని గణనాథుడిని ప్రార్థించినట్లు తెలిపారు.

# ఎన్నికలొస్తున్నాయని దీక్షల డ్రామాలకు తెర లేపారు

●మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డిపై ఎమ్మెల్యే పరిటాల సునీత ఆగ్రహం

●నీ అసమర్ధత వల్లే పేరూరు ప్రాజెక్టు పూర్తి కాలేదని మండిపాటు

●రాప్తాడులో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సునీత

●సొంత ఊరికి రోడ్డు, విద్యుత్ సబ్ స్టేషన్ తెచ్చుకోలేని అసమర్ధుడు ప్రకాష్ రెడ్డి



రాప్తాడు (చైతన్యరథం): స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డితో పాటు వైసీపీ నాయకులు దీక్షల పేరుతో డ్రామాలకు తెరలేపారని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత విమర్శించారు. రాప్తాడు మండలం, హార్మోని సిటీ సమీపంలో 3కోట్ల నిధులతో నిర్మించిన, 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. స్థానిక ప్రజలు, టిడిపి నాయకులు ఎమ్మెల్యే సునీతకు ఘన స్వాగతం పలికారు. అనంతరం అధికారులు, స్థానిక నాయకులతో కలిసి సబ్ స్టేషన్ ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక...తోపుదుర్తి, గొరిదిండ్ల, ముత్తవకుంట్ల విద్యుత్ సబ్ స్టేషన్లను నిర్మించి ప్రారంభించామన్నారు. రాప్తాడు విద్యుత్ సబ్ స్టేషన్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడం వల్ల స్థానికంగా విద్యుత్ సమస్యలు ఉండవని అన్నారు. త్వరలో బండమీదపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. ఆలమూరు, వేపకుంట విద్యుత్ సబ్ స్టేషన్ లు మంజూరవుతున్నాయని.. ప్యాదిండి, న్యామద్దల, దాదులూరు, కొండపల్లి, సోమలదొడ్డి, మన్నీలలో విద్యుత్ సబ్ స్టేషన్ల అవసరం ఉందన్నారు. రైతులకు నిరంతర విద్యుత్ లభించడం వలన పంటల సాగుకు ఎలాంటి అవాంతరాలు ఉండవన్నారు. ఇప్పటివరకు రైతులకు సుమారు 11వందల ట్రాన్స్ ఫార్మర్లతో పాటు కండక్టర్ కేబుల్ అందజేశామని, మంత్రి గొట్టిపాటి రవికుమార్ తో పాటు అధికారులు ఎప్పుడు ఏమి అడిగినా వెంటనే స్పందిస్తున్నారని అన్నారు.

ప్రజలు కూడా సోలార్ ఏర్పాటు చేసుకోవడం వల్ల విద్యుత్ ఆదా చేసుకోవచ్చున్నారు. ఎల్-నినో ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడడంతో పాటు, ప్రస్తుతం రాప్తాడు నియోజకవర్గంలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సమస్య ఉందని అయితే గ్రామాల్లో ఎక్కడ తాగునీటికీ ఇబ్బందులు లేకుండా చూస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక తీసుకొని నీటికి విద్యుత్‌కి సమస్య లేకుండా చేస్తున్నారన్నారు. అయితే అధికారంలో ఉండగా ఏమీ చేయని కొందరు నాయకులు ఇప్పుడు జల దీక్షల పేరుతో నాటకాలు ఆడుతున్నారంటూ విమర్శలు చేశారు. ప్రకాష్ రెడ్డి గత ఐదేళ్లలో పేరూరు ప్రాజెక్టుకు నీరు అందించే పనులు పూర్తి చేసి ఉండి ఉంటే ఈరోజు ఇలాంటి పరిస్థితి ఉండేది కాదన్నారు. అధికారంలో ఉండగా కనీసం సొంత గ్రామానికి రోడ్డు, విద్యుత్ సబ్ స్టేషన్ తెచ్చుకోలేని వ్యక్తి ఈరోజు మాపై విమర్శలు చేస్తున్నారన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఎక్కడ తాగునీటి సమస్యకు ఇబ్బంది లేదన్నారు. హంద్రీ-నీవాతో పాటు పీఏబీఆర్ ద్వారా వీలైనంత చెరువులకు నీరు ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరు నీటి విషయంలో, ప్రజలకు మంచి చేసే విషయంలో బాగా పనిచేస్తున్నారో ఆ పార్టీ నాయకులు కూడా ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. ప్రజలు అలాంటి వారిని గుర్తించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత స్పష్టం చేశారు....

# తిరుమలలో వేంకటేశ్వరస్వామి స్మరణ తప్ప మరొకటి వినపడకూడదు

● ఎస్వీ మ్యూజియం, ఈవీ బస్సులను ప్రారంభించిన సీఎం చంద్రబాబు



తిరుపతి (చైతన్యరథం): తిరుమలలో ముఖ్యమంత్రి చంద్రబాబు రెండో రోజు పర్యటించారు. పర్యటనలో భాగంగా పలు ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో సీఎం పాల్గొన్నారు. తొలుత వైకుంఠం క్యూకాంప్లెక్స్ వద్ద పిలిగ్రిమ్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ప్రారంభించారు. అనంతరం తిరుమలలో సీఎం చంద్రబాబు ఉచిత ధర్మరథం బస్సులను ప్రారంభించారు. రిలయన్స్, భారత్ బయోటెక్ సంస్థలు ఈవీ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానానికి విరాళంగా అందించాయి. ఈ ఈవీ బస్సులను నారాయణగిరి ఉద్యానవనాల వద్ద సీఎం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం సీఎం చంద్రబాబు బస్సులో కొద్ది దూరం ప్రయాణించారు. నారాయణగిరి ఉద్యానవనాల నుంచి ఎస్వీ మ్యూజియం వరకు బస్సులో ఆయన ప్రయాణం సాగింది.

**ఎస్వీ మ్యూజియం ప్రారంభం:**

తిరుమల శ్రీవారి భక్తులకు సరికొత్త ఆధ్యాత్మిక అనుభూతిని పంచేందుకు అత్యాధునిక హంగులతో సిద్ధమైన శ్రీ వేంకటేశ్వర మ్యూజియాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. ఎస్వీ మ్యూజియంలో జీ౦3 అంతస్తులు, 19 గ్యాలరీలు, 14 వేల కళాఖండాలు ఉన్నాయి. తిరుమల విశిష్టతను భక్తులు తిలకించేలా శ్రీవారి నిత్య కైంకర్యాలు, పూజా కార్యక్రమాలు త్రీడీ వీడియో ప్రదర్శన కోసం సెంటర్? ఏర్పాటు చేశారు. మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో రవిచంద్ర, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఎస్వీ మ్యూజియంలోని విశేషాలను ముఖ్యమంత్రి పరిశీలించారు.

**ఏఐ వీడియో రూపంలో కల్యాణ మహోత్సవ ఘట్టాలు:**

శ్రీవారి క్షేత్ర మహత్యం, తిరుమల పవిత్రత, విశిష్టతలను భక్తులకు కళ్లకు కట్టినట్లు వివరించేలా తీర్చిదిద్దిన ఎస్వీ మ్యూజియాన్ని సీఎం చంద్రబాబు తిలకించారు. చారిత్రక అంశాలు, ఆధ్యాత్మిక సంపద మేళవింపుగా సాగిన ఈ ప్రదర్శనలో పలు ప్రత్యేక ఆకర్షణలు విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు సహా పూర్వపు రాజులు శ్రీవారికి సమర్పించిన చారిత్రక ఆభరణాల నమూనాలు, శ్రీవారికి ధరింప చేసే వివిధ కిరీటాలు, ఆభరణాలను త్రీడీ మోడల్?లో చిత్రీకరించి వాటిని ప్రదర్శించేలా మ్యూజియంలో ఏర్పాటు చేశారు. ఆధునిక సాంకేతికతతో పానోరమిక్ స్క్రీన్‌పై ఏఐ వీడియో రూపంలో శ్రీవారి కల్యాణ మహోత్సవ ఘట్టాలను సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా వీక్షించారు.

**తిరుమల ఏడుకొండల త్రీడీ మోడల్:**

తిరుమల కొండపై వివిధ ఆలయాలు, శిల్పాలు, రమణీయమైన ప్రకృతికి సంబంధించి భౌగోళిక విశిష్టతలను తెలిపేలా మ్యూజియంలో టీటీడీ ప్రదర్శన ఏర్పాటు చేసింది. భక్తులకు అవగాహన వచ్చేలా తిరుమల ఏడు కొండల త్రీడీ మోడల్?ను కూడా అందుబాటులో ఉంచింది. తిరుమల దివ్య సన్నిధికి చేరుకుని ఆయుధాలను త్యజించి, ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్న నాటి రాజుల ఆయుధాలను ప్రదర్శనలో ఉంచారు. పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులతో పాటు పలువురు భక్తాగ్రేసరులు స్వామివారి సంకీర్తనకు ఉపయోగించిన పురాతన సంగీత వాయిద్యాలను ఏర్పాటు చేశారు. వీటిన్నింటిని సీఎం చంద్రబాబు తిలకించారు. అనంతరం సీఎం అధికారులతో సమీక్ష నిర్వహించారు. శ్రీవారి భక్తుడిగా పనిచేస్తూ అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తాను 1999లో ప్రారంభించిన మ్యూజియం, ఇవాళ ఆధునికీకరించినట్లు చెప్పారు. వేంకటేశ్వరస్వామి చరిత్ర అందరికీ అర్థమయ్యేలా మ్యూజియం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇలాంటి కార్యక్రమాలకు అండగా నిలిచిన ట్రస్టుకు అభినందనలు తెలిపారు. "రాబోయే ఐదేళ్లూ నిర్వహణ బాధ్యత ట్రస్టుకే అప్పగిస్తున్నాం. ప్రతి భక్తుడికి భద్రత ఇచ్చేందుకు ఎల్ఐసీ తరపున రూ.2 లక్షల బీమా అందిస్తున్నాం. ఆధార్ ఆధారిత పేపర్‌లెస్ క్లెయిమ్ తీసుకొచ్చాం. తిరుమలలో పవిత్ర భావం ఉండాలి. రాజకీయాలకు వేదిక కాకూడదు. తిరుమలలో వేంకటేశ్వరస్వామి స్మరణ తప్ప మరొకటి వినపడకూడదు. ఇక్కడికి వచ్చే భక్తుడు ఏ విషయంలోనూ ఇబ్బంది పడకూడదు. ఇవాళ కొత్తగా 32 ఈవీ బస్సులు ప్రారంభించాం. రిలయన్స్ 25, భారత్ బయోటెక్ సంస్థ ఏడు బస్సులు ఇచ్చింది. సేవాభావంతో ముందుకొచ్చే ప్రతి ఒక్కరికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే 12 లక్షల మంది శ్రీవారి సేవకులుగా నమోదు చేసుకున్నారు. వీరిలో వైద్య, విద్యా సేవకులు వస్తున్నారు" అని చంద్రబాబు తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా : మంత్రి సవితమ్మ

●కక్ష సాధింపు రాజకీయాలు మా విధానం కాదు

●సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం అమలు చేశాం



పెనుకొండ (చైతన్యరథం): నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర చేనేత మరియు బీసీ సంక్షేమ శాఖల మంత్రి, పెనుకొండ నియోజకవర్గ శాసనసభ్యురాలు సవితమ్మ తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 26 నెలల కాలంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని అన్నారు. పెనుకొండ మున్సిపాలిటీ లో 17, 18వ వార్డుల్లో మంత్రి సవితమ్మ పర్యటించారు. ఈ సందర్భంగా 35 సంవత్సరాలుగా ఉన్న డ్రైనేజీ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తి చేయడంతో స్థానిక మహిళలు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం పట్టణంలో సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం లభించడంతో స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.ప్రయాణికుల సౌకర్యార్థం అంబేద్కర్ సర్కిల్‌లో సొంత నిధులతో ఏర్పాటు చేసిన నూతన బస్ షెల్టర్‌ను మంత్రి పరిశీలించారు. బస్ షెల్టర్‌ను ప్రజలకు మరింత ఉపయోగకరంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం జూనియర్ కళాశాల మైదానాన్ని మంత్రి పరిశీలించారు. కాలేజీ గ్రౌండ్‌లో ఉన్న సమస్యలు, అభివృద్ధి చేయాల్సిన అంశాలపై అధికారులతో చర్చించారు. విద్యార్థులు, యువతతో పాటు ప్రజలకు ఉపయోగపడేలా మైదానాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అనంతరం మీడియాతో మాట్లాడుతూ... నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన 1,200 కుటుంబాలకు ఇంటి పొజిషన్ పత్రాలు అందించేందుకు చర్యలు చేపట్టామని, స్థలం ఉన్న అర్హులైన కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

పెనుకొండ మున్సిపాలిటీ అభివృద్ధికి ఇప్పటికే ?20 కోట్ల నిధులు మంజూరయ్యాయని, త్వరలోనే ఆయా నిధులతో అభివృద్ధి పనులను చేపడతామని మంత్రి సవితమ్మ తెలిపారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని చెప్పారు.ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు."కేసులు పెట్టడం మా నైజం కాదు.. కక్ష సాధింపు రాజకీయాలు చేయడం మా విధానం కాదు. గతంలో అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నాయకులు, అప్పటి మంత్రులు తమ సొంత కార్యకర్తలపైనా కేసులు పెట్టిన సందర్భాలు ఉన్నాయి. మేము మాత్రం కక్ష సాధింపు రాజకీయాలకు దూరంగా ఉంటూ అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యత ఇస్తున్నాం" అని మంత్రి సవితమ్మ స్పష్టం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీల్లో 90 శాతం హామీలను అమలు చేశామని మంత్రి తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు.మేము చేసిన అభివృద్ధి పనులను ప్రజల ముందుంచి, అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను అడుగుతాం. ప్రజల కోసం చేసిన పనులే మా బలం. ప్రజలకు సేవ చేయడమే మా లక్ష్యం అని మంత్రి సవితమ్మ పేర్కొన్నారు. నియోజకవర్గంలో రానున్న రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పింఛన్ దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంపు

● రేపే చివరి తేది... అవకాశాన్ని ఉపయోగించుకోవాలి : మంత్రి కొండపల్లి



అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పథకం కింద కొత్త పింఛన్‌ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వాస్తవానికి దరఖాస్తులకు గడువు నేటితో ముగుస్తుండగా.. మరో రెండు రోజుల పాటూ పొడిగించినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.. ఈ నెల 18వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వాస్తవానికి ఈ నెల 7 నుంచి 16 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించారు. శనివారం, ఆదివారం, సోమవారం సెలవులు కావడం.. అర్హులైన మరికొందరు దరఖాస్తు చేసుకోవాల్సి ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునే గడువు పెంచడంతో ఊరట దక్కింది. రాష్ట్రంలో అర్హులైన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, చేనేత కార్మికులు, మత్స్యకారులు, కల్లుగీత కార్మికులు, డప్పు కళాకారులు, సంప్రదాయ చెప్పుల తయారీదారులు, ట్రాన్స్‌జెండర్లు సహా ఇతరులకు పింఛన్లు అందిస్తున్నామన్నారు మంత్రి. రాష్ట్రవ్యాప్తంగా స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కేంద్రాల్లో కొత్త పింఛన్ దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ నమోదు, ఇ-కేవైసీ ప్రక్రియ కోసం అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. అర్హులైన వారు దరఖాస్తును అవసరమైన డాక్యుమెంట్లతో కలిపి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు. అక్కడ దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసిన సిస్టమ్ జనరేటెడ్ అక్నాలెడ్జ్‌మెంట్ ఇస్తారని మంత్రి తెలిపారు. మరో రెండు రోజుల దరఖాస్తు గడువు పెంచినందున ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

# మట్టి గణపతే... మహా గణపతి

## తానా, తామా ఆధ్వర్యంలో 'క్లే గణేష' వర్క్‌షాప్







**జార్జియా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా), మెట్రో అట్లాంటా తెలుగు సంఘం (తామా) ఆధ్వర్యంలో జార్జియాలోని ఆల్ఫారెట్టాలోని డిసానా మిడిల్ స్కూల్లో మట్టి వినాయక విగ్రహాల తయారీ వర్క్‌షాప్‌ను విజయవంతంగా నిర్వహించారు. సంప్రదాయం, సృజనాత్మకత, పర్యావరణ స్పృహ, సమాజ స్ఫూర్తిని ఒకే వేదికపైకి తెచ్చిన ఈ వినూత్న కార్యక్రమంలో పిల్లలు, కుటుంబ సభ్యులు సహా 150 మందికి పైగా సభ్యులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ClayGanesha.org భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో... "సేవా భావంతో భక్తి-నాటండి, పూలు వికసించడాన్ని చూడండి!" అనే ఇతివృత్తంతో పర్యావరణహిత విత్తన వినాయక భావనను పాల్గొన్నవారికి పరిచయం చేశారు. సహజమైన మట్టిలో విత్తనాలు కలిపి తయారుచేసిన వినాయక విగ్రహాలను గణేష్ చతుర్థి వేడుకల అనంతరం నాటితే, వాటి నుంచి మొక్కలు పెరిగి పుష్పాలు పూస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమానికి ముఖర్జీ వేములపల్లి నాయకత్వం వహించి ఎంతో అంకితభావంతో సమన్వయం చేశారు. బాబీ భార్య సౌజన్య ఆరేకపల్లి, వారి ఇద్దరు పిల్లలు చురుగ్గా పాల్గొన్నారు. శ్రీనివాస్ రామానాథం, యశ్వంత్ జొన్నలగడ్డ, వినయ్ మద్దినేని, పార్వతి కొంపెల్ల, చైతన్య కొర్రపాటి, తానా, తామా బృందాలతో కలిసి ప్రణాళిక, సమన్వయం, నిర్వహణలో క్రియాశీలక మద్దతు అందించారు. కుటుంబాలు వారికి కేటాయించిన సమయ వేళల ప్రకారం రావడంతో రోజంతా కార్యక్రమం ఎంతో ఘనంగా సాగింది. విరాళాలు అందించి, ఎంతో ఉత్సాహంతో మద్దతుగా నిలిచిన సునీల్ దేవరపల్లికి నిర్వాహకులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. మన సంప్రదాయాలను జరుపుకుంటూనే, భావి తరాలకు సంస్కృతి, సృజనాత్మకత, సమాజ సేవ, పర్యావరణ బాధ్యతలపై అర్థవంతమైన అవగాహన ఎలా కల్పించవచ్చో ఈ కార్యక్రమం అద్భుతంగా చాటిచెప్పింది. మార్గదర్శకత్వం, మద్దతు అందించిన తానా/తామా నాయకత్వానికి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

తానా వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, తామా అధ్యక్షురాలు సునీత పొట్నూరు, మధుకర్ యార్లగడ్డ (తామా చైర్మన్), శేఖర్ కొల్లు (ప్రాంతీయ ప్రతినిధి), సునీల్ దేవరపల్లి (సోషల్ వెల్ఫేర్ కో-ఆర్డినేటర్), భరత్ మద్దినేని (బోర్డు డైరెక్టర్), సోహిని అయినాల (ఉమెన్ సర్వీసెస్ కో-ఆర్డినేటర్ కార్యదర్శి) కార్యక్రమం విజయవంతమయ్యేలా చూశారు. భక్తి, సంప్రదాయం, సేవ కలయికగా ఈ మట్టి వినాయక విగ్రహాల తయారీ వర్క్‌షాప్‌ను మరపురాని జ్ఞాపకంగా మార్చడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ తానా, తామా హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశాయి.











# ఎత్తుకు పైఎత్తు... వ్యూహాలకు ప్రతివ్యూహం

## తానా మిడ్-అట్లాంటిక్ సమ్మర్ చెస్ టోర్నమెంటుకు భారీ స్పందన





**ఫిలడెల్ఫియా:** ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) మిడ్ అట్లాంటిక్ విభాగం నిర్వహించిన సమ్మర్ చెస్ టోర్నమెంటుకు భారీ స్పందన వచ్చింది. ఫిలడెల్ఫియాలోని ఎక్స్‌టన్‌లో నిర్వహించిన టోర్నీలో 100 మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో సగానికిపైగా యూఎస్ చెస్ ఫెడరేషన్ రేటెడ్ ఆటగాళ్లు కావడం విశేషం. ఆటగాళ్ల పోటీతత్వం, నేర్చుకునే తపన, క్రీడాస్ఫూర్తి కనబరిచారు. ఈ టోర్నీని అత్యంత నైపుణ్యం, కచ్చితత్వం, అంకితభావంతో నిర్వహించిన ట్రై-బ్రిడ్జెస్ చెస్ క్లబ్ టోర్నమెంట్ డైరెక్టర్ జాషువా ఆండర్సన్‌కు తానా నాయకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చెస్ టోర్నమెంటు నిర్వహణలో ఆయన అనుభవం, అంకితభావం ఈ టోర్నమెంట్లో పాల్గొన్నవారికి ప్రత్యేకమైన అనుభూతి పంచింది. టోర్నీ విజయవంతం కావడానికి సహకరించిన నాయుడమ్మ యలవర్తి, ప్రసాద్ కస్తూరి, సురేష్ యలమంచి, కృష్ణ నందమూరి, శ్రీధర్ సాదినేని, రంజిత్ మామిడి, చలం పావులూరి, వ్యోమ్ క్రోతపల్లి, ధీరజ్ యలమంచిలికి కూడా తానా టీమ్ ప్రత్యేక ధన్యవాదాలు చెప్పింది. తానా అధ్యక్షుడు డాక్టర్ నరేన్ కొడాలి, ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ లావు, బోర్డు డైరెక్టర్ రవి పొట్లూరి, మిడ్-అట్లాంటిక్ రీజినల్ ప్రతినిధి ఫణి కంతేటి, బెనిఫిట్స్ కో-ఆర్డినేటర్ వెంకట్ సింగు, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ శివ చావ టోర్నమెంటు నిర్వహణకు మద్దతు తెలిపారు. టోర్నమెంటులో పాల్గొన్న ఆటగాళ్లు, వలంటీర్లు, ఇతరులకు తానా మిడ్ అట్లాంటిక్ టీమ్ తరపున అభినందనలు తెలియజేశారు.

**రేటెడ్ ఓపెన్ విజేతలు**

ఫస్ట్ ప్లేస్- సాయి రేయాన్ష్ నగిశెట్టి
సెకండ్ ప్లేస్- హైంధవ్ మురుగేష్
థర్డ్ ప్లేస్- యువిన్ శ్రీనివాసన్

**అండర్-900 రేటెడ్ విజేతలు**

ఫస్ట్ ప్లేస్- ప్రణవ్ కంతేటి
సెకండ్ ప్లేస్- కార్తికేయ కుచ్చర్లపాటి
థర్డ్ ప్లేస్- రిధిక అరవిందకుమార్

**అండర్-500 రేటెడ్ విజేతలు**

ఫస్ట్ ప్లేస్-బోధి రాయ్
సెకండ్ ప్లేస్-విదిత్ కువేల్కర్
థర్డ్ ప్లేస్-నంద వి మేలం

**కే8 అన్ రేటెడ్ విజేతలు**

ఫస్ట్ ప్లేస్-కుశాల్ తడువాయి
సెకండ్ ప్లేస్-శ్రీయాన్ వజ్రాల
థర్డ్ ప్లేస్- అడ్రియన్ బెన్సన్

**9-12 (పెద్దలతో కలిపి) అన్ రేటెడ్ విజేతలు**

ఫస్ట్ ప్లేస్-సునీల్ కొత్త
సెకండ్ ప్లేస్-పునీత్ మద్ది
థర్డ్ ప్లేస్-జీవన్ మర్రిబోయిన







# భాషా వారసత్వాన్ని కాపాడాలి

## తానా-పాఠశాల అధ్యక్షుడు భానుప్రకాష్ పిలుపు

## అమెరికాలో ఘనంగా పాఠశాల విద్యా సంవత్సరం ఆరంభం

**యూఎస్ఏ:** దేశభాషలందు తెలుగు లెస్స అన్న ఆంధ్ర భోజ శ్రీకృష్ణదేవరాయలు వాక్కును నిజం చేస్తూ ప్రాచీన భాషగా, ఇటాలియన్ అఫ్ ది ఈస్ట్‌గా పేర్గాంచిన తేనెలొలుకు భాష మన తెలుగు. ఉత్తర అమెరికాలో వృత్తి ఉపాధి రీత్యా నివసిస్తున్న వేలాది తెలుగు కుటుంబాల చిన్నారులకు తెలుగు నేర్పించే వేదిక తానా-పాఠశాల. 2026-27 సంవత్సరానికి విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులతో ఆన్‌లైన్ సమావేశం నిర్వహించామని పాఠశాల అధ్యక్షుడు భానుప్రకాష్ మాగులూరి తెలిపారు. పలు ప్రశ్నలకు బదులిస్తూ సూచన, సలహాలు స్వీకరిస్తూ కార్యక్రమం ఆద్యంతం గొప్పగా జరిగింది. తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి, కోశాధికారి రాజా కసుకుర్తి విద్యార్థులకు తమ సందేశాలు అందించారు. ప్రథమంగా ఐదేళ్ల పైబడిన చిన్నారులకు పలుకు, అడుగు, పరుగు, వెలుగు విభాగాల్లో సరళంగా తెలుగు భాషను నేర్పిస్తూ, వారికి భాషపై మక్కువ కల్పిస్తూ, సులభ పద్ధతిలో బొమ్మలతో కూడిన పాఠాలను బోధిస్తూ, అంతిమంగా తమ అమ్మ, నాయనమ్మ, తాతలతో తెలుగులో స్పష్టంగా రాస్తూ, చదువుతూ, సంభాషించే స్థాయికి చేర్చడమే 'పాఠశాల' ఆశయం, లక్ష్యం. ఈ వారం అమెరికాలోని పలు పట్టణాల్లో తరగతులను ఆరంభించారు. చిన్నారుల్లో సృజనాత్మకతను పెంచుతూ, సరళ పద్ధతిలో భాషను అనుసంధానిస్తూ ఉపాధ్యాయులు నిరంతరం స్వచ్ఛందంగా కృషి చేస్తున్నారు. వారికి సర్వదా అభినందనలు. 'మనకు తెలిసిన వంద మందికి పాఠశాల వేదికను పరిచయం చేస్తూ ప్రత్యక్ష, ఆన్‌లైన్ తరగతుల్లో నేర్చుకునే విధంగా ప్రోత్సహిద్దాం... భాషే బంధానికి మూలం... తెలుగును పరిరక్షించుకుంటూ మరో తరానికి అందిద్దాం... భాషకు వారసులుగా చరిత్రలో మన వంతు బాధ్యతను నిర్వర్తిద్దాం' అని పాఠశాల నిర్వాహకులు పిలుపునిచ్చారు.



## 'షహజాబ్ భట్టీ నెట్‌వర్క్'పై నిషేధం ఉగ్ర సంస్థగా ప్రకటించిన కేంద్రం



పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న 'షహజాబ్ భట్టీ నెట్‌వర్క్'ను కేంద్ర ప్రభుత్వం నిషేధిత ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. 'చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం' కింద ఈ చర్యలు తీసుకున్నట్లు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. సరిహద్దుల గుండా ఆయుధాలు, పేలుడు పదార్థాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతూ యువతను తీవ్రవాదం వైపు ప్రేరేపిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్య వ్యవస్థను, మత సామరస్యాన్ని దెబ్బతీసేందుకు విద్వేషపూరిత డిజిటల్ కంటెంట్‌ను ఈ నెట్‌వర్క్ వ్యాప్తి చేస్తోందని అమిత్ షా తెలిపారు.

ప్రభుత్వ వివరాల ప్రకారం.. ఎస్‌బీఎన్ అనేది పాకిస్థాన్ కేంద్రంగా పని చేస్తున్న అత్యంత ప్రమాదకరమైన ఉగ్రవాద గ్రూప్. భారత్‌లో పలు బాంబు దాడులు, హత్యల వెనుక ఈ సంస్థ హస్తం ఉంది. పోలీస్, రక్షణ కేంద్రాలతో పాటు మతపరమైన ప్రదేశాలను రెక్కీ చేసేందుకు, గూఢచర్యం కోసం సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు స్థానిక మధ్యవర్తులకు ఈ నెట్‌వర్క్ భారీగా నిధులు సమకూర్చుతోంది. ఢిల్లీ, పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ఈ నెట్‌వర్క్ అధినేత భట్టీపై తీవ్ర స్థాయి కేసులు నమోదయ్యాయి. భారత్ నిషేధించిన ఉగ్ర సంస్థల జాబితాలో ఎస్‌బీఎన్ 46వ స్థానంలో నిలిచింది. పాకిస్థాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్‌కు చెందిన షహజాబ్ భట్టీ ప్రారంభంలో దోపిడీలతో నేర ప్రపంచంలోకి అడుగుపెట్టాడు. ఆ తర్వాత పాక్ నుంచి యూఏఈకి మకాం మార్చి ఈ తీవ్రవాద నెట్‌వర్క్‌ను నడుపుతున్నాడు.

## ఆమె ఎవరో నాకు తెలియదు: ఆదిత్య ఠాక్రే

**ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే కుట్రలు...**

**'ఎక్స్' వేదికగా ఆవేదన**



బాలీవుడ్ నటుడు దివంగత సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా శాలియాన్ మృతి కేసులో సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో తన పేరును చేర్చడంపై మహారాష్ట్ర మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే కుమారుడు, ఎమ్మెల్యే ఆదిత్య ఠాక్రే తొలిసారి స్పందించారు. దిశా శాలియాన్‌ను తాను ఎప్పుడూ కలవలేదని, ఆమె ఎవరో కూడా తనకు తెలియదని సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పష్టం చేశారు. కేవలం తన వ్యక్తిత్వాన్ని, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే ఈ కేసులో ఉద్దేశపూర్వకంగా తన పేరును ముడిపెడుతున్నారని ఆయన మండిపడ్డారు. 'రాజకీయ, వ్యక్తిగత దురుద్దేశాలు కలిగిన కొంతమంది నన్ను లక్ష్యంగా చేసుకున్నారు. ఉద్దేశపూర్వకంగా నా ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎటువంటి ఆధారాలు, వాస్తవాలు లేకుండా ఈ విధంగా దుష్ప్రచారాన్ని సాగిస్తుండటం తీవ్ర దురదృష్టకరం. ఇలాంటి దుర్మార్గపు ప్రయత్నాలు ప్రజల కోసం మేము చేస్తున్న పోరాటాన్ని అడ్డుకుంటాయని అనుకోవడం వారి విఫల వ్యూహమే అవుతుంది" అని ఆదిత్య ఠాక్రే పేర్కొన్నారు. తాము ఎల్లప్పుడూ సత్యం పక్షానే నిలబడతామని ఆదిత్య ఠాక్రే స్పష్టం చేశారు. ఈ కేసు దర్యాప్తులో రాజకీయ ప్రమేయం, వ్యక్తిత్వ హననాలకు తావులేకుండా నిష్పాక్షికంగా విచారణ సాగాలని విజ్ఞప్తి చేశారు. "ఈ కేసు పునర్విచారణను సజావుగా సాగనివ్వండి" అని పేర్కొంటూ సీబీఐ దర్యాప్తును ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని పరోక్షంగా తెలిపారు.

# ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమే!

**ఎమ్మెల్యేల రాజీనామా, ఉప ఎన్నికల్లో పోటీపై మద్రాస్ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు**



తమిళనాడులో కొందరు ఎమ్మెల్యేలు తమ పదవులకు రాజీనామా చేసి, తిరిగి అదే నియోజకవర్గాల నుంచి ఉప ఎన్నికల్లో పోటీ చేయడంపై మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ధోరణి ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమేనని, ఓటర్లను తీవ్రంగా అవమానించడమేనని వ్యాఖ్యానించింది. ఎన్నికల్లో గెలిచిన వెంటనే రాజీనామా చేసి మళ్లీ ఉప ఎన్నికల్లో పోటీ చేసే ఎమ్మెల్యేల తీరును పరిశీలించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన మార్గదర్శకాలను రూపొందించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి సూచించింది.

రాష్ట్రంలో కొన్ని నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మధురాంతకం, ధరాపురం సహా పలు అసెంబ్లీ నియోజకవర్గాల్లో అన్నాడీఎంకే తరఫున పోటీ చేసి గెలుపొందిన కొందరు ఎమ్మెల్యేలు కొద్ది రోజులకే రాజీనామా చేసి తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీలో చేరారు. ఈ నేపథ్యంలో ఖాళీ అయిన రెండు స్థానాలకు అక్టోబరు 6న ఉప ఎన్నిక నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీనిని సవాలు చేస్తూ చెన్నైకి చెందిన ఓ న్యాయవాది మద్రాస్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. గెలిచిన కొద్దికాలానికే రాజకీయ కారణాలతో ఎమ్మెల్యేలు రాజీనామా చేయడం వల్ల ఉప ఎన్నికల ఖర్చు భారం పన్నుచెల్లింపుదారులపై పడుతోందని పిటిషనర్ పేర్కొన్నారు. ఇలాంటి ప్రజాప్రతినిధులను నిర్దిష్ట కాలం పాటు ఎన్నికల్లో పోటీ చేయకుండా నిరోధించేలా చట్టం తీసుకురావాలని కోరారు. అలాగే దీనిపై స్పష్టత వచ్చే వరకు ఉప ఎన్నికలపై స్టే విధించాలని విజ్ఞప్తి చేశారు.

**స్టేకు నిరాకరణ.. ఈసీకి స్పష్టమైన ఆదేశాలు**

ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ ఎస్ఎం సుబ్రమణ్యం, జస్టిస్ గోవిందరాజన్‌లతో కూడిన ధర్మాసనం.. ఉప ఎన్నికలపై స్టే ఇవ్వడానికి నిరాకరించింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైన తర్వాత దానిని ఆపలేమని స్పష్టం చేసింది. అయితే ఎన్నికైన వెంటనే ఒక ఎమ్మెల్యే రాజీనామా చేసి, తిరిగి ఆ ఉప ఎన్నికలోనే పోటీ చేసే పద్ధతిని ఒక విచిత్రమైన పరిస్థితిగా అభివర్ణించింది. ఇలాంటి చర్యలను క్షుణ్ణంగా పరిశీలించి ఒక పరిష్కార మార్గంతో వస్తారని ఆశిస్తున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘానికి స్పష్టం చేసింది.

## విధులకు వెళ్లకుండానే రూ.70వేలు డ్రా

**ఎమ్మెల్యే మేనకోడలిపై విచారణకు సీఈవో ఆదేశం**



కర్ణాటకలోని బాగల్‌కోట్ జిల్లాలో ఒక ప్రభుత్వ వైద్యాధికారిణి తీరు తీవ్ర కలకలం రేపుతోంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఉమేష్ మేటి మేనకోడలైన డాక్టర్ అంకిత యారగల్ ప్రభుత్వ 'నమ్మ క్లినిక్'లో వైద్యాధికారిగా పనిచేస్తూ.. విధులకు హాజరుకాకుండానే నెలకు రూ.70 వేలకు పైగా వేతనం తీసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. ఆమె ఒకవైపు ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే మరోవైపు ఒక ప్రైవేటు వైద్య కళాశాలలో పీజీ కోర్సు చదువుతుండటం గమనార్హం. మార్చి 3వ తేదీ నుంచి ఇప్పటివరకు ఆమె క్లినిక్‌కు ఒక్కరోజు కూడా హాజరు కాలేదని అధికారులు తేల్చారు. బాధ్యతాయుతమైన వైద్యాధికారి లేకుండానే క్లినిక్ ఎలా నడిపించారనే అంశంపై స్థానికంగా తీవ్ర చర్చ సాగుతోంది. ఈ వ్యవహారం బయటపడటంతో జిల్లా పంచాయతీ సీఈవో గజానన్ బాలే సమగ్ర విచారణకు ఆదేశించారు. మొదట నిర్వహించిన విచారణకు డాక్టర్ అంకిత హాజరుకాకపోవడంతో.. సెప్టెంబరు 18న జరిగే విచారణకు కచ్చితంగా హాజరుకావాలని నోటీసులు జారీ చేశారు. ఆరోపణలు రుజువైతే ఆమెపై తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు కర్ణాటక మెడికల్ కౌన్సిల్, జాతీయ వైద్య కమిషన్‌లకు ఫిర్యాదు చేస్తామని అధికారులు వెల్లడించారు. విధులకు హాజరుకాని కాలానికి ఆమెకు చెల్లించిన జీతం మొత్తాన్ని కూడా ప్రభుత్వం తిరిగి వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. కాగా ఈ సంచలన ఆరోపణలపై ఎమ్మెల్యే ఉమేష్ మేటిగానీ, వైద్యాధికారిణి అంకితగానీ ఇప్పటివరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు.

## 2013 బస్తర్ మావోయిస్టుల దాడి కేసు

**10 మందికి ఉరి శిక్ష విధించిన ఎన్ఐఏ కోర్టు**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్‌లో 13ఏళ్ల క్రితం మావోయిస్టులు జరిపిన భయానక దాడి కేసులో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టు సంచలన, కీలక తీర్పు వెలువరించింది. ఈ దాడి కేసులో ఇప్పటికే దోషులుగా తేలిన 10 మంది మావోయిస్టులకు న్యాయస్థానం మరణ శిక్ష ఖరారు చేసింది. నాటి రక్తసిక్త ఘటనలో కాంగ్రెస్ అగ్రనేతలు సహా మొత్తం 29 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దోషులుగా తేలి ఉరిశిక్ష పడిన వారిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ఉండటం గమనార్హం. బస్తర్ జిల్లాలోని ఝీరామ్ వ్యాలీలో 2013 మే 25న కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'పరివర్తన్ ర్యాలీ'పై మావోయిస్టులు విచక్షణారహితంగా మెరుపుదాడి చేశారు. ఈ ఘటనలో రాష్ట్రానికి చెందిన పలువురు కాంగ్రెస్ దిగ్గజ నేతలతో పాటు మొత్తం 29 మంది అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. నాటి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు నందకుమార్ పటేల్, ఆయన కుమారుడు దినేష్, అసెంబ్లీ మాజీ విపక్ష నేత మహేంద్ర కర్మా, కేంద్ర మాజీ మంత్రి విద్యా చరణ్ శుక్లా, సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే ఉదయ్ ముదియార్ తదితరులు మావోయిస్టుల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ సుదీర్ఘ కేసు విచారణ సమయంలో న్యాయస్థానం దాదాపు 101 మంది సాక్షుల వాంగ్మూలాలను, భద్రతా దళాల ఆధారాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాత దోషులకు మరణ శిక్ష ఖరారు చేస్తూ తీర్పునిచ్చింది.






## గుడ్ న్యూస్.. ఈపీఎఫ్ కనీస వేతనం పెంపు

ఈపీఎఫ్ వేతనదారులకు గుడ్ న్యూస్. పీఎఫ్ కనీస వేతన పరిమితి పెంపునకు కేంద్ర కేబినెట్ తాజాగా ఆమోదం తెలిపింది. రూ.15వేల పరిమితిని రూ.25వేలకు పెంచేందుకు నిర్ణయించింది. దీంతో కొత్తగా 51 లక్షల మంది ఈపీఎఫ్‌వో కవరేజీ పరిధిలోకి రానున్నారు. పీఎఫ్ కనీస వేతన పెంపుతో మరింత మంది వర్కర్లకు సామాజిక భద్రత లభిస్తుందని కార్మిక శాఖ పేర్కొంది. 2014లో చివరిసారిగా ప్రభుత్వం కనీస వేతనాన్ని రూ.15వేలకు పెంచింది. వేతనాల వృద్ధి, ఆదాయాల వృద్ధి వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని కేంద్రం పీఎఫ్ కనీస వేతనాన్ని పెంచేందుకు నిర్ణయించింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం రూ.15వేలు, అంతకుమించి నెలవారీ వేతనంతో ఉద్యోగంలో చేరేవారు ఆటోమేటిక్‌గా ఈపీఎఫ్ పరిధిలోకి రారు. ఈ పరిమితి పెంపుతో రూ.25 వేల వరకూ వార్షిక వేతనం ఉన్న వారు ఆటోమేటిక్‌గా పీఎఫ్ పరిధిలోకి వస్తారు. పీఎఫ్ సేవింగ్స్, పెన్షన్, ఇన్సూరెన్స్ సదుపాయం వంటివి వారికి అందుబాటులోకి వస్తాయి. వేతన పెంపుపై వివిధ మంత్రిత్వ శాఖలతో సంప్రదింపుల అనంతరం కేంద్రం తుది నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్‌వో డేటా ప్రకారం,ప్రస్తుతం 7.98కోట్ల మంది పీఎఫ్ సభ్యులు ఉన్నారు. 82 లక్షల మందికి పీఎఫ్ పెన్షన్ సదుపాయం ఉంది.

### ఇజ్రాయెల్‌కు రూ.26వేల కోట్ల భారీ ఆయుధ ప్యాకేజీ

# అమెరికా ఆమోదం



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రస్థాయికి చేరిన వేళ అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఇజ్రాయెల్‌కు దాదాపు రూ.26వేల కోట్ల (2.8 బిలియన్ డాలర్లు) విలువైన భారీ ఆయుధ ప్యాకేజీని ఆమోదించింది. ఈ ఒప్పందంలో భాగంలో ఒక్కొక్కటి ఏకంగా ఒక టన్ను బరువుండే 40వేల బాంబులను అమెరికా అందించనుంది. వీటిలో 20వేల ఎమ్‌కే 84, 20వేల బీఎల్‌యూ-117 బాంబులు ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. వీటితో పాటు నేల, కాంక్రీట్, రాళ్లను సైతం తవ్వుకుంటూ వెళ్లి పేలిపోయే 20వేల బి-2000 'పెనెట్రేటర్ వార్‌హెడ్లు' కూడా ఈ ప్యాకేజీలో ఉన్నాయి.

అమెరికా ఆయుధాగారంలోనే అత్యంత విధ్వంసకర ఆయుధాల్లో ఎమ్‌కే-84 ఒకటి. ఇది పేలితే పెద్ద ఎత్తున లోహపు శకలాలు వేలాది అడుగుల దూరానికి ఎగిరిపడతాయి. గతంలో ఇజ్రాయెల్ ఈ తరహా బాంబులను లెబనాన్, గాజాల్లో వినియోగించిన సమయంలో భారీ ప్రాణనష్టం జరగడంతో అప్పటి బైడెన్ ప్రభుత్వం వీటి సరఫరాను నిలిపివేసింది. అయితే ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిలిపివేతను ఎత్తివేశారు. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఇలాంటి విధ్వంసకర బాంబులను ఉపయోగించడం వల్ల సామాన్య పౌరులకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందని మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఎప్పటినుంచో పెండింగ్‌లో ఉన్న ఈ ఆయుధ ఒప్పందం గురించి యూఎస్ కాంగ్రెస్‌కు ట్రంప్ యంత్రాంగం సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. 'విదేశీ మిలిటరీ ఫైనాన్సింగ్' విధానం ద్వారా ఈ ప్యాకేజీకి చెల్లింపులు జరుపుతారు. ఈ పద్ధతిలో అమెరికా ప్రభుత్వం తన పన్ను చెల్లింపుదారుల డబ్బును ఇజ్రాయెల్‌కు గ్రాంట్‌గా ఇస్తుంది. ఆ నిధులతోనే ఇజ్రాయెల్ అమెరికా నుంచి మళ్లీ ఆయుధాలను కొనుగోలు చేయడం గమనార్హం.



### డయానా కారు ప్రమాద ఫైలు

# 2082 వరకు సీల్డ్!

బ్రిటన్ రాజ కుటుంబానికి చెందిన వేల్స్ మాజీ యువరాణి డయానా 1997 ఆగస్టు 31న పారిస్‌లో దారుణ కారు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. ఈ సంచలనాత్మక ప్రమాదానికి సంబంధించి ఫ్రెంచ్ పోలీసులు సిద్ధం చేసిన సుమారు 6వేల పేజీల అత్యంత కీలకమైన 'పోలీసు డాజియర్'ను 2082వ సంవత్సరం వరకు అత్యంత రహస్యంగా ఉంచనున్నారు. పారిస్‌లోని 'పాలేస్ డి జస్టిస్' నేలమాళిగలో ఒక మీటరు ఎత్తు ఉన్న ఈ రికార్డు ఫైల్‌కు సాయుధ బలగాలు కాపలా కాస్తున్నాయి. ఈ కేసులో డయానాతో పాటు ఆమె భాగస్వామి డోడి అల్ ఫాయెద్, కారు డ్రైవర్ హెన్రీ పాల్ మరణించారు. సుమారు 18 నెలల పాటు చేపట్టిన తీవ్ర విచారణ అనంతరం ఫ్రెంచ్ పోలీసులు ఈ విచారణ ఫైలును రూపొందించారు.

**అతివేగం, మద్యమే ప్రమాదానికి కారణం**

పారిస్ సొరంగంలో జరిగిన ఈ ప్రమాదానికి పరిమితికి మించిన అతివేగం, డ్రైవర్ మద్యం, మాదకద్రవ్యాలు సేవించడమే కారణమని అప్పటి మేజిస్ట్రేట్ హెర్వ్ స్టీఫెన్ తీర్పునిస్తూ కేసును మూసివేశారు. టాక్సికాలజీ అధ్యయనం ప్రకారం డ్రైవర్ రక్తంలో ఆల్కహాల్ స్థాయి ఫ్రాన్స్ చట్టపరమైన పరిమితి కంటే మూడు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ప్రమాద సమయానికి ముందు డయానా కారును వెంబడించిన తొమ్మిది మంది ఫొటోగ్రాఫర్లను, బైక్ నడుపుతున్న వ్యక్తిని కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది. 2008లో జరిగిన బ్రిటిష్ విచారణ కూడా ఇదే విషయాన్ని నిర్ధారించింది.

**2082 వరకే ఎందుకు?**

ఫ్రాన్స్ దేశ వారసత్వ చట్టాల ప్రకారం.. ఏదైనా ఒక కేసు అధికారికంగా ముగిసిన తేదీ నుంచి 75 సంవత్సరాల పాటు దానికి సంబంధించిన జాతీయ ఆర్కైవల్ ఫైళ్లను బహిరంగపరచకూడదు. డయానా కేసు దర్యాప్తు 2007లో అధికారికంగా పూర్తయింది. ఈ చట్టం ఆధారంగానే సదరు ఫైలును 2082 వరకు సీల్డ్ కవర్లలో ఉంచుతారు. గడువు ముగిసిన తర్వాత కూడా దీనిని తెరవడమా లేదా నిరవధికంగా పొడిగించడమా అనే దానిపై నిర్ణయం తీసుకుంటారు.

**ఇప్పటికీ వీడని గుట్టు.. ఆ తెల్లటి కారు ఏది?**

ఈ ఫైలు కనీసం డిజిటలైజ్ కూడా కాకపోవడం, సాయుధ బలగాల పహారాలో భద్రపరచడంతో ఈ ప్రమాదంపై రకరకాల అనుమానాలు, ఊహాగానాలు మళ్లీ వ్యక్తమవుతున్నాయి. డయానా ప్రయాణిస్తున్న మెర్సిడెస్ కారును ఢీకొట్టినట్టు భావిస్తున్న 'తెల్లటి ఫియట్ యూనో' కారు ఆచూకీ ఇప్పటివరకు దర్యాప్తు సంస్థలు కనిపెట్టలేకపోవడం గమనార్హం. ఇది కేవలం ప్రమాదమేనని, ఎలాంటి కుట్ర లేదని విచారణ సంస్థలు స్పష్టం చేసినప్పటికీ రికార్డులను రహస్యంగా ఉంచడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# పాస్‌పోర్ట్ ఇండెక్స్-2026

### 73వ స్థానానికి దిగజారిన భారత పాస్‌పోర్ట్



ప్రపంచ దేశాల పాస్‌పోర్టుల శక్తిని అంచనా వేసే 'పాస్‌పోర్ట్ ఇండెక్స్ 2026' జాబితాలో భారత పాస్‌పోర్ట్ స్థానం పడిపోయింది. అంతర్జాతీయ ఆర్థిక సలహా సంస్థ 'ఆర్టన్ క్యాపిటల్' విడుదల చేసిన ఈ తాజా గ్లోబల్ ర్యాంకింగ్స్‌లో భారత్ 73వ స్థానానికి దిగజారింది. 2025లో 66వ స్థానంలో ఉన్న భారత్.. ఈ ఏడాది ఏకంగా ఏడు స్థానాలు దిగజారడం గమనార్హం. ఇదే సమయంలో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ పాస్‌పోర్ట్ ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైనదిగా మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది.

వీసా లేని ప్రయాణం (వీసా-ఫ్రీ), వీసా ఆన్ అరైవల్ సౌకర్యాలున్న దేశాల సంఖ్య ఆధారంగా ఈ జాబితాలో 'మొబిలిటీ స్కోర్' కేటాయిస్తారు. మొత్తం 199 దేశాల పాస్‌పోర్టులను విశ్లేషించగా... భారత్ మొబిలిటీ స్కోర్ గత ఏడాది ఉన్న 73 నుంచి 69కి పడిపోయింది. వీసా ఆన్ అరైవల్ దేశాల సంఖ్య తగ్గడమే ఈ పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తోంది. 69 మొబిలిటీ స్కోర్‌తో భారత్.. జింబాబ్వే, ఉగాండా, ఉజ్బెకిస్థాన్, వియత్నాం దేశాలతో కలిసి 73వ స్థానాన్ని పంచుకుంటోంది. భారత పాస్‌పోర్ట్‌తో 25 దేశాలకు వీసా లేకుండా, 39 దేశాల్లో వీసా-ఆన్-అరైవల్‌తో ప్రయాణించవచ్చు. కాగా, 129 దేశాలకు ముందస్తు వీసా తప్పనిసరి. 181 మొబిలిటీ స్కోర్‌తో యూఏఈ ప్రథమ స్థానంలో నిలిచింది. యూఏఈ పౌరులు 138 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే వెసులుబాటు ఉంది. అఫ్గనిస్తాన్ పాస్‌పోర్ట్ కేవలం 35 స్కోర్‌తో జాబితాలో చిట్టచివరన (99వ ర్యాంకు) నిలిచింది.

**ర్యాంకింగ్స్‌ను తోసిపుచ్చిన కేంద్ర ప్రభుత్వం**

కాగా... ఇలాంటి ప్రైవేట్ సంస్థల గ్లోబల్ పాస్‌పోర్ట్ ర్యాంకింగ్‌లను భారత ప్రభుత్వం అంగీకరించట్లేదు. కొన్ని ప్రైవేట్ సంస్థలు ఏకపక్ష పారామీటర్ల ఆధారంగా ఈ నివేదికలు రూపొందిస్తున్నాయని కేంద్రం పేర్కొంది. పాస్‌పోర్టులకు ర్యాంకులు ఇవ్వడానికి ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి ఆమోదయోగ్యమైన ప్రమాణాలు లేవని, అందుకే వీటిని ప్రామాణికంగా తీసుకోలేమని విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ గతంలో స్పష్టం చేశారు.



### చిన్నారుల సోషల్ మీడియా వాడకంపై

# 'ఈయూ' ఉక్కుపాదం

**- 13ఏళ్లలోపు వారికి నిషేధం..**
**టీనేజర్లకు కఠిన నిబంధనలు**
**- 27 దేశాల కూటమి కీలక నిర్ణయం**

చిన్నారుల సోషల్ మీడియా వినియోగంపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో 27 యూరోపియన్ దేశాల కూటమి (ఈయూ) కీలక నిర్ణయానికి సన్నాహాలు చేస్తోంది. 13ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా నిషేధించడంతో పాటు టీనేజర్లకు పరిమితులు విధించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు యూరోపియన్ కమిషన్ అధ్యక్షురాలు ఉర్సులా వాన్ డెర్ లేయెన్ పలు సంచలన ప్రతిపాదనలు వెల్లడించారు. బ్రస్సెల్స్‌లో జరిగిన ఈయూ వార్షిక సమావేశంలో ఉర్సులా మాట్లాడారు. "సాంకేతికత శక్తి అపారమైనది. కానీ వ్యసనానికి గురిచేసే ఫీచర్లు చిన్నారులకు ఎంతమాత్రం అవసరం లేదు. పిల్లలను ప్రమాదకర విషయాలవైపు ఆకర్షించడం, ముఖ్యంగా ఏఐ సాయంతో అమ్మాయిల ఫొటోలను అసభ్య చిత్రాలుగా మార్చడం వంటి చర్యలను సహించేది లేదు" అని ఆమె స్పష్టం చేశారు.

**కొత్త నిబంధనల ప్రతిపాదనలు:**

*13 ఏళ్ల లోపు: సోషల్ మీడియా వినియోగంపై పూర్తి నిషేధం.*

*13-15 ఏళ్లు: తల్లిదండ్రులు/సంరక్షకుల పర్యవేక్షణలో పరిమిత 'మినీ ఖాతాలు' ఉపయోగించే వెసులుబాటు. ఫీచర్లు, స్క్రీన్ సమయంపై కఠిన పరిమితులు.*

*15-18 ఏళ్లు: టీనేజర్ల భద్రత కోసం సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లు ప్రత్యేక సురక్షిత డిజైన్లను రూపొందించాల్సి ఉంటుంది. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే ఈయూ అధికారికంగా వెల్లడించనుంది.*

# హెచ్ఐవీ విజృంభణ

**'నేషనల్ హెచ్ఐవీ ఎమర్జెన్సీ' ప్రకటించిన ఫిజీ**

పసిఫిక్ మహాసముద్రంలోని ద్వీప దేశం ఫిజీలో హెచ్ఐవీ వ్యాప్తి తీవ్ర రూపం దాల్చింది. రోజురోజుకూ కేసుల సంఖ్య భారీగా పెరుగుతుండటంతో అక్కడి ప్రభుత్వం దేశంలో 'నేషనల్ హెచ్ఐవీ ఎమర్జెన్సీ' ప్రకటించింది. 10 లక్షల కంటే తక్కువ జనాభా ఉన్న ఈ చిన్న దేశంలో ప్రస్తుతం ప్రతి 60 మంది వయోజనుల్లో ఒకరు హెచ్ఐవీ వైరస్‌తో బాధపడుతున్నట్లు అంచనా వేస్తున్నారు. గతేడాది జనవరిలో హెచ్ఐవీ వ్యాప్తిని అధికారికంగా గుర్తించిన ఫిజీ ప్రభుత్వం.. వెంటనే వైద్య పరీక్షలను వేగవంతం చేసింది. గతేడాది కొత్తగా 2,060 హెచ్ఐవీ కేసులు నమోదయ్యాయని ఆ దేశ ఆరోగ్యశాఖ మంత్రి డాక్టర్ అంటోనియో వెల్లడించారు. తీవ్రమైన అంశమేమిటంటే.. ప్రతి 50 మంది గర్భిణుల్లో ఒకరికి ఈ వైరస్ సోకినట్లు వైద్యుల తనిఖీల్లో తేలింది. తల్లుల నుంచి నవజాత శిశువులకు ఇది వ్యాపిస్తుండటంతో గతేడాది 59 మంది శిశువులకు వైరస్ సోకిందని 'సేవ్ ది చిల్డ్రన్ ఫిజీ' సంస్థ తెలిపింది. ఇటీవల రెండు నెలల పసికందు కూడా ఈ వైరస్ బారిన పడటం అక్కడి పరిస్థితి తీవ్రతకు అద్దంపడుతోంది. విజృంభణకు ప్రధాన కారణాలు: డ్రగ్స్ తీసుకునేందుకు అనేక మంది ఒకే సిరంజిని ఉపయోగించడం, అసురక్షిత శారీరక సంబంధాలు వంటి ప్రధాన కారణాల వల్లే ఈ మహమ్మారి వేగంగా విస్తరిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. 2021లో హెచ్ఐవీ సంబంధిత మరణాల సంఖ్య 25గా ఉండగా 2025 నాటికి అది ఏకంగా 117కు పెరిగింది. ఫిజీలో హెచ్ఐవీతో జీవిస్తున్న వారిలో కేవలం 39శాతం మందికి మాత్రమే తమకు వైరస్ ఉందనే విషయం తెలుసని యుఎన్ ఎయిడ్స్ (ఖఫీూ×ఐూ) ప్రతినిధి వెల్లడించారు. అలాగే బాధితుల్లో నాలుగో వంతు కంటే తక్కువ మంది మాత్రమే ప్రస్తుతానికి తగిన వైద్య చికిత్స పొందుతున్నారు.

# భారత్‌లోనే ఐపీఎల్ 2027 మినీ వేలం..

### ఐపీఎల్, డబ్ల్యూపీఎల్ వేలాలపై బీసీసీఐ కీలక నిర్ణయాలు



రాబోయే ఐపీఎల్-2027 సీజన్ కోసం ఈ ఏడాది ఆఖరి నెలలో నిర్వహించనున్న మినీ వేలానికి భారతదేశమే వేదిక కానుంది. గత మూడుసార్లు దుబాయ్, జెద్దా, అబుదాబి వంటి విదేశీ వేదికల్లో ఈ వేలం ప్రక్రియ పూర్తి చేశారు. అయితే విదేశాల్లో నిర్వహించడం వల్ల పలు సమస్యలు తలెత్తుతున్నాయని ఫ్రాంచైజీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయడంతో బీసీసీఐ గవర్నింగ్ కౌన్సిల్ తాజాగా నిర్వహించిన సమావేశంలో భారత్‌లోనే వేలం నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది.

**కోచిలో మినీ వేలం!**

మరోవైపు మహిళల ప్రీమియర్ లీగ్ వేలాన్ని అక్టోబరు 29న కోచి వేదికగా నిర్వహించే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. డబ్ల్యూపీఎల్ వేలం ముగిసిన వెంటనే ఐపీఎల్ మినీ వేలాన్ని కూడా కోచిలోనే నిర్వహించే యోచనలో బీసీసీఐ ఉందని తెలుస్తోంది. వేలం కోసం వచ్చే ఫ్రాంచైజీల సిబ్బందికి దాదాపు 100 గదుల వరకు అవసరం పడనుండటంతో బీసీసీఐ తగిన ఏర్పాట్లను పరిశీలిస్తోంది.

**వారణాసిలో డబ్ల్యూపీఎల్ 2027 మ్యాచ్‌లు**

మహిళల ప్రీమియర్ లీగ్-2027 సీజన్ మ్యాచ్‌లకు కొత్త వేదికలు ఖరారు కానున్నాయి. వచ్చే ఏడాది జనవరి 17 నుంచి ఫిబ్రవరి 7 వరకు జరిగే టోర్నీలో భాగంగా వారణాసిలోని కొత్త స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించేందుకు చర్చలు జరిగాయి. ముంబైలోని బ్రబౌర్న్ మైదానం, వడోదరలోని కోటంబి స్టేడియంతో పాటు వారణాసిలోనూ మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. వచ్చే ఏడాది జనవరి తొలి వారం నాటికి వారణాసి స్టేడియం సిద్ధం కానుండగా, దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడనుంది.

**ఇంపాక్ట్ రూల్‌పై కొనసాగుతున్న సందిగ్ధత**

ఐపీఎల్‌లో వివాదాస్పదంగా మారిన 'ఇంపాక్ట్ ప్లేయర్' రూల్‌ను కొనసాగించాలా... వద్దా! అనే దానిపై ఇంకా సందిగ్ధత నెలకొంది. దీనిపై వచ్చే నెలలో జరగనున్న బీసీసీఐ, గవర్నింగ్ కమిటీ భేటీలో చర్చించి ఆఖరు నిర్ణయం తీసుకోనున్నారు. ఇప్పటికే ఈ నిబంధనపై పలువురు అంతర్జాతీయ ప్లేయర్లు, కోచ్‌లు అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

# బెస్ట్ 11తోనే బరిలోకి దిగాలి

**ఆఖరి క్షణాల్లో మార్పులు వద్దు: యువీ**

వన్డే ప్రపంచ కప్ 2027 ఎడిషన్‌కు కేవలం ఏడాది సమయం మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో టీమిండియా మేనేజ్‌మెంట్‌కు మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కీలక సూచనలు చేశారు. ప్రపంచ కప్ సమయానికి జట్టు కూర్పుపై స్పష్టత లేకపోవడం సరికాదని, ఆఖరి నిమిషంలో స్క్వాడ్‌లో మార్పులు చేయవద్దని హెచ్చరించారు. సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల భాగస్వామ్యంపై ఇంకా స్పష్టత రాకపోవడంపై యువీ తన అభిప్రాయాలను పంచుకున్నారు.

**ఒకే జట్టుతో ఆడించాలి**

రాబోయే ఏడాది కాలంలో ఒకే జట్టుకు ప్రాధాన్యం ఇస్తూ మ్యాచ్‌లు ఆడించాలని యువీ సూచించారు. "మీరు 16 మందిని ఎంపిక చేసినా లేదా 20 మందిని ఎంపిక చేసినా... వారందరికీ ఈ ఏడాది వ్యవధిలో తగినన్ని అవకాశాలు ఇవ్వాలి. టీ20 క్రికెట్ ప్రభావంతో ఆటగాళ్లకు 50 ఓవర్ల ఫార్మాట్ అలవాటు తగ్గుతోంది. వారిని మళ్లీ రిథమ్‌లోకి తేవాలంటే తగిన సమయం, అవకాశాలు ఇవ్వడమే ఏకైక మార్గం" అని పేర్కొన్నారు. ప్రదర్శనతో సంబంధం లేకుండా గెలిచినా, ఓడినా జట్టుకు యాజమాన్యం పూర్తి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

**ఆస్ట్రేలియా విజయ రహస్యం అదే**

వరల్డ్ కప్‌లో ఆస్ట్రేలియా అత్యంత విజయవంతమైన జట్టుగా నిలవడానికి గల కారణాన్ని యువీ విశ్లేషించారు. "ప్రతి జట్టులో భిన్నమైన ప్లేయర్లు ఉంటారు. కానీ అత్యుత్తమ కాంబినేషన్, బలమైన రిజర్వ్ బెంచ్ ముఖ్యం. ఆస్ట్రేలియా జట్టులో ప్రతి ఒక్కరూ మ్యాచ్ విన్నర్లే.



కష్ట సమయాల్లో ఒకరికొకరు తోడ్పడుతూ బాధ్యత తీసుకుంటారు. మ్యాచ్ గెలిపించగల అత్యుత్తమ 11 మంది ఆటగాళ్లతోనే బరిలోకి దిగాలి" అని యువీ వివరించారు.

## మళ్లీ రెండో స్థానంలోకి అభిషేక్ శర్మ

*- టాప్-10లోకి దూసుకొచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా*



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తాజాగా విడుదల చేసిన టి-20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత యువ బ్యాటర్లు అదరగొట్టారు. 913 రేటింగ్ పాయింట్లతో ఇషాన్ కిషన్ అగ్రస్థానంలో కొనసాగుతుండగా యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (862) ఒక స్థానం మెరుగుపరుచుకుని రెండో ర్యాంకుకు చేరుకున్నాడు. ఈ క్రమంలో పాకిస్తాన్ బ్యాటర్ షహిబ్‌జాద ఫర్హాన్ (848)ను ఆయన మూడో స్థానానికి నెట్టివేశాడు. అఫ్గానిస్తాన్‌తో జరిగిన రెండు టి20 సిరీస్‌ల్లో అభిషేక్ హాఫ్ సెంచరీతో పాటు మొత్తం 121 పరుగులు చేసి ఈ పురోగతి సాధించాడు. ఇక వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (801) అగ్రస్థానంలో ఉండగా టెస్టుల్లో ఇంగ్లండ్ ప్లేయర్ హ్యారీ బ్రూక్ (861) ప్రథమ స్థానంలో నిలిచాడు.

**బౌలింగ్‌లో అదరగొట్టిన వరుణ్, బుమ్రా**

అఫ్గాన్‌తో తొలి టి20 ఆడి గాయం కారణంగా మిగతా సిరీస్‌కు దూరమైన స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి (678) బౌలింగ్ విభాగంలో రెండు స్థానాలు ఎగబాకి ఐదో ర్యాంకుకు చేరుకున్నాడు. భారత స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా (650) ఏడు స్థానాలు మెరుగుపరుచుకుని 10వ ర్యాంకు సాధించాడు. టి20, వన్డే బౌలింగ్ విభాగాల్లో అఫ్గానిస్తాన్ స్పిన్నర్ రషీద్‌ఖాన్ (744) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.

## కోపంలో రాకెట్ ముక్కలు చేసి...

**- టెన్నిస్ స్టార్ ప్లేయర్ సబలెంకాకు 7,500 డాలర్ల జరిమానా**

'తన కోపమే తనకు శత్రువు' అంటే ఇదేనేమో! యూఎస్ ఓపెన్ ఫైనల్లో ఘోర ఓటమిని జీర్ణించుకోలేక బెలారస్ స్టార్ టెన్నిస్ ప్లేయర్ అరినా సబలెంకా తీవ్ర ఆగ్రహానికి గురైంది. హ్యాట్రిక్ టైటిల్ కొట్టి సంబరాలు చేసుకోవాలనుకున్న ఆమె ఆశలపై కజకిస్తాన్ స్టార్ నికోలా రిబాకినా నీళ్లు చల్లింది. ఈ పరాజయంతో తీవ్ర అసహనానికి గురైన సబలెంకా.. కోర్టులోనే తన రాకెట్‌ను నేలకేసి కొట్టి ముక్కలు చేసింది. ఈ మ్యాచ్‌తో పాటు ఆమె ప్రవర్తనపై యునైటెడ్ స్టేట్స్ టెన్నిస్ అసోసియేషన్ (ఖూూూ) కఠిన చర్యలు తీసుకుంది. కోడ్ ఉల్లంఘనకు పాల్పడినందుకు గాను ఆమెకు 7,500 డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.7 లక్షలకు పైగా) జరిమానా విధించింది. అటు టైటిల్ గెలవలేక తీవ్ర నిరాశలో ఉన్న సబలెంకాకు ఈ ఫైన్ మరొక పెద్ద షాక్‌గా మారింది.

**మైదానంలో అసహనం.. తీవ్ర ఆగ్రహం**

ఫైనల్ మ్యాచ్ తొలి సెట్‌లో బ్రేక్ పాయింట్ కోల్పోయిన అనంతరం సబలెంకా తీవ్ర అసహనానికి గురైంది. కోపంతో బంతిని స్టేడియంలోని ప్రేక్షకుల వైపు ఎలా పడితే అలా కొట్టడంతో అంపైర్ మొదటిసారి కోడ్ ఉల్లంఘన నమోదు చేశారు. మ్యాచ్ కొనసాగుతున్న సమయంలోనూ ఆమె ఆవేశం చల్లారలేదు. మరోసారి బంతిని కోర్టు వెనుక భాగానికి బలంగా కొట్టగా.. అది అక్కడే ఉన్న కెమెరామెన్‌కు అత్యంత సమీపం నుంచి వెళ్లింది. ఇక మ్యాచ్ పూర్తిగా ఓడిపోయిన అనంతరం బెంచ్ పై కూర్చున్న ఆమె.. రాకెట్‌ను పలుమార్లు నేలకు కొట్టి విరగ్గొట్టి తన నిరసన తెలిపించింది.

**గ్రాండ్‌స్లామ్ టైటిల్ లేకుండానే ఎండ్..**

ఈ టోర్నీ ఫైనల్ వరకు సబలెంకా అద్భుత ప్రదర్శన చేసింది. ఒక్క సెట్ కూడా కోల్పోకుండా ఫైనల్‌కు చేరింది. ఫ్లషింగ్ మెడోస్‌లో వరుసగా 20 మ్యాచ్‌ల్లో విజయాలు సాధించిన ఆమె రికార్డుకు ఫైనల్లో తెరపడింది. దీంతో 2026 ఏడాదిని సబలెంకా ఒక గ్రాండ్‌స్లామ్ టైటిల్ కూడా లేకుండానే ముగించాల్సి వచ్చింది. మార్చిలో ఇండియన్ వెల్స్, మియామీ ఓపెన్ టైటిళ్లను వరుసగా గెలుచుకుని 'సన్‌షైన్ డబుల్' సాధించిన సబలెంకా.. ఆ తర్వాత మరొక టైటిల్ గెలవలేకపోయింది. ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లోనూ రిబాకినా చేతిలోనే ఓడిపోయిన ఆమె.. ఇప్పుడు యూఎస్ ఓపెన్ ఫైనల్లోనూ అదే ప్రత్యర్థి చేతిలో భంగపడింది.

## మహిళా గ్రాండ్ మాస్టర్‌గా సాహిత్య వర్షిణి

**మూడో జీఎం నార్మ్ సాధించిన 19 ఏళ్ల వైజాగ్ చెస్ క్రీడాకారిణి**




ఆంధ్రప్రదేశ్‌కి చెందిన 19 ఏళ్ల చెస్ క్రీడాకారిణి సాహితి వర్షిణి మహిళా గ్రాండ్ మాస్టర్ (జీఎం) హోదా దక్కించుకుని రికార్డు సృష్టించింది. సెర్బియాలో జరిగిన 'ఐఎం రౌండ్ రాబిన్ టోర్నీ'లో ఆమె తన మూడో జీఎం నార్మ్ సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో మొత్తం 9 రౌండ్లలో 6 పాయింట్లు సాధించి వర్షిణి రెండో స్థానంలో నిలిచింది. టోర్నీలో భాగంగా భారత్‌కే చెందిన నీలేష్ సాహా, వేదాంత్ పనేసర్‌లపై వర్షిణి విజయాలు నమోదు చేసింది. ఈ టోర్నీ ద్వారా ఆమె 2408 పెర్ఫార్మెన్స్ రేటింగ్ నమోదు చేయడంతో పాటు 23 రేటింగ్ పాయింట్లు సాధించింది. గత ఏడాది సెప్టెంబరులో హంగేరీలో జరిగిన 'గోల్డెన్ హార్స్ ఐఎం రౌండ్ రాబిన్' టోర్నీలో తొలి నార్మ్ సాధించిన వర్షిణి... ఈ ఏడాది ఆగస్టులో 'కనిజ్సా ఓపెన్'లో రెండో నార్మ్ దక్కించుకుంది.

**నాన్న బాటలోనే ప్రయాణం...**


విశాఖపట్నానికి చెందిన సాహితి వర్షిణి మహిళా గ్రాండ్ మాస్టర్ టైటిల్ సాధించిన మూడో ఆంధ్రప్రదేశ్ అమ్మాయిగా చరిత్రకెక్కింది. తండ్రి లోకేశ్వరరావు స్వతహాగా చెస్ క్రీడాకారుడు కావడంతో తన ఇద్దరు కుమార్తెలను కోనేరు హంపిలా ప్రపంచ స్థాయి క్రీడాకారిణులుగా తీర్చిదిద్దాలని కలలుకన్నారు. సాహితిలో ఉన్న చురుకుదనాన్ని గమనించి ఐదేళ్ల వయసు నుంచే శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. ఏడేళ్ల వయసుకే ఆమె రాష్ట్ర స్థాయిలో ఛాంపియన్‌గా, జాతీయ స్థాయిలో రన్నరప్‌గా నిలిచి సత్తా చాటింది. దాంతో చదరంగాన్నే కెరీర్‌గా ఎంచుకుని ముందుకెళ్లింది.

**మలుపుతిప్పిన ఆసియా పోటీలు**

ఉజ్బెకిస్తాన్‌లో 2017లో జరిగిన ఆసియా చెస్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సాహితి క్లాసికల్, బ్లిట్జ్ రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించింది. మరుసటి ఏడాది థాయిలాండ్‌లో జరిగిన పోటీల్లో క్లాసికల్, ర్యాపిడ్‌లలో వ్యక్తిగత స్వర్ణాలు, బ్లిట్జ్‌లో కాంస్యంతో పాటు మూడు టీమ్ విభాగాల్లో స్వర్ణాలు నెగ్గి మొత్తం ఆరు పతకాలతో సంచలనం సృష్టించింది. కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత 2023 నుంచి మళ్లీ పూర్తిస్థాయిలో పోటీల్లో పాల్గొంటున్న సాహితి.. వరల్డ్ ఛాంపియన్‌షిప్‌లో ఆడటంతో పాటు ప్రపంచ టాప్-10లో చోటు సంపాదించడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపింది.

## ఆసియా గేమ్స్ కోసం 702 కోట్లు ఖర్చు

ఢిల్లీ: ఆసియా క్రీడల్లో క్రీడాకారుల నుంచి అత్యుత్తమ ప్రదర్శన ఆశిస్తున్న భారత్.. ఈ గేమ్స్‌లో అథ్లెట్ల సన్నాహకం నిమిత్తం వారిపై రూ.702 కోట్లను వెచ్చించింది. మూడేడ్లుగా ఆటగాళ్లకు శిక్షణ, కోచ్‌ల నియామకం, వారికి అవసరమైన పరికరాలు, వసతుల కల్పన వంటి వాటిపై ఈ ఖర్చు చేసినట్టు 'టాప్స్' సీఈవో ఎన్ఎస్ జోహాల్ తెలిపాడు. ఈ క్రీడల కోసం భారత్ మొత్తం 501 అథ్లెట్లను పంపిస్తుండగా వీరిలో 310 మంది ఆసియాడ్‌లో ఆడనుండటం ఇదే తొలిసారి. గత ఎడిషన్‌లో 106 పతకాలు సాధించిన భారత్.. ఈసారి ఆ సంఖ్యను మరింత పెంచాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది.



చైతన్య రథం
సినిమా
గురువారం 17 సెప్టెంబరు 2026 X

# బత్తా... టీజర్ విడుదల




కోలీవుడ్ స్టార్ హీరో మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి నటిస్తున్న తాజా చిత్రం 'బత్తా'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన టీజర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'నడువుల కొంచెం పక్కత్తా కానుమ్మ?', 'సీతకాతి' వంటి విభిన్న చిత్రాల తర్వాత విజయ్ సేతుపతి, దర్శకుడు బాలాజీ తరుణీధరన్ కాంబినేషన్‌లో వస్తున్న మూడో సినిమా కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. పూర్తిగా 1960ల నాటి వింటేజ్ బ్యాక్‌డ్రాప్‌లో పీరియాడికల్ యాక్షన్, ఎమోషనల్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. విజయ్ సేతుపతి సరసన 'జై భీమ్' ఫేమ్ లిజో మోల్ జోస్ హీరోయిన్‌గా నటిస్తోంది. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండగా ఇటీవల విడుదలైన 'మగలే' అనే తండ్రీకూతుళ్ల భావోద్వేగ పాట ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రముఖ దర్శకుడు అట్లీ ఈ చిత్రాన్ని ప్రెజెంట్ చేస్తుండటం విశేషం. విజయ్ సేతుపతి వింటేజ్ లుక్‌లో బీడీ కాలుస్తూ చాలా డిఫరెంట్ స్టైల్‌లో కనిపిస్తున్న ఈ సినిమా టీజర్ సినిమాపై క్యూరియాసిటీని పెంచేసింది. విడుదల తేదీని మేకర్స్ త్వరలో ప్రకటించనున్నారు.

# హాలీవుడ్‌కి విజయ్ సేతుపతి 'మహారాజా'




టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన విజయ్ సేతుపతి బ్లాక్‌బస్టర్ మూవీ 'మహారాజా' ఇప్పుడు హాలీవుడ్‌లో రీమేక్ కాబోతున్నట్టు తెలుస్తోంది. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ యాక్షన్ థ్రిల్లర్ కంటెంట్ పరంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా హాలీవుడ్ రీమేక్‌కు సంబంధించిన వార్తలపై చిత్ర నిర్మాత సుధన్ సుందరం స్పందించారు. ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆయన మాట్లాడుతూ.. 'మహారాజా రీమేక్ హాలీవుడ్ రైట్స్ కోసం అక్కడి ప్రముఖ ఏజెన్సీ మమ్మల్ని సంప్రదించింది. ప్రస్తుతం హాలీవుడ్‌లోని ఓ ప్రముఖ ఏజెన్సీ ఈ ప్రాజెక్ట్‌ను సెట్ చేసే ప్రయత్నాల్లో ఉంది. ఆస్కార్ విన్నర్, స్టార్ హీరో మాథ్యూ మెక్‌కానెగీతో పాటు మరికొంత మంది ప్రముఖ నటులతో చర్చలైతే నడుస్తున్నాయి. అయితే ఏజెన్సీ నుంచి అధికారిక కన్ఫర్మేషన్ రావాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాదే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉంది' అని వెల్లడించారు.

### కన్నడ దిగ్గజ నటుడు అనంత్ నాగ్‌కు

# 'దాదాసాహెబ్ ఫాల్కే' పురస్కారం



ప్రముఖ కన్నడ నటుడు అనంత్ నాగ్‌ను భారతీయ చిత్ర సీమలో అత్యున్నత పురస్కారమైన 'దాదాసాహెబ్ ఫాల్కే' అవార్డు వరించింది. 2024 సంవత్సరానికి గానూ భారతీయ సినిమాకు ఆయన అందించిన విశిష్ట సేవలు, సుదీర్ఘ సినీ ప్రస్థానానికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రకటిస్తున్నట్టు కేంద్ర సమాచార ప్రసార శాఖ వెల్లడించింది. ఈ నెల 22న గుజరాత్‌లోని కేవడియా (ఏకతా నగర్)లో నిర్వహించే 72వ జాతీయ చలన చిత్ర అవార్డుల కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఆయన ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

**అభిమానులను అలరించిన విలక్షణ నటన**

నాటక రంగం ద్వారా నటుడిగా కెరీర్ ప్రారంభించిన అనంత్ నాగ్ 1973లో వచ్చిన కన్నడ చిత్రం 'సంకల్ప'తో వెండితెరపై అడుగుపెట్టారు. కన్నడతో పాటు తెలుగు, హిందీ, మరాఠీ, మలయాళం, ఇంగ్లీష్ భాషల్లో ఇప్పటివరకు 300కు పైగా చిత్రాల్లో నటించి మెప్పించారు. శ్యామ్ బెనెగల్ రూపొందించిన 'మంథన్', 'కొందూర', 'కలియుగ్' వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించారు. ప్రసిద్ధ రచయిత ఆర్‌కే నారాయణ్ కథల ఆధారంగా తెరకెక్కిన ప్రముఖ టీవీ సిరీస్ 'మాల్గుడి డేస్'లో మిఠాయివాలా పాత్రలో విలక్షణ నటనతో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారు.

అలరించిన వైవిధ్యభరిత పాత్రలు: 'బయలుదారి', 'కణ్ణేశ్వర రామ', 'గోధి బణ్ణ సాధారణ మైకట్టు', 'రాజకుమార', 'గాలిపట-2', 'కేజీఎఫ్' వంటి సూపర్ హిట్ సినిమాలు ఆయనకు నటుడిగా ఎంతో పేరు తెచ్చిపెట్టాయి. 'ప్రేమలేఖలు', 'అనుగ్రహం', 'భీష్మ', 'బాలు', 'శంభోశివ శంభో' తదితర చిత్రాల్లో నటించి తెలుగు ప్రేక్షకులకు కూడా దగ్గరయ్యారు.

రాజకీయాల్లోనూ ప్రత్యేకం: కేవలం వెండితెరపైనే కాకుండా కర్ణాటక రాజకీయాల్లోనూ అనంత్ నాగ్ కీలక పాత్ర పోషించారు. మల్లేశ్వరం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై శాసనసభ్యుడిగా, మంత్రిగా సేవలు అందించారు. భారత ప్రభుత్వం 2025లో ఆయన్ను గౌరవిస్తూ 'పద్మభూషణ్' పురస్కారాన్ని ప్రదానం చేయగా ఇప్పుడు ఫాల్కే అవార్డు వరించడం విశేషం.

# వివాహ బంధానికి 20 ఏళ్లు

### పిల్లల సమక్షంలో మరోసారి ఒక్కటైన సూర్య-జ్యోతిక



కోలీవుడ్‌లో అత్యంత ఆదర్శవంతమైన స్టార్ దంపతులుగా పేరు తెచ్చుకున్న సూర్య, జ్యోతిక మరోసారి వివాహ బంధంతో ఒక్కటయ్యారు. తమ వివాహం జరిగి 20 ఏళ్లు పూర్తి కావడంతో పిల్లలు, అత్యంత సన్నిహితుల సమక్షంలో వారు ఘనంగా పెళ్లి వేడుకలు చేసుకున్నారు. నిజానికి సూర్య, జ్యోతిక 2006 సెప్టెంబరు 11న వివాహం చేసుకున్నారు. అప్పట్లో పెద్దల అంగీకారంతో ఘనంగా ఒక్కటైన ఈ జంట ఇండస్ట్రీలోను, రియల్ లైఫ్‌లోను బెస్ట్ కపుల్‌గా నిలిచింది. ఇప్పుడు సరిగ్గా ఇరవై ఏళ్లు పూర్తయిన సందర్భంగా వారు మరోసారి ఈ వేడుక జరుపుకున్నారు. ఈ సుందరమైన క్షణాలను 'ది సీక్వెల్-20 ఏళ్ల ప్రేమ, పోరాటం' అంటూ అభివర్ణిస్తూ... ఇందుకు సంబంధించిన ప్రత్యేక వీడియోను వారు సోషల్ మీడియా వేదికగా అభిమానులతో పంచుకున్నారు.

ఈ సందర్భంగా జ్యోతిక మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక పెళ్లి వేడుక మాత్రమే కాదని, తమ మధ్య ఉన్న అపరిపూర్ణతలను, సర్దుబాట్లను, అవగాహనను, త్యాగాలను, నిస్వార్థమైన ప్రేమను సెలబ్రేట్ చేసుకునే అద్భుతమైన క్షణమని భావోద్వేగంతో పంచుకున్నారు. తమ పిల్లల సమక్షంలో జరిగిన ఈ వేడుక తమ ప్రయాణానికి మరింత ప్రత్యేకత తెచ్చిందని ఆమె తెలిపారు. ప్రస్తుతం సూర్య-జ్యోతిక ఈ అరుదైన వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుండగా... టాలీవుడ్, కోలీవుడ్ సెలబ్రిటీలతో పాటు అభిమానులు ఈ క్యూట్ దంపతులకు హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.

# మైథలాజికల్ మూవీలో తమన్నా...

### ఆసక్తికరంగా 'ది వాన్' ట్రైలర్

స్టార్ హీరోయిన్ తమన్నా భాటియా, హీరో సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'ది వాన్'. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇది కేవలం సాధారణ హారర్ సినిమా కాకుండా, పురాతన నమ్మకాలు, దైవిక శక్తుల ఆధారంగా సాగే ఒక విభిన్నమైన ఫాంటసీ థ్రిల్లర్‌గా కనిపిస్తోంది. ఒక ఆధునిక భావాలున్న పట్టణ యువకుడు (సిద్ధార్థ్ మల్హోత్రా) తన పూర్వీకుల గ్రామంలోని ప్రవేశ నిషేధమున్న ఒక రహస్య అడవిలోకి ప్రవేశించి, అక్కడ ఒక దివ్యమైన శక్తిని లేదా అదృశ్య రూపాన్ని మేల్కొలపడం వంటి అంశాల చుట్టూ కథ తిరుగుతుంది. దీనివల్ల వారు ఎదుర్కొనే ఊహించని భయానక పరిణామాలు, ప్రమాదకర పరిస్థితులు ఏంటి అనేది ఈ సినిమా కథ. సినిమాలో తమన్నా పాత్ర అత్యంత కీలకమైనదిగా తెలుస్తోంది. భారీ విజువల్స్, ఉత్కంఠభరితమైన మలుపులతో వస్తున్న ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.







# 'ఆస్మాన్' టీజర్ వచ్చేసింది

టాలీవుడ్ దివంగత నటుడు శ్రీహరి తనయుడిగా సినీ రంగంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడానికి శ్రమిస్తున్న యువ నటుడు మేఘాంశ్ శ్రీహరి తాజాగా మరో కొత్త చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నాడు. ఆయన పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ విడుదల చేసిన 'ఆస్మాన్' టీజర్ ప్రస్తుతం సినీ వర్గాల్లో, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. విభిన్నమైన కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ సినిమాపై ప్రేక్షకుల్లో అంచనాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. శ్రీక్లీంకార సెల్యూలాయిడ్ పతాకంపై కొండారు శ్రీనివాసరావు సమర్పణలో కొండారు వెంకటేష్, శ్రీకాంత్ మన్నెం సంయుక్తంగా ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. రామ్‌నందన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్లు ఇప్పటికే మంచి బజ్ సృష్టించగా... తాజాగా హీరో మేఘాంశ్ శ్రీహరి జన్మదినం సందర్భంగా విడుదలైన టీజర్ సినిమా స్థాయిని మరింత పెంచేలా ఉంది.